


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 195

శుక్రవారం 31-3-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వాల్‌స్ట్రీట్ జర్నల్ విలేఖరి అరెస్ట్

అమెరికా ఆదేశాలతో పనిచేస్తున్నాడని రష్యా ఆరోపణ - 6లో



చిన్న షేర్లు కుదేల్!

2022-23లో స్మాల్‌క్యాప్ సూచీ 1,617 పాయింట్ల పతనం - 13లో



'అనర్హత వేటు'ను గమనిస్తున్నాం

రాహుల్‌పై అనర్హత వేటు, తదనంతర పరిణామాలను గమనిస్తున్నామని జర్మనీ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి చెప్పారు.

వివరాలు 6లో ▸



'నవమి' ఉద్రిక్తతలు

శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

వివరాలు 6లో ▸



త్రిపుర అసెంబ్లీలో అశ్లీల వీక్షణం

త్రిపుర శాసనసభలో బీజేపీ ఎమ్మెల్యే జాదవ్ లాల్‌నాథ్ తన సెల్‌ఫోన్‌లో అశ్లీల వీడియోలు చూస్తూ దొరికిపోయాడు.

వివరాలు 6లో ▸



కోతల వేళ శుభవార్త

హెచ్-1బీ వీసాదారుల జీవితభాగస్వాములు కూడా అమెరికాలో ఉద్యోగం చేసుకోవచ్చని అమెరికా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

వివరాలు 6లో ▸

అక్రమాలు నిజం!

సీఐడీ దర్యాప్తులో అంగీకరించిన మార్గదర్శి చార్టర్డ్ అకౌంటెంట్ శ్రావణ్

కోర్టు ఎదుట హాజరుపరిచిన సీఐడీ.. 14 రోజుల రిమాండ్

- ప్రతి ఏటా మార్గదర్శి బ్యాలెన్స్ షీట్లో వందల కోట్ల చెక్కులు, నగదు
- ఆ తర్వాత చెక్కులేమయ్యాయనే ప్రస్తావనే ఉండదు.. నగదూ అంతే
- నిజానికివి సంస్థలో లేకున్నా... ఖాతాల్లో మాత్రం చూపిస్తూ కొనసాగింపు
- అప్పటికే అవి ఇతర సంస్థల్లోకి... లేదా ఇతర ఖాతాల్లోకి మళ్లింపు
- సంస్థలో లేని ఆస్తుల్ని చూపిస్తూ చిట్‌దారులకు నమ్మకం కలిగించే యత్నం
- ఫ్యూచర్ సబ్‌స్క్రిప్షన్‌గా వచ్చిన మొత్తాలకోసం ప్రత్యేక ఖాతాలూ లేవు
- చట్టాలను తుంగలోతొక్కి హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి తరలింపు
- వాటికి 4–5 శాతం వడ్డీ చెల్లించేలా వినియోగదారులకు రశీదులు
- అలా డిపాజిట్లు సేకరిస్తూ ఆర్‌బీఐ నిబంధనలకు రామోజీ తూట్లు
- ఈ రికార్డులు పరిశీలించకుండానే ఆడిట్ సర్టిఫికెట్ ఇస్తున్న బ్రహ్మయ్య అండ్ కో
- నిధుల మళ్లింపు, అక్రమ డిపాజిట్లు, అక్రమ పెట్టుబడులు వాస్తవమే



సాక్షి, అమరావతి: ప్రతి ఏటా మార్చి 31న రూపొందించే బ్యాలెన్స్‌షీట్‌లో... చెల్లించాల్సిన బకాయిలు, ఇతర అప్పులకు సమానంగా తమ వద్ద వందల కోట్ల రూపాయల చెక్కుల రూపంలో, మరికొన్ని వందల కోట్ల రూపాయలు నగదు రూపంలో ఉన్నట్లు చూపిస్తున్నారు. వాటిని తమ ఆస్తులుగా పేర్కొంటున్నారు. మరి ఆ చెక్కుల్ని తదుపరి కాలంలో ఎప్పుడైనా డిపాజిట్ చేయాలి కదా? ఆ నగదును సంస్థ అవసరాల కోసం ఖర్చు చేయాలి కదా? విచిత్రమేంటంటే అందులో పేర్కొన్న చెక్కుల్లో ఒక్క చెక్కు కూడా తరువాతి కాలంలో సంస్థ ఖాతాలోకి వచ్చిన దాఖలాలు ఉండటం లేదు. నగదు పరిస్థితి కూడా అంతే!!. అంటే ఆ చెక్కులు గానీ, ఆ నగదు కానీ వాస్తవంగా కంపెనీ దగ్గర ఉన్నవి కావన్న మాట!!. వాటిని అప్పటికే వేరే సంస్థల ఖాతాల్లోకో, ఇతరత్రా అవసరాలకో మళ్లించేశారు. కానీ... అవన్నీ తమ వద్దే ఉన్నట్లుగా తప్పుడు బ్యాలెన్స్‌షీట్ ద్వారా మభ్య పెడుతున్నారు. తమ సంస్థ తగిన ఆస్తులతో బలంగానే ఉన్నదని ఒకవైపు చిట్లు వేస్తున్న చిట్‌దారులను, మరోవైపు నియంత్రణ సంస్థలను నమ్మిస్తున్నారు. ఇదీ.. రామోజీరావు నడిపిస్తున్న 'మార్గదర్శి' అసలు కథ. మార్గదర్శి సంస్థను ఆడిట్ చేస్తున్న ఆడిటింగ్ సంస్థల ప్రతినిధి నేరుగా దర్యాప్తు సంస్థ ఎదుట అంగీకరించిన వాస్తవం. ఇదే కాదు. తనిఖీలకు అడుగడుగునా అడ్డుపడుతున్న మార్గదర్శిలో... ఎక్కడ ఏ సోదా జరిపినా నివ్వెరపోయే నిజాలే వెలుగుచూస్తున్నాయి. వాస్తవాలను బయటకు వెల్లడించకపోవటం ద్వారా..

మిగతా 2వ పేజీలో ▶

ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం జగన్



పోలవరం తాజా అంచనాలు

ఆమోదించాలి

- అడహాక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలి.. ఏపీకి రావాల్సిన బకాయిలు విడుదల చేయండి
- రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ రూ.36,625 కోట్లు ఇవ్వాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం జగన్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) నిర్ధారించిన పోలవరం ప్రాజెక్టు తాజా అంచనాలు రూ.55,548 కోట్లకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. పోలవరం ప్రాజెక్టును వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహాక్‌గా రూ.10 వేల కోట్లు

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

నాలుగు రోజుల పాటు తేలికపాటి వానలు



రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పలుచోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

వివరాలు 2 ▸

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఏలూరు జిల్లా భీమడోలు రైల్వే గేటు వద్ద దురంతో ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. రైల్వే గేటును ఓ బొలెరో వ్యాన్ ఢీకొట్టి పట్టాలపై నిలిచిపోగా.. అదే సమయంలో వచ్చిన దురంతో ఎక్స్‌ప్రెస్ ఆ వ్యాన్‌ను ఢీకొట్టింది. అప్పటికే వ్యాన్‌లోని వ్యక్తులు పారిపోగా.. రైలింజన్ దెబ్బతింది.

వివరాలు 14 ▸

నేవీ కారు యాత్ర ప్రారంభం



దేశ భద్రత, నారీ శక్తి ప్రదర్శన, అగ్నిపథ్‌పై అవగాహన కల్పించేందుకు తూర్పు నావిక దళం గురువారం కారు యాత్రను చేపట్టింది. విశాఖపట్నం నుంచి తిరునల్వేలి వరకు ఐదు రోజులపాటు ఈ యాత్ర కొనసాగుతుంది.

వివరాలు 14 ▸



ఒంటిమిట్టలో మార్మోగిన రామనామ స్మరణ

- స్వామికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి
- కోదండరాముడిని దర్శించుకున్న మంత్రి అంబటి రాంబాబు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి
- శ్రీరాముడి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా రామనామ స్మరణ మార్మోగింది. టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు ఆధ్వర్యంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సతీ సమేతంగా శ్రీకోదండరామస్వామికి ప్రభుత్వ లాంఛనాలతో పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే అందజేసిన ముత్యాల తలంబ్రాలను స్వామి కల్యాణ వేదిక వద్ద తలంబ్రాలలో కలిపారు. అనంతరం స్వామి స్నపన తిరుమంజనంలో ఎమ్మెల్యే మేడా దంపతులు పాల్గొన్నారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి దంపతులు..

మిగతా 5వ పేజీలో ▶

గద్దె దించేందుకు ఢిల్లీకి పోదాం

విపక్షాలకు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పిలుపు



నిధుల విడుదలలో మోదీ ప్రభుత్వం వివక్ష చూపిస్తోందంటూ కోల్‌కతాలో ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ చేస్తున్న ధర్నా రెండో రోజు కూడా కొనసాగింది. ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీని గద్దె దించేందుకు విపక్ష పార్టీలన్నీ ఢిల్లీ దిశగా కదం తొక్కాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ధరాభారం నుంచి పేదలను కాపాడాలంటే బీజేపీని అధికారం నుంచి పక్కనబెట్టాల్సిందేనని అన్నారు. తప్పుడు కేసులు, బెదిరింపుల ద్వారానే బీజేపీ పాలన సాగిస్తోందని ఆమె మండిపడ్డారు.

6లో

సోషల్ మీడియా సమాచారాన్ని నమ్మొద్దు



- జేఈఈ పరీక్షల అంశంపై ఎన్టీఏ స్పష్టీకరణ
- యూట్యూబ్ చానళ్లు, ఇతర వేదికల ప్రచారం అవాస్తవం
- నేరుగా అధికారిక వెబ్‌సైట్ చూడాలని సూచన

సాక్షి, అమరావతి: జేఈఈ పరీక్షలపై సోషల్ మీడియాలో వచ్చే 'ఇన్ సైడర్' (ఎన్టీఏ వర్గాల నుంచి అందిన సమాచారం) పేరుతో వచ్చే సమాచారాన్ని నమ్మొద్దని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విద్యార్థులకు సూచించింది. పరీక్షలకు సంబంధించిన సిటీ ఇంటిమేషన్ తదితర అంశాలపై తప్పుడు సమాచారం ఇస్తున్నాయని పేర్కొంది. 'జేఈఈ (మెయిన్) 2023 సెషన్ 2కు సంబంధించిన సిటీ ఇంటిమేషన్ స్లిప్, అడ్మిట్ కార్డ్ విడుదల తేదీపై సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీడియోలు ప్రసారం అవుతున్నాయని మా దృష్టికి వచ్చింది. అవి ఫేక్. విద్యార్థులను తప్పుదారి పట్టించేలా ఉన్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇలాంటి వీడియోలను నమ్మొద్దు. ఈ వీడియోలను

మిగతా 2వ పేజీలో ▶



'పదహారేళ్ల' పండుగ

- నేటి నుంచి ఐపీఎల్ 16వ సీజన్ టి20 క్రికెట్ టోర్నీ జరగనుంది. అహ్మదాబాద్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌తో నాలుగుసార్లు విజేతగా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది. 2018 తర్వాత మళ్లీ ఐపీఎల్‌లో ప్రారంభోత్సవ వేడుకలు జరగబోతున్నాయి. తొలి రోజు ఆటతో పాటు కత్రినా కైఫ్, టైగర్ ష్రాఫ్, రష్మిక, తమన్నా, అర్జిత్ సింగ్ తదితరులు అలరించనున్నారు.

- వివరాలు 13లో



క్వార్టర్ ఫైనల్లో సింధు, శ్రీకాంత్

ఈ ఏడాది తొలి టైటిల్ కోసం వేచి చూస్తున్న భారత స్టార్ షట్లర్స్ పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 21–14, 21–16తో ఇండోనేసియా క్రీడాకారిణి కుసుమ వర్దినిపై విజయం సాధించింది.

- వివరాలు 13లో

స్థిరమైన ఆర్థిక నగరాల నిర్మాణం

వర్క్‌షాపులో వ్యూహాలను సమర్పించిన జీ-20 దేశాల ప్రతినిధులు

- భారత్ సహా మరో ఐదు దేశాల ప్రతినిధులు హాజరు
- సదస్సులో ఆయా దేశాల్లోని అంతర్జాతీయ ఉత్తమ పద్ధతుల ప్రదర్శన
- విశాఖలో మూడోరోజు జీ–20 సదస్సులో సమగ్ర చర్చ



వర్క్‌షాపునకు హాజరైన జీ-20 దేశాల ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్తులో స్థిరమైన ఆర్థిక నగరాల నిర్మాణంపై జీ–20 దేశాల ప్రతినిధులు తమతమ వ్యూహాలను సమర్పించారు. విశాఖపట్నంలో జరుగుతున్న జీ–20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు (ఐడబ్ల్యూజీ) సమావేశాల్లో మూడోరోజైన గురువారం 'సామర్థ్య నిర్మాణం'పై వర్క్‌షాపును ఇండియన్ ప్రెసిడెన్సీ, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సదస్సులో జీ–20 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఫైనాన్సింగ్‌లలో అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను చర్చించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. స్థానిక ప్రభుత్వాలు సమగ్ర, స్థిరమైన నగరాల కోసం అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఆర్థిక సాయం చేయడానికి అవసరమైన సామర్థ్యాలపై దృష్టిసారించారు. వర్క్‌షాపు మొదటి సెషన్‌లో భారత్ సహా సింగపూర్, దక్షిణ కొరియా, రష్యా, చైనా, యూరోపియన్ కమిషన్ నిపుణులు తమ దేశాల్లో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను ప్రదర్శించారు. సింగపూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఏజెన్సీ మాజీ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డైరెక్టర్ జనరల్ అహ్ తువాన్‌లోహ్.. సింగపూర్ విధానాలు, సమ్మిళిత, స్థిర నగరాలను నిర్మించే వ్యూహాలను సమర్పించారు. ఇందులో డైనమిక్ అర్బన్ గవర్నెన్స్ సిస్టంతో సహా జీవించడం, ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లానింగ్, అభివృద్ధి, వ్యర్థాలు, నీటి నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, విద్య తదితర అంశాలపై వివరించారు. సెషన్ అనంతరం దక్షిణ కొరియా ప్రతినిధులు పట్టణాభివృద్ధి..

మిగతా 2వ పేజీలో ▶

బావి వద్ద సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్న సిబ్బంది



ఇండోర్ ఆలయంలో విషాదం

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో విషాదం చోటుచేసుకుంది. నవమి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే పూజా కార్యక్రమాలు తిలకించేందుకు వచ్చినవారు బావి పైకప్పు మీద నిలబడగా అది కూలిపోయింది. ఈ ప్రమాదంలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

6లో

4 రోజులు తేలికపాటి వానలు

- కొనసాగుతున్న ఉపరితల ద్రోణి
- వర్షాలకు ఈదురుగాలులు తోడు
- అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో మరో నాలుగు రోజులు తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. కొద్దిరోజులుగా రాష్ట్రంలో చెదురు మదురుగా వానలు పడుతున్నాయి. ప్రస్తుతం ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు విదర్భ, కర్ణాటకల మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ గురువారం తెలిపింది. అదే సమయంలో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని పేర్కొంది. అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపింది. గురువారం పార్వతీపురం మన్యం జిల్లా బలిజపేటలో 2.6 సెంటీమీటర్లు, అన్నమయ్య జిల్లా నూతనకల్వలో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

న్యాయవాదులకు బీమా ప్రీమియం చెల్లింపుపై హర్షం

- సీఎం వైఎస్ జగన్‌కు ఏపీ కాపు అడ్వొకేట్స్ అసోసియేషన్ ధన్యవాదాలు

పటాన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని న్యాయవాదులందరికీ బీమా పాలసీ మూడో వంతు ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించడంపై ఏపీ కాపు అడ్వొకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నరహరశెట్టి శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. గ్రూప్ మెడి క్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీకి సంబంధించి మూడో వంతు ప్రీమియాన్ని చెల్లించేందుకు ప్రభుత్వ పక్షాన గ్రాంట్ విడుదల చేయాలని ఆదేశాలు జారీచేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. సీఎం జగన్ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 15వేల మంది న్యాయవాదులకు మేలు కలుగుతుందన్నారు. న్యాయవాదుల సంక్షేమంపై చొరవ చూపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని శ్రీహరి తెలిపారు.

14 యూనివర్సిటీల పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు

సాక్షి అమరావతి/రాజానగరం: రాష్ట్రంలోని 14 యూనివర్సిటీల పాలక వర్గాల(ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్ల–ఈసీల) పదవీకాలాన్ని మరో 60 రోజులు పొడిగించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు 14 యూనివర్సిటీల ఈసీల పదవీకాలాన్ని పొడిగిస్తూ ఉన్నత విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి జె.శ్యామలరావు బుధవారం రాత్రి జీవో 48ను విడుదల చేశారు. వీటిలో ఆదికవి నన్నయ, ఆచార్య నాగార్జున, ఆంధ్రా, కృష్ణా, రాయలసీమ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, శ్రీకృష్ణదేవరాయ, విక్రమ సింహపురి, యోగి వేమన, జేఎన్‌టీయూ అనంతపురం, జేఎన్‌టీయూ కాకినాడ, ద్రావిడ, శ్రీవేంకటేశ్వర, శ్రీపద్మావతి మహిళ యూనివర్సిటీ ఉన్నాయి.

తెలంగాణ

నేటి అర్ధరాత్రి నుంచే పెరిగిన టోల్ అమలు

- 5.5 శాతం మేర పెంచిన జాతీయ రహదారుల సంస్థ



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల్లో చార్జీల పెంపు శుక్రవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానుంది. రోడ్ల నిర్వహణకు సంబంధించి ఏటా ఏప్రిల్ ఒకటి నుంచి చార్జీల పెంపును ఆనవాయితీగా తీసుకున్న జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ).. ఈసారి కూడా కొత్త చార్జీలను సిద్ధం చేసింది. గతేడాది వివిధ కేటగిరీల వాహనాలకు సంబంధించి 8 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచగా.. ఈసారి వాహనదారులపై కాస్త దయతలిచి 5.50 శాతంలోపే పెంపును పరిమితం చేసింది. విజయవాడ రహదారిలోని పంతంగి టోల్ ప్లాజాను ఉదాహరణగా తీసుకుంటే.. గతేడాది కారు/జీపు/వ్యాన్ కేటగిరీలో చార్జీని రూ.80 నుంచి రూ.90కి అంటే రూ.10 పెంచగా... ఈసారి రూ.90 నుంచి రూ.95కు అంటే రూ.5 మాత్రమే పెంచింది. ఇక గతేడాది టోల్ ధరలు అమల్లోకి వచ్చాక కొత్తగా ఐదు ప్రాంతాల్లో టోల్‌గేట్లు అందుబాటులోకి వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరంలో టోల్‌ప్లాజాల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ.1,820 కోట్లు సమకూరాయి. ఈసారి దేశవ్యాప్తంగా మరిన్ని టోల్‌గేట్లు అందుబాటులోకి రావడం, ధరల పెంపు నేపథ్యంలో టోల్ వసూళ్లు రూ.2 వేలకోట్లను దాటిపోతాయని అంచనా.

పంతంగి వద్ద కొత్త చార్జీల వివరాలివీ.. (రూ.లలో)



	సింగిల్ జర్నీ		రిటర్న్ జర్నీ	
	పాత	కొత్త	పాత	కొత్త
కారు/జీపు/వ్యాన్ లైట్ వెహికల్స్	90	95	135	140
లైట్ కమర్షియల్, మినీ బస్ తదితర..	140	150	210	220
బస్సు, ట్రక్కు	290	305	435	460
హెవీ వెహికల్స్	560	590	845	885

చిల్లకల్లు టోల్‌ప్లాజాలో..

- కారు, జీప్ సింగిల్ ట్రిప్ రూ.100 నుంచి రూ.105కు, రిటర్న్ జర్నీ రూ.150–రూ.160, నెలపాస్ రూ.3,350–రూ.3,520కు పెంచారు.
- లైట్ కమర్షియల్ వాహనాలకు సింగిల్ ట్రిప్ రూ.160 నుంచి రూ.165కు, రిటర్న్ జర్నీ రూ.240–రూ.250, నెలపాస్ రూ.5,290–రూ.5,560కు..
- బస్సు, ట్రక్కులకు సింగిల్ ట్రిప్ రూ.330–రూ.345, రిటర్న్ జర్నీ రూ.490–రూ.515, నెలపాస్ రూ.10,940–రూ.11,495కు..
- హెవీ వెహికల్స్ సింగిల్ ట్రిప్ రూ.635–రూ.665, రిటర్న్ జర్నీ రూ.955–రూ.1,000, నెలపాస్ రూ.21,170–రూ.22,240కు సవరించారు.

సోషల్ మీడియా సమాచారాన్ని నమ్మొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

హోస్ట్ చేస్తున్న యూట్యూబ్ చానళ్ల బారిన పడొద్దు' అని గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. జేఈఈ (మెయిన్) పరీక్షకు సంబంధించిన అధికారిక సమాచారం కోసం ఎన్టీఏ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించింది. సిటీ ఇంటిమేషన్ స్లిప్, అడ్మిట్ కార్డ్ విడుదల తేదీలు ఎన్టీఏ వెబ్‌సైట్‌లో, పబ్లిక్ నోటీసు ద్వారా మాత్రమే ప్రకటిస్తామని స్పష్టం చేసింది. మరింత స్పష్టత కోసం 011–40759000 నంబరులో సంప్రదించవచ్చని తెలిపింది. లేదా jeemain@nta.ac.in కు మెయిల్ చేయవచ్చని వివరించింది.

విహార ప్రపంచానికి విశాఖ నగరం మరోసారి ముస్తాబవుతోంది. పర్యాటక రంగంలో కీలకమైన క్రూయిజ్ సేవలందించేందుకు ఈసారి రెండు నౌకలు సిద్ధమవుతున్నాయి. సాగర జలాల్లో మూడు రోజులపాటు విహరిస్తూ.. విశాఖ నుంచి దక్షిణ భారత దేశంలోని పలు నగరాలకు సర్వీసులు నడిపేందుకు క్రూయిజ్ సంస్థలు సిద్ధమవుతున్నాయి. మే నెల నుంచి ఎంఎస్‌సీ సంస్థ, జూన్ నుంచి కార్డిలియా సంస్థ సర్వీసులను ప్రారంభించనున్నాయి. మరోవైపు విశాఖపట్నం పోర్టులో నిర్మిస్తున్న క్రూయిజ్ టెర్మినల్ మే నాటికి అందుబాటులోకి రానుంది.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం



కార్డిలియా క్రూయిజ్ షిప్

సాగర యాత్రకు సిద్ధం కండి

- మరోసారి విశాఖ నుంచి ప్రయాణికుల నౌకలు
- మే నుంచి ఎంఎస్‌సీ సంస్థ నౌక
- జూన్ నుంచి కార్డిలియా సేవలు
- చెరో ఆరు నెలలు సర్వీసులు నడిపేందుకు ఆసక్తి
- మే నుంచి అందుబాటులోకి క్రూయిజ్ టెర్మినల్



ఎంఎస్‌సీ క్రూయిజ్ షిప్

గతేడాది విశాఖ నుంచి చెన్నైకు సర్వీసులు నడిపిన ఎంప్రెస్ సంస్థకు చెందిన కార్డిలియా క్రూయిజ్ నౌక తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు మధురానుభూతిని అందించింది. ఇప్పుడు దాంతోపాటు స్విట్జర్లాండ్ ప్రధాన కేంద్రంగా లండన్, వెనిస్, ఇటలీ సహా ప్రపంచవ్యాప్తంగా సర్వీసులు నడిపిస్తున్న ఎంఎస్‌సీ క్రూయిజ్ సంస్థ కూడా విశాఖ కేంద్రంగా సేవలకు సిద్ధమైంది. ఈ రెండు సంస్థల ప్రతినిధులు రెండు రోజుల క్రితం విశాఖపట్నం పోర్టు అధికారులతో సంప్రదింపులు జరిపారు. వీటికి అనుమతులు ఇచ్చేందుకు పోర్టు అంగీకారం తెలిపింది. ఎంఎస్‌సీ క్రూయిజ్ మే నుంచి, కార్డిలియా నౌక జూన్ నుంచి సర్వీసులు నడపనుంది. ప్రతి మూడు రోజులకోసారి రోజు విడిచి రోజు నడిపించేలా పోర్టు అధికారులు వీటికి బెర్తులు అందించనున్నారు. ఒక్కో క్రూయిజ్ ఆరు నెలల పాటు విశాఖ నుంచి సర్వీసులు నడపనుంది. త్వరలోనే సర్వీసుల వివరాలను ఈ సంస్థలు ప్రకటించనున్నాయి.

చురుగ్గా టెర్మినల్ నిర్మాణం

విశాఖ పోర్టులోని గ్రీన్‌చానెల్‌లో రూ.72.26 కోట్లతో నిర్మిస్తున్న క్రూయిజ్ బెర్త్, టెర్మినల్ బిల్డింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మే నాటికి ఈ పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా టెర్మినల్‌లో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. సాధారణంగా బెర్త్ 180 మీటర్ల పొడవు కాగా.. ఇక్కడ 330 మీటర్ల భారీ పొడవైన బెర్త్ నిర్మిస్తున్నారు. 15 మీటర్ల వెడల్పు, 9.50 మీటర్ల డ్రెడ్జ్‌డ్ డెప్త్‌తో దీనిని నిర్మిస్తున్నారు. ఈ విశాలమైన బెర్త్ పైకి క్రూయిజ్ రాని సమయంలో సరుకు రవాణా చేసే కార్గో నౌకల్ని కూడా అనుమతిస్తారు. అంతర్జాతీయ పర్యాటకుల ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ కార్యాలయాలతో పాటు పర్యాటకులు సేదతీరేందుకు పర్యాటక భవన్‌ని నిర్మిస్తున్నారు. 2 వేల చదరపు మీటర్ల టెర్మినల్ బిల్డింగ్‌తోపాటు పరిపాలన భవనం, కరెన్సీ మార్పిడి కౌంటర్లు, గ్యాంగ్‌వేస్, రెస్టారెంట్, లాంజ్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్స్, షాపింగ్ మాల్స్, రెస్ట్‌రూమ్స్, టూరిజం ఆపరేటర్స్ కౌంటర్లు కూడా ఇక్కడ ఉంటాయి. గరిష్టంగా 2,500 మంది పర్యాటకులు రావొచ్చు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే విశాఖ నుంచి క్రూయిజ్ సేవలు నిరంతరాయంగా ఉండే అవకాశాలున్నాయని పోర్టు అధికారులు చెబుతున్నారు.

క్రూయిజ్‌లలో ఎన్నో సౌకర్యాలు

ఈ క్రూయిజ్ నౌకలలో ప్రయాణించే వారికి అనేక సౌకర్యాలు ఉంటాయి. ఒక్కోటి 11 అంతస్తులుండే ఈ భారీ నౌకల్లో ఒకేసారి 1,500 నుంచి 2 వేల మంది వరకు ప్రయాణించవచ్చు. వీటిలో ఫుడ్ కోర్టులు, స్పెషాలిటీ రెస్టారెంట్లు, బార్లు, స్పా, సెలూన్, థియేటర్, నైట్ క్లబ్, స్విమ్మింగ్ పూల్స్, ఫిట్‌నెస్ సెంటర్లు, డీజే ఎంటర్‌టైన్‌మెంట్, లైవ్ బ్యాండ్, అడ్వెంచర్ యాక్టివిటీస్, షాపింగ్ మాల్స్, లైవ్ షోలు ఉంటాయి. చిన్నారుల కోసం ప్రత్యేక ఫన్ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. టికెట్ తీసుకున్న వారందరికీ షిప్‌లోని క్యాసినో వరల్డ్‌కు ఎంట్రీ ఉచితం. లిక్కర్, ఇతర సర్వీసులకు అదనపు చార్జీలు ఉంటాయి.


సిద్ధమవుతున్న క్రూయిజ్ టెర్మినల్

పాలీహౌస్‌ల కోసం రోబోటిక్ స్ప్రేయర్

- మానవ రహితంగా ద్రవ ఎరువులు, పురుగుల మందుల పిచికారీ
- రిమోట్ సాయంతో కిలోమీటర్ పరిధిలో పనిచేసే పరికరం

సాక్షి, అమరావతి: ఎరువులు, పురుగు మందుల పిచికారీకి సాంకేతిక పరిజ్ఞానం జోడించడమే లక్ష్యంగా వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ అనుబంధ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు రోబోటిక్ స్ప్రేయర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని సాయంతో పాలీహౌస్, గ్రీన్ హౌస్‌లలో ద్రవ రూప ఎరువులు, పురుగు మందులను మానవ రహితంగా పిచికారీ చేయొచ్చు. పంటల వారీగా శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకే నానో యూరియా, పురుగు మందులను ఈ పరికరం పిచికారీ చేస్తుంది. దీనిద్వారా 20 శాతం యూరియా, పురుగుల మందుల వినియోగం తగ్గడంతోపాటు పెట్టుబడి ఖర్చులు 25 శాతం వరకు ఆదా అవుతాయని క్షేత్రస్థాయి అధ్యయనంలో గుర్తించారు. దిగుబడుల్లో నాణ్యత పెరగడంతోపాటు పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాల ప్రభావం ఉండదని కూడా తేల్చారు.


రోబోటిక్ స్ప్రేయర్‌తో పాలి హౌస్‌లో పంటలకు పిచికారీ చేస్తున్న దృశ్యం

కృత్రిమ మేధస్సుతో..



కృత్రిమ మేధస్సుతో పనిచేసే పరికరాలు, మొబైల్ అప్లికేషన్స్, సెన్సార్లు, డ్రోన్స్, ఆటోమేటిక్ యంత్ర పరికరాలు, వివిధ సాఫ్ట్‌వేర్స్ రూపకల్పన కోసం ఆదికవి నన్నయ, జేఎన్‌టీయూకే, ఎన్ఐటీలతో ఒప్పందాలు చేసుకున్నాం. ఇందులో భాగంగా ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు ప్రోటోటైప్ రోబోటిక్ స్ప్రేయర్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో మార్పుచేసి మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ఇమేజ్ ప్రాసెసింగ్ ద్వారా మొక్కల వ్యాధులు, తెగుళ్లను గుర్తించడంపైనా పరిశోధనలు జరుగుతున్నాయి.

– డాక్టర్ తోలేటి జానకిరామ్, వీసీ, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

ప్రత్యేకతలివీ..

- ఈ పరికరం రిమోట్ కంట్రోల్‌తో కిలోమీటర్ మేర పనిచేస్తుంది.
- ముందుగా కావాల్సిన రసాయన ఎరువు లేదా పురుగు మందులను తొట్టిలో వేసుకుని మెషిన్ ఆన్ చేసి రిసీవర్, ట్రాన్స్‌మీటర్‌ను కనెక్ట్ చేసుకోవాలి.
- రిమోట్ ద్వారా కమాండ్ సిగ్నల్స్‌ను అందిస్తే ఇది పని చేసుకుంటూ పోతుంది. రిమోట్ ద్వారా మెషిన్ దిశను మార్చుకోవచ్చు.
- కంట్రోలర్ బటన్ ద్వారా మెషిన్ వేగం, స్ప్రేయర్ పీడనం మార్చుకోవచ్చు.
- మొక్క ఎత్తును బట్టి నాజిల్స్‌ను మాన్యువల్‌గా సర్దుబాటు చేసుకోవచ్చు.
- పురుగు మందులను ఏకరీతిన సరైన పరిమాణంతో ఆకుల మీద పడేలా చేయటం దీని ప్రత్యేకత.
- తక్కువ మోతాదులో వినియోగించడం వల్ల పురుగు మందుల వృథాతో పాటు భూగర్భ జలాలు కలుషితం కాకుండా అడ్డుకోవచ్చు.
- 10–20 లీటర్ల లిక్విడ్ యూరియా, పురుగుల మందులను మోసుకెళ్తూ నిమిషానికి 6 లీటర్లను పిచికారీ చేయగల సామర్థ్యం ఈ పరికరానికి ఉంది.

పోలవరం తాజా అంచనాలు
ఆమోదించాలి

▶ మొదటి పేజీ తరువాయి

మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అంశాలపై కేంద్రంతో చర్చించేందుకు బుధవారం ఢిల్లీకి వచ్చిన ఆయన గురువారం ఉదయం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి అందాల్సిన నిధులు, బకాయిల అంశాలతో పాటు ప్రత్యేక హోదా అంశాలపై సుమారు అర గంట పాటు చర్చించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డయాఫ్రమ్ వాల్ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు దాదాపు రూ.2,020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని, ఈ నిధులనూ వెంటనే విడుదల చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఖర్చు చేసిన రూ.2600.74 కోట్లను సత్వరమే రీయింబర్స్ చేయాలన్నారు. సీఎం జగన్ ఇంకా ప్రస్తావించిన అంశాలు ఇలా ఉన్నాయి.

- రుణాల విషయంలో రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలు సరికాదు. వీటి విషయంలో పునరాలోచన చేయాలి. ప్రస్తుత ప్రభుత్వ తప్పు లేకున్నా, రుణాలపై కేంద్రం ఆంక్షలు విధించింది. నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని కూడా తగ్గించారు. 2021–22లో రూ.42,472 కోట్ల రుణ పరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లకు కుదించారు. ఈ విషయంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలి.
- ఉపాధి హామీ పనులకు సంబంధించి రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు సుమారు రూ.2,500 కోట్లు వెంటనే మంజూరు చేయాలి.
- 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. ఈ డబ్బును వెంటనే ఇప్పించాలి.
- 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద రూ.36,625 కోట్లు పెండింగులో ఉన్నాయి. వీటిని విడుదల చేయాలి.
- రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. ఈ దృష్ట్యా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి.

తాడేపల్లి చేరుకున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన రెండు రోజుల ఢిల్లీ పర్యటనను ముగించుకుని గురువారం తిరిగి తాడేపల్లికి చేరుకున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసేందుకు ఈ నెల 29న మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లారు. బుధవారం రాత్రి అమిత్‌షాను కలిశారు. గురువారం ఉదయం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకున్నారు.

అక్రమాలు నిజం!

▶ మొదటి పేజీ తరువాయి

చిట్లు వేస్తున్నవారికి తమ సొమ్ము ఎంత భద్రంగా ఉందో, లేదో కూడా తెలియని పరిస్థితి సృష్టిస్తున్నారు. అంతేకాదు.. డిపాజిట్లు తీసుకోవటాన్ని నిషేధించినా సరే... వాటిని ఇతరత్రా రూపాల్లో తీసుకుంటూ నిబంధనలకు తూట్లు పొడుస్తూనే ఉన్నారు. చట్టాలను పరిహాసం చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని మార్గదర్శి ఆడిటింగ్ సంస్థ బ్రహ్మయ్య అండ్ కో కంపెనీలో సీఐడీ జరిపిన తనిఖీల్లో వెల్లడైన పలు అక్రమాలు బయటపడ్డాయి.

చార్టర్డ్ అకౌంటెంట్‌కు 14 రోజుల రిమాండ్...

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్యాంకు లావాదేవీలు, రికార్డుల నిర్వహణలో పలు అవకతవకలున్నట్లు మార్గదర్శి చిట్స్‌కు ఆడిటర్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మయ్య అండ్ కో ప్రతినిధి సీఐడీ విచారణలో వెల్లడించారు. దాంతో బ్రహ్మయ్య అండ్ కో సీఏ కుదరవల్లి శ్రావణ్‌ను సీఐడీ అధికారులు అరెస్టు చేసి గురువారం విజయవాడలోని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా... చందాదారుల సొమ్మును తరలించటం, మ్యూచువల్ ఫండ్స్‌లోను, షేర్లలోను అక్రమంగా పెట్టుబడులు పెట్టడం, ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లు సేకరించడం చేసినట్లు ఇప్పటికే సీఐడీ అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే బ్రహ్మయ్య అండ్ కో సంస్థ రికార్డులను తనిఖీ చేసి, ఆ సంస్థ సీఏ శ్రావణ్‌ను విచారించారు. ఈ విచారణలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు మరిన్ని వెలుగులోకి వచ్చాయి. మార్గదర్శి ఖాతాలు సవ్యంగానే ఉన్నాయని ఏటా ఆడిట్ నివేదిక ఇస్తున్న ఈ సంస్థ... అసలు మార్గదర్శి చిట్స్ బ్యాంకు ఖాతాలు, రికార్డులు, లావాదేవీలను సమగ్రంగా పరిశీలించకుండానే ఈ నివేదిక ఇస్తున్నట్లు సదరు చార్టర్డ్ అకౌంటెంట్ వెల్లడించటం గమనార్హం.

అక్రమాలు వాస్తవమే

–బ్రహ్మయ్య సంస్థ సీఏ శ్రావణ్

సీఐడీ దర్యాప్తు సందర్భంగా బ్రహ్మయ్య అండ్ కో సీఏ కుదరవల్లి శ్రావణ్ కీలక విషయాలు వెల్లడించారు. తాము అసలు మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో రికార్డులను వ్యక్తిగతంగా పరిశీలించకుండానే ఆడిట్ నివేదిక జారీ చేస్తున్నామని అంగీకరించారు. మార్గదర్శి చిట్స్ ఆదాయ– వ్యయాలు, ఆస్తి–అప్పులకు సంబంధించిన ఎలాంటి వివరాలనూ ఆయన సీఐడీ అధికారులకు చెప్పలేకపోయారు. ఒక్కో బ్రాంచి బ్యాంకు ఖాతాల్లో అప్పుడప్పుడు చూపిస్తున్న వందల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆ తరువాత అవి ఎక్కడికి మాయమయ్యాయి? అనేది ఆయన ఏమాత్రం చెప్పలేకపోయారు. ఆ వివరాలేవీ తనకు తెలియవని ఆయన అంగీకరించారు.

ఇలాంటి డిపాజిట్లు ప్రమాదకరమే?

- చిట్లు వేసేవారిలో కొందరు చిట్‌ను పాడుకుంటారు కానీ... ఆ డబ్బును తీసుకోవటానికి అవసరమైన ష్యూరిటీలను కంపెనీకి సబ్‌మిట్ చేయలేరు. మరికొందరైతే రకరకాల కారణాల వల్ల పాడుకున్న మొత్తాన్ని తీసుకోకుండా భవిష్యత్తులో తాము చెల్లించాల్సిన చిట్ మొత్తానికి సంబంధించి దాన్ని సదరు చిట్‌ఫండ్ సంస్థ వద్దే వదిలిపెడతారు. ఇంకొందరైతే ఓ రెండు మూడు నెలలు ఉన్నపుడు చిట్‌ను పాడుకుని... ఆ మిగిలిన నెలల ఫ్యూచర్ చిట్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని సంస్థ దగ్గరే వదిలేస్తారు. అయితే ఏ చిట్‌ఫండ్ సంస్థయినా తమ ప్రతి బ్రాంచి కార్యాలయంలోనూ... అక్కడి చిట్టీలకు సంబంధించిన ఫ్యూచర్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని జమ చేసేందుకు ప్రత్యేకంగా రెండో బ్యాంకు ఖాతాను నిర్వహిస్తుండాలి. ఇలా ఫ్యూచర్ చిట్ల మొత్తాన్ని ఆ ఖాతాలో జమ చేయాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ఏ ఒక్క బ్రాంచిలోనూ ఇలా ఫ్యూచర్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని డిపాజిట్ చేయడానికి వేరే బ్యాంకు ఖాతా తెరవలేదు. అన్నిచోట్ల నుంచీ ఆ మొత్తాన్ని హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తరలిస్తోంది. దానికో రశీదు ఇస్తూ 4–5 శాతం వడ్డీ చెల్లిస్తోంది. ఇది అనధికారికంగా డిపాజిట్లు వసూలు చేయటమే. చట్టవిరుద్ధంగా వసూలు చేస్తున్న ఈ డిపాజిట్లను గనక ఏ ఆర్‌బీఐనో జప్తు చేస్తే..? చిట్‌దారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారే ప్రమాదం ఉంది. అయినా సరే మార్గదర్శి వసూలు చేస్తున్న అక్రమ డిపాజిట్లు సక్రమమేననే రీతిలో బ్రహ్మయ్య అండ్ కో సంస్థ నివేదిక ఇవ్వటం విస్మయం కలిగించేదే!!.
- ఇక మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఆదాయ, వ్యయాల ఖాతాలు, ఆస్తి, అప్పుల ఖాతాలు, తమ పెట్టుబడుల వివరాలను బహిర్గతం చేయటం లేదు. గోప్యంగా ఉంచుతోంది. ఇది చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. అయినా సరే బ్రహ్మయ్య అండ్ కో ఇది పట్టించుకోకుండా అంతా సక్రమంగానే ఉందని ఆడిట్ నివేదిక ఇచ్చేస్తోంది.

స్థిరమైన ఆర్థిక నగరాల నిర్మాణం

▶ మొదటి పేజీ తరువాయి

ఫైనాన్సింగ్‌లపై సవాళ్లు, ప్రపంచ వ్యాప్తంగా విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడంపై మాట్లాడారు. తమ దేశంలోని సియోల్ నగరం ఎదుర్కొన్న నిర్దిష్ట సవాళ్లను, వాటిని తగ్గించడానికి అనుసరించిన విధానాలను, పునరాభివృద్ధికి సంబంధించిన అంశాలను సియోల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్లు ఇన్హీ కిమ్, హుంయ్ షిన్‌లు సమర్పించారు. చైనా, రష్యా, యూరోపియన్ కమిషన్‌తో పాటు భారతదేశ ప్రతినిధులు పట్టణ మౌలిక సదుపాయాలకు ఫైనాన్సింగ్‌ను పెంచడానికి చేపట్టిన చర్యలను ఫోకస్ చేయడానికి కేస్ స్టడీస్‌ను అందజేశారు.


విశాఖలో క్షేత్రస్థాయి పరిశీలన

వర్క్‌షాపు అనంతరం జీ–20 దేశాల ప్రతినిధులు విశాఖ నగరంలో విజయవంతంగా నడుస్తున్న మూడు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (వీసీఐసీడీపీ)లోని స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ పథకం, ముడసర్లోవ రిజర్వాయరులోని రెండు మెగావాట్ల సామర్థ్యంతో పనిచేస్తున్న మెగా ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, జిందాల్ సంస్థ నిర్వహిస్తున్న వేస్ట్ టు ఎనర్జీ మేనేజ్‌మెంట్ ప్లాంట్లను వీరు సందర్శించారు. 2023 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎజెండా కింద జరుగుతున్న చర్చలను పూర్తిచేయడానికి, ప్రాక్టికల్ లెర్నింగ్‌ను ప్రారంభించడానికి భారత ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను జీ–20 దేశాల ప్రతినిధులు స్వాగతించి అభినందించారు. ఇక చివరిరోజు శుక్రవారం జరిగే సమావేశంలో దేశంలోని వివిధ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొంటారు. ఇందులో వీరు తమ సంస్థల్లో చేపట్టిన ప్రాజెక్టుల అనుభవాలను, విజయాలను వివరిస్తారు. అలాగే, విశాఖ పరిధిలోకి వచ్చే వీసీలు, ప్రొఫెసర్లు, విద్యార్థులు కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టులు

- గన్నవరంలో ఒకరి అరెస్టు

గన్నవరం/సాక్షి ప్రతినిధి, విజయవాడ: సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో ప్రముఖ వ్యక్తులపై విద్వేషపూరిత పోస్టులు పెడుతున్న వ్యక్తిని కృష్ణా జిల్లా గన్నవరం పోలీసులు అరెస్టు చేశారు. గన్నవరం రామ్‌నగర్‌కు చెందిన పొందూరు అంజన్ అలియాస్ అంజన్‌చౌదరి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌లో హోష్ యువగళం అకౌంట్ ద్వారా విద్వేషపూరిత పోస్టులు పెడుతున్నారని డీఎస్పీ కె.విజయపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులపై ద్వేషం, అసత్యాలతో కూడిన పోస్టులు పెడుతున్నట్లు గన్నవరం సీఐ పి.కనకరావుకు వచ్చిన ఫిర్యాదు మేరకు అంజన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లు, ట్యాబ్, పలు ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. అంజన్ అమెరికాలో మూడేళ్లు ఉద్యోగం చేసి 2015లో ఇండియా వచ్చాడని, అప్పటి నుంచి జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడని, స్వభావరీత్యా స్వలింగ సంపర్కుడని విచారణలో తేలిందన్నారు. అంజన్‌పై కేసు నమోదు చేసి స్థానిక 12వ ఎంఎంఏ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. నిందితుడిపై సైబర్ బుల్లీ షీట్ పెట్టడంతో పాటు నిరంతర నిఘా ఉంచుతామన్నారు. తెలుగుదేశం పార్టీ అగ్రనేతల ప్రోత్సాహంతోనే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడన్నట్లు తెలిపారు.


అంజన్

క్లుప్తంగా...

విద్యుత్ ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు

సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి కచ్చితంగా బయోమెట్రిక్ ద్వారా తమ హాజరును నమోదు చేయాలని, దాని ప్రకారమే జీతం లెక్కిస్తామని ఏపీ జెన్కో ఎండీ బి.శ్రీధర్ ఉత్తర్వులిచ్చారు. రోజులో ఉదయం విధులకు హాజరైనప్పుడు, తిరిగి విధులు ముగిసినప్పుడు బయోమెట్రిక్ వేస్తే చాలన్నారు. గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఉద్యోగులు ఆలస్యంగా విధులకు హాజరైతే శాఖాధిపతుల అనుమతి తీసుకోవాలని సూచించారు.

ఎస్బీఐకి రూ.50వేలు జరిమానా

- రుణం ఇవ్వకుండానే పది నెలలు ఈఎంఐ వసూలు చేసిన బ్యాంక్
- 12 శాతం వడ్డీతో మొత్తం డబ్బులు చెల్లించాలని 'ఫోరం' తీర్పు

విశాఖ లీగల్: రుణం ఇవ్వకుండానే ఓ వ్యక్తి నుంచి 10 నెలలు ఈఎంఐ వసూలు చేసిన విశాఖలోని ఎన్ఏడీ కొత్త రోడ్‌లో ఉన్న భారతీయ స్టేట్ బ్యాంక్ శాఖకు జిల్లా వినియోగదారుల ఫోరం-2 రూ.లక్ష జరిమానా విధించింది. దీనిపై బ్యాంక్ అధికారులు రాష్ట్ర వినియోగదారుల ఫోరంలో అప్పీలు చేయగా, జరిమానాను రూ.50వేలకు తగ్గించింది. విశాఖలోని మురళీనగర్‌కు చెందిన మాథా ఉదయభాస్కర్ భారత సైన్యంలో పనిచేస్తున్నారు. ప్రతి నెలా ఆయన జీతం ఎన్ఏడీ కొత్త రోడ్‌లోని ఎస్బీఐ శాఖలో ఉన్న తన ఖాతాలో జమ అవుతుంది. ఉదయభాస్కర్ మధురవాడలో సొంత ఇంటి నిర్మాణం కోసం రూ.25లక్షలు రుణం కావాలని 2017లో ఎస్బీఐ ఎన్ఏడీ కొత్త రోడ్ శాఖ అధికారులను సంప్రదించారు. రుణం ఇచ్చేందుకు బ్యాంక్ అధికారులు అంగీకరించి, ఆయనతో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయించుకున్నారు. ఇంటికి కొన్ని అనుమతులు రాకపోవడం వల్ల రుణం మంజూరు చేయలేదు. కానీ, రుణం ఇచ్చినట్లుగానే ఉదయభాస్కర్ బ్యాంక్ ఖాతా నుంచి నెలకు రూ.21,538 చొప్పున 10నెలలు రూ.2,15,380లు, సరైన సమాచారం ఇవ్వలేదని మరో రూ.10వేలు కట్ చేసుకున్నారు. బీమా సొమ్ము కింద పీఎన్‌బీ మెట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు రూ.2,701 తీసుకున్నారు. తన ఖాతా నుంచి తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వాలని బ్యాంక్, బీమా కంపెనీవారిని ఉదయభాస్కర్ కోరినా పట్టించుకోలేదు. దీంతో ఆయన 2019లో విశాఖలోని వినియోగదారుల ఫోరం-2లో ఫిర్యాదు చేశారు. కేసు విచారణ చేసిన ఫోరం-2 న్యాయమూర్తి జి.వేంకటేశ్వరి, సభ్యులు డాక్టర్ రమణబాబు, పి.విజయదుర్గ.. వినియోగదారుడికి సేవాలోపం కలిగించినందుకు ఎస్బీఐ ఎన్ఏడీ కొత్త రోడ్ శాఖకు రూ.లక్ష జరిమానా విధిస్తూ 2022, మేలో తీర్పు చెప్పారు. ఈఎంఐ, జరిమానా, బీమా రూపంలో తీసుకున్న రూ.2,15,380లను12% వడ్డీతో చెల్లించాలని, ఖర్చుల కింద మరో రూ.20వేలను కలిపి 45 రోజుల్లో ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై బ్యాంక్ అధికారులు రాష్ట్ర వినియోగదారుల ఫోరంను ఆశ్రయించగా విచారణ చేసిన న్యాయమూర్తి జస్టిస్ టి.సునీల్ చౌదరి ఫోరం తీర్పును యథాతథంగా అమలు చేయాలని ఆదేశిస్తూ జరిమానాను తగ్గించారు.

సీవీడ్.. వెరీ గుడ్


ర్యాఫ్టులను సముద్రంలో అమరుస్తున్న దృశ్యం

పోషకాల సమాహారం.. శాకాహారులకు వరం

- ఫార్మా, ఎరువులు, సౌందర్య ఉత్పత్తులకు ముడిసరుకు
- దేశ విదేశాల్లో పెరుగుతున్న వినియోగం
- ఏపీలో 49 సముద్ర తీర ప్రదేశాలు సీవీడ్ సాగుకు అనువైనవిగా గుర్తింపు
- పైలట్ ప్రాజెక్టు విజయవంతం

సీవీడ్.. శతాబ్దాలుగా పాశ్చాత్య దేశాలకు సుపరిచితమైన పేరిది. దశాబ్ద కాలంగా దక్షిణ భారతదేశంలోని కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోనూ ఈ పేరు వినిపిస్తోంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రయోగాత్మక సాగుకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో దీని ప్రత్యేకతలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సముద్రపు నాచుగా పిలిచే సీవీడ్‌లో ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు వంటి పోషకాలతోపాటు పీచు పదార్థం కూడా ఎక్కువగా ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ క్యాన్సర్, యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఈ సమ్మేళనాల్లో ఉంటాయి. శతాబ్దాలుగా చైనా, జపాన్, కొరియా, మెక్సికో వంటి కొన్ని లాటిన్ అమెరికన్ దేశాల్లో సముద్రపు నాచును సంప్రదాయ ఆహారంగా ఉపయోగిస్తున్నారు. ఇటీవల ఐరోపా వంటకాల్లో సముద్రపు నాచును చేర్చేందుకు ఫ్రాన్స్‌లో పెద్దఎత్తున ప్రయత్నాలు చేసి కొంతమేర విజయం సాధించారు. జపాన్ దేశీయులు ఎక్కువగా ఉన్న కాలిఫోర్నియా, హవాయి వంటి ప్రాంతాల్లో ఇది మరింత ప్రాచుర్యం పొందింది. రెస్టారెంట్స్, సూపర్ మార్కెట్లలో ఇది సాధారణంగానే కనిపిస్తోంది. వాస్తవానికి ఆస్ట్రియా, జర్మనీలలో సముద్రపు నాచును అత్యంత విలువైన బ్రెడ్-అల్జెన్‌బ్రోట్‌ను ఉత్పత్తి చేసేందుకు ఉపయోగిస్తున్నారు. బ్రిటన్‌లో బారామోర్ లేదా బ్రెడ్ ఆఫ్ సీ తయారీకి ఉపయోగిస్తున్నారు.

- ఏపీ నెట్‌వర్క్

తృణ ధాన్యాల మిశ్రమం

సీవీడ్ తృణధాన్యాల మిశ్రమం. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, కెనడా తూర్పు తీరంలో కొన్ని కంపెనీలు మానవ వినియోగం కోసం ప్రత్యేకంగా సముద్రపు నాచును పెంచడం ప్రారంభించాయి. ప్రపంచ జనాభా పెరుగుదల, పరిమిత భూమి, విలువైన సహజ వనరుల ప్రాముఖ్యత దీనిపై పరిశోధనలకు కారణమైంది. జపాన్, చైనా వంటి కొన్ని దేశాల్లో వీటి పెంపకం పరిశ్రమ స్థాయికి చేరుకుంది. జపాన్, చైనా, కొరియా, మెక్సికో, అమెరికన్ దేశాల్లో శతాబ్దాలుగా దాదాపు 66 శాతం ఆల్గే (సముద్రపు నాచు) జాతులను రోజువారీ ఆహారంలో ఉపయోగిస్తున్నారు. మధుమేహం, ఊబకాయం, హృదయ సంబంధ వ్యాధులు, క్యాన్సర్ వంటి వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ఇది ఉపయోగపడుతుందని గుర్తించారు.


బాపట్ల జిల్లా సూర్యలంక తీరంలో సిద్ధమవుతున్న సీవీడ్ ర్యాఫ్టులు

ఏపీకి అందివచ్చిన అవకాశం

సువిశాల సముద్ర తీరం గల ఆంధ్రప్రదేశ్‌లో సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) ఇప్పుడు మెగా మిషన్‌ను ప్రారంభించింది. మత్స్యకారులను ప్రోత్సహించేందుకు శ్రీకాకుళం జిల్లా బారువ, విశాఖపట్నం భీమిలి బీచ్‌కు వెళ్లే దారిలో మంగమారిపేట, బాపట్ల జిల్లా సూర్యలంక, నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో పైలట్ ప్రాతిపదికన సీవీడ్ సాగును ప్రారంభించారు. రాష్ట్రంలోని తీరప్రాంత జిల్లాల్లో 49 ప్రదేశాలు దీని సాగుకు అనువైనవిగా గుర్తించారు. మన దేశంలో సముద్రపు నాచును మందులు, వస్త్రాలు, ఎరువులు, పశువుల దాణా, జీవ ఇంధన పరిశ్రమల్లోనూ వినియోగిస్తున్నారు. సీవీడ్ ఎరుపు, ఆకుపచ్చ, గోధుమ రంగుల్లో ఉంటుంది. అత్యధికంగా సాగు చేస్తున్న సీవీడ్ రకాలు కప్పాఫైకస్ ఆల్వారెజి, గ్రాసిలేరియా, సాచరినా జపోనికా, పైరోపియా, సర్గస్సమ్ ఫ్యూసిఫార్మ్.

ప్రభుత్వ ప్రోత్సాహం

సీవీడ్ ప్రాధాన్యతను గుర్తించిన కేంద్రం తీరప్రాంత రాష్ట్రాలతో కలిసి సాగును ప్రోత్సహిస్తోంది. ఏపీలో 10 వేల సీవీడ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద 60-40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత ఇస్తున్నాయి. మత్స్యకారులు, మత్స్యకార మహిళా సొసైటీలు, ఎస్సీ, ఎస్టీ కో-ఆపరేటివ్ సొసైటీలు, మహిళా స్వయం సహాయక సంఘాలు ఈ పథకం కింద సాయం పొందేందుకు అర్హులు. 15 మందితో ఏర్పాటయ్యే ఒక్కో క్లస్టర్ పరిధిలో రూ.1.50 లక్షల పెట్టుబడితో సాగు చేస్తే రూ.6 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడిలో 60 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. రాష్ట్రానికి ఈ ఏడాది 7,200 యూనిట్లు మంజూరు చేశారు. రూ.1.86 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.1.12 కోట్లు సబ్సిడీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించనుండగా రూ.74.40 లక్షలు లబ్ధిదారులు భరిస్తారు.

సాగు ఇలా..



సముద్రంలో అలలు తక్కువగా ఉండే ప్రదేశాలు, బ్యాక్ వాటర్ ఉన్న ప్రాంతాల్లో సీవీడ్ సాగు చేసుకోవచ్చు. అలల ఉధృతి అధికంగా ఉంటే నాచు మొత్తం కొట్టుకుపోయే ప్రమాదముంది. ఏడాదిలో ఏడెనిమిది నెలలు దీని సాగుకు అనుకూల వాతావరణం ఉంటుంది. సీవీడ్ విత్తనాలను కిలో రూ.50 చొప్పున తమిళనాడులోని రామేశ్వరం నుంచి తెచ్చుకుంటే సరిపోతుంది. అధిక సాంద్రత కలిగిన పాలీవినైల్ పైప్స్ లేదా ట్యూబ్ నెట్ పద్ధతిలో సాగు చేపడుతున్నారు. సీఎంఎఫ్ఆర్ఐ, పీఎంఎంఎస్‌వై ఔత్సాహిక రైతులకు శిక్షణ ఇస్తాయి. విత్తనాలను వలల్లో అమర్చి ఆ వలలను కర్రలు లేదా పైపులకు కడతారు. కెరటాల అలజడి లేని తీర ప్రాంతాల్లో వాటిని తెప్పల్లా అమర్చుతారు. 2 రోజులకోసారి వాటిని పరిశీలిస్తుంటారు. 45-60 రోజుల్లో మొక్కలు పెరుగుతాయి. వాటిని ఎండబెట్టి విక్రయిస్తారు.

– సురేష్, మత్స్యశాఖ జేడీ, బాపట్ల జిల్లా

ఖర్చు తక్కువ.. ప్రయోజనాలు ఎక్కువ

- సీవీడ్ సాగుకు అయ్యే వ్యయం అత్యల్పం. శ్రమశక్తి వినియోగం కూడా స్వల్పమే.
- ఒకసారి విత్తనాలు కొని తెచ్చుకుంటే ఎన్ని సంవత్సరాలైనా పునరుత్పత్తి అయ్యే విత్తనాలే వాడుకోవచ్చు.
- ఎలాంటి ఎరువులు, పురుగు మందులు వేయాల్సిన అవసరం లేదు.
- కొద్దిపాటి శిక్షణతో మహిళలు, నిరక్షరాస్యులు సైతం పెద్దఎత్తున సాగు చేయవచ్చు.
- రెండు నెలల వ్యవధిలోనే ఉత్పత్తులు చేతికి వచ్చే అవకాశం ఉంది.
- దేశవ్యాప్తంగా డిమాండ్ ఉండటంతో పాటు ప్రభుత్వమే మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోంది.
- సముద్రపు నాచులో అయోడిన్, యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్, విటమిన్స్, జింక్, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. దీంతో ఫార్మా కంపెనీలకు ప్రధాన ముడిసరుకుగా ఉపయోగపడుతుంది.
- రొయ్యలు, చేపల పెంపకంలో నాణ్యమైన ఫీడ్‌గా, పంటలకు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.
- అధిక పోషకాలు ఉన్నందున ఆహార ఉత్పత్తుల పరిశ్రమల్లో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.
- నీటిని శుభ్రపరిచే గుణం దీనికి ఉంది. సముద్రంలో చేరే మురుగు, ఇతర వ్యర్థాలను శోషించుకుని నీటిని స్వచ్ఛంగా ఉంచేందుకు నాచు సహాయపడుతుంది.


సముద్రంలో అమర్చిన ర్యాఫ్టులు

రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసిందే చంద్రబాబు

- మోసం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య
- ఆయన హయాంలో ఏ రంగానికీ న్యాయం జరగలేదు
- సంక్షేమం గురించి మాట్లాడే అర్హత బాబుకు లేదు
- మంత్రి విడదల రజిని


సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి రజిని, మహిళలు

యడ్లపాడు: రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసిందే టీడీపీ అధినేత చంద్రబాబు అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని దుయ్యబట్టారు. గురువారం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని టీటీడీ కళ్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ..మాయమాటలు, మోసం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని చెప్పారు. ఆయన హయాంలో విద్య, వైద్యం, వ్యవసాయం వంటి కీలక రంగాలు సహా ఏ ఒక్క రంగానికీ న్యాయం జరగలేదన్నారు. ఆయన అవసరం రాష్ట్రానికి ఉందని చంద్రబాబే చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. చారిత్రక అవసరం అనేది ఆయన ఊతపదమని ఎద్దేవా చేశారు. బాబు, ఆయన వర్గం ఆర్థికంగా ఎదిగేందుకే ఆయన సీఎం కావడం చారిత్రక అవసరమని ప్రకటించుకుంటున్నారని మండిపడ్డారు. సంక్షేమం గురించి మాట్లాడే అర్హతే ఆయనకు లేదన్నారు. టీడీపీ దృష్టిలో సంక్షేమం అంటే జన్మభూమి కమిటీలకు పెత్తనమిచ్చి రాష్ట్రాన్ని దోచుకోవడమని దుయ్యబట్టారు. సీఎం జగన్ వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రభుత్వాన్ని ప్రజల ముంగిటకు చేర్చారని, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ డోర్ డెలివరీ అవుతున్నాయని తెలిపారు. జన్మభూమి కమిటీల దోపిడీ, వలంటరీ వ్యవస్థ సేవల మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలని అన్నారు. మరోసారి అవకాశమిస్తే చంద్రబాబు ప్రజలను నిలువు దోపిడీ చేయడం ఖాయమని చెప్పారు.

ఇంధన సామర్థ్యంలో ఏపీ అగ్రగామి

- బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ సెక్రటరీ ఆర్.కె. రాయ్
- ఏపీ భవన్‌లో విద్యుత్‌ను ఆదా చేసే ఎలక్ట్రానిక్ పరికరాలు
- నెలలోనే ప్రాజెక్టు పూర్తి చేసిన ఏపీఎస్ఈసీఎం
- తొలి దశలో ఏటా రూ. 6.25 లక్షల విలువైన 49,469 యూనిట్ల ఆదా


ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆర్.కే.రాయ్ తదితరులు

సాక్షి, అమరావతి: ఇంధన సామర్థ్య రంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రాలలో ఏపీ ఒకటని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సెక్రటరీ ఆర్.కే. రాయ్ కొనియాడారు. ఇంధన భద్రత, పర్యావరణ లక్ష్యాలను సాధించడంతో పాటు ఆర్థిక వ్యవస్థపై ఇంధన తీవ్రతను తగ్గించడానికి సహాయపడే ఇంధన సామర్థ్య కార్యకలాపాలకు ఏపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఇంధన సామర్థ్య పరికరాలను అమర్చే ప్రాజెక్టును ఏపీ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) రికార్డు స్థాయిలో నెల రోజుల్లోనే పూర్తిచేసింది. ఈ ప్రాజెక్టును రాయ్ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఏపీ భవన్‌లో ఏటా 1.96 లక్షల యూనిట్ల విద్యుత్తును, రూ.39 లక్షల మేర ప్రజా ధనాన్ని ఆదా చేయొచ్చని చెప్పారు. 139 టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించొచ్చన్నారు. ఇందుకోసం పెట్టిన పెట్టుబడి 13 నెలల్లోనే ఇంధనం ఆదా రూపంలో తిరిగి పొందవచ్చన్నారు. తొలి దశలో హాలోజన్ ల్యాంప్‌ల స్థానంలో 190 వాట్ల కెపాసిటీ గల 12 ఎల్ఈడీ ఫ్లడ్ లైట్లు, సంప్రదాయ సీలింగ్ ఫ్యాన్ల స్థానంలో 28 వాట్స్ కెపాసిటీ గల 170 బీఎల్‌డీసీ సీలింగ్ ఫ్యాన్లు, 1.8 టీఆర్ 3 స్టార్ రేటెడ్ హాట్ అండ్ కోల్డ్ ఇన్వర్టర్ టైప్ స్ప్లిట్ ఏసీలు, కారిడార్‌ల వద్ద లైట్లను నియంత్రించడానికి 40 మోషన్ సెన్సార్లను ఏర్పాటు చేశారని తెలిపారు. దీని వల్ల ఏటా రూ.6.25 లక్షల విలువైన49,469 యూనిట్ల ఇంధనం ఆదా అవుతుందన్నారు. నెల రోజుల్లోనే పనులు పూర్తి చేసిన ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డిని రాయ్ అభినందించారు. ఏపీ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ ఆదిత్యానాథ్ దాస్ పాల్గొన్నారు. ఇంధన సామర్థ్య చర్యలకు న్యూ ఢిల్లీలో బీఈఈ ఎంపిక చేసిన తొలి రాష్ట్ర భవన్ ఏపీ భవన్. ఇక్కడి ఇంధన పొదుపు చర్యల ఫలితాల ఆధారంగా ఇతర రాష్ట్ర ప్రభుత్వాల భవనాల్లోనూ ఇదే ప్రాజెక్టును అమలు చేయాలని బీఈఈ భావిస్తోంది. ఏపీ భవన్‌ను ఎంపిక చేసి ఏపీఎస్ఈసీఎం ద్వారా ఇంధన సామర్థ్య చర్యలను విజయవంతంగా అమలు చేసిన బీఈఈకి ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కృతజ్ఞతలు తెలిపారు.

పాలిటెక్నిక్ కోర్సులకు 'కొత్త' ఊపు

జీఐఎస్ ఒప్పందాలతో మంచిరోజులు

- స్థానిక అవసరాల మేరకు నూతన కోర్సుల రూపకల్పన
- రాష్ట్రంలోని తిరుపతి, సత్యవేడు, గన్నవరం, గుంటూరులో అనుమతి
- 2023-24 విద్యా సంవత్సరం నుంచే శ్రీకారం


విశాఖలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



విశాఖ విద్య: ఒకప్పుడు పాలిటెక్నిక్ అడ్మిషన్లకు తీవ్రమైన పోటీ ఉండేది. మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సులు చేసిన వారికి కొలువు గ్యారెంటీగా దక్కేది. ఈ మూడేళ్ల కోర్సు అనంతరం ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలోకి నేరుగా ప్రవేశం పొందొచ్చు. అయితే, గత పాలకుల నిర్లక్ష్యంతో పాలిటెక్నిక్ కాలేజీలు క్రమంగా నిర్వీర్యమైపోయాయి. ఇప్పుడు మళ్లీ వీటికి కొత్త ఊపు తీసుకొచ్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టిసారించింది.

జీఐఎస్ ఒప్పందాలతో నయా జోష్

విశాఖపట్నం వేదికగా ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 (జీఐఎస్)లో ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. దీంతో 6 లక్షల మందికి పైగా నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి. పెద్ద ఎత్తున నెలకొల్పే పరిశ్రమలకు మానవ వనరుల అవసరం దృష్ట్యా, మూడేళ్ల కాల వ్యవధి గల పాలిటెక్నిక్ కోర్సులపై అందరి దృష్టి పడింది. దీంతో తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది.

కొత్త కోర్సులకు రూపకల్పన

ఎనర్జీ, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఖనిజ, పెట్రో కెమికల్స్, ఫార్మాస్యూటికల్ వంటి రంగాల్లో పెద్దఎత్తున పరిశ్రమలు నెలకొల్పేందుకు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో ఒప్పందాలు జరిగాయి. రాష్ట్రంలో వీటి విస్తరణకు అనువైన పరిస్థితులు ఉండటమే ఇందుకు కారణం. ఆయా రంగాలకు అవసరమైన నిపుణులైన యువతను అందించేందుకు వీలుగా పాలిటెక్నిక్ కాలేజీల్లో కొత్త కోర్సులను ప్రారంభించాలని సాంకేతిక విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

తొలిదశలో నాలుగుచోట్ల

ఈ నేపథ్యంలో.. తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రస్తుతం నిర్వహిస్తున్న కెమికల్ సుగర్ టెక్నాలజీ స్థానంలో ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), సత్యవేడులో మెకానికల్ ఇంజనీరింగ్ స్థానంలో మెకానికల్ రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండిషనర్, గన్నవరంలో కొత్తగా కంప్యూటర్ సైన్సు, గుంటూరులో గార్మెంట్ టెక్నాలజీ స్థానంలో డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులకు అనుమతిచ్చారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచే వీటిలో ప్రవేశాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. దశల వారీగా రాష్ట్రంలోని అన్ని కాలేజీల్లో ఆయా ప్రాంతాల అవసరాల మేరకు సరికొత్త కోర్సుల రూపకల్పన చేసేలా సాంకేతిక విద్యాశాఖ ముందుకెళ్తోంది.

84 కాలేజీలు.. 17వేల సీట్లు.. 28 రకాల కోర్సులు

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో 84 కాలేజీలు నిర్వహిస్తుండగా, వీటి పరిధిలో 17వేల వరకు సీట్లున్నాయి. వీటిలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్, మైనింగ్, కెమికల్, బయోమెడికల్, మెటలర్జి, 3డి యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, పెట్రోలియం, టెక్స్‌టైల్ వంటి 28 రకాల కోర్సులను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాలిటెక్నిక్ కాలేజీల బలోపేతంపై సాంకేతిక విద్యాశాఖ కార్యాచరణలోకి దిగింది.

కొత్త కోర్సులు అవసరం



ప్రభుత్వం మంచి ఆలోచన చేస్తోంది. పాలిటెక్నిక్‌లో కొత్త కోర్సుల ఆవశ్యకత ఉంది. ఎలక్ట్రానిక్ వాహనాల వినియోగం పెరుగుతోంది. భవిష్యత్తులో ఈ రంగంలో నిపుణులు అవసరం. క్యాడ్ కామ్, పవర్ సిస్టమ్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ వంటి కోర్సులు తీసుకొస్తే ఎంతో మేలు.

– డాక్టర్ ఎస్. చంద్రశేఖర్, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ పాలిటెక్నిక్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్‌పీటీఓ) అధ్యక్షులు

పాలిటెక్నిక్ కాలేజీలకు మంచిరోజులు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో నైపుణ్యంతో కూడిన శిక్షణ అందించేలా సకల సౌకర్యాలున్నాయి. కొత్త కోర్సులకు సాంకేతిక విద్యాశాఖ అనుమతులిస్తోంది. పాలిటెక్నిక్ కాలేజీలకు మంచి రోజులొస్తున్నాయి. ఈసారి అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది.

– జీవీవీ సత్యనారాయణమూర్తి, పాలీసెట్ కన్వీనర్, ఉమ్మడి విశాఖ జిల్లా

క్యాంపస్ కొలువు కొట్టా



మాది విశాఖ నగరంలోని తాటిచెట్లపాలెం. తండ్రి గోదాములో కలాసీగా పనిచేస్తున్నారు. అమ్మ ఇంటిదగ్గర మిషన్ కుడుతుంది. సత్వర ఉపాధి కోసమని పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్ కోర్సు ఎంచుకున్నాను. క్యాంపస్ సెలక్షన్స్‌లో టాటా ప్రాజెక్టులో ఏడాదికి రూ.3.25 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించా.

– ఈతకోట సియోన్, విశాఖపట్నం

గణితంలో గర్వించేలా!



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఉద్యోగావకాశాలు విస్తృతంగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉంది. ప్రతిభ కలిగిన యువతతో 65.58 శాతం స్కోరు సాధించింది. ఇక ఆంగ్లం, గణితం నైపుణ్యాల్లో అగ్రశ్రేణిలో నిలిచింది. ఇండియా స్కిల్ నివేదిక 2023లో కేంద్ర ప్రభుత్వం ఈ అంశాలను వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక, సాంకేతిక మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయని తెలిపింది. 2022లో ఏపీ అత్యధిక వృద్ధి సాధించినట్లు నివేదికలో పేర్కొంది. అందులో ముఖ్యాంశాలు ఇవీ..

- అత్యధికంగా ఉపాధి కల్పించే రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ (72.7 శాతం) మొదటి స్థానంలో ఉండగా 69.8 శాతంతో మహారాష్ట్ర రెండో స్థానంలో ఉంది. 68.9 శాతంతో ఢిల్లీ మూడో స్థానంలో నిలవగా 65.58 శాతంతో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో నిలిచింది. రాజస్థాన్, కర్నాటక వరుసగా తరువాత స్థానాల్లో ఉన్నాయి.
- ఏపీలో యువత ఉపాధి అవకాశాలను పెంపొందించేలా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పీఎం కేవీవై ద్వారా రాష్ట్రంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి.
- ఆంగ్లం, గణితంలో చక్కటి నైపుణ్యాలున్న తొలి ఐదు రాష్ట్రాల సరసన ఆంధ్రప్రదేశ్ చోటు సాధించింది. గణితంలో మంచి నైపుణ్యం ఉన్న యువత లభ్యతలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. ఇంగ్లీషు ప్రావీణ్యం కలిగిన యువత లభ్యత రాష్ట్రాల్లో ఏపీ మూడో స్థానంలో ఉంది.
- ఆంధ్రప్రదేశ్‌లో 22 – 25 ఏళ్ల వయసున్న యువత ఉపాధి స్కోరు 64.36 శాతం ఉంది.
- మహిళలకు అత్యధికంగా ఉపాధి కల్పించే వనరులు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్నాయి. ఒడిశా, ఢిల్లీలో పురుషులకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పన వనరులున్నాయి. రానున్న సంవత్సరాల్లో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, కేరళలో ఉపాధి అవకాశాలు మరిన్ని పెరుగుతాయి.
- ఘజియాబాద్, తిరుపతి, కర్నూలు, మంగుళూరు తదితర పది నగరాల్లో నైపుణ్యం కలిగిన మహిళా కార్మిక వనరులు అందుబాటులో ఉన్నాయి.
- న్యూమరికల్ స్కిల్స్ అత్యధికంగా ఉన్న నగరాల్లో చిత్తూరు, అమలాపురం ఉన్నాయి.
- ఆంగ్ల భాషతోపాటు బిజినెస్ కమ్యూనికేషన్ నైపుణ్యాలున్న నగరాల్లో ముంబై, తిరుపతి, పుణే ముందు వరుసలో ఉన్నాయి.

> ఎవరైతే తమ సాక్ష్యాల మీద స్థిరంగా ఉంటారో; మరియు ఎవరైతే తమ నమాజులను కాపాడుకుంటారో; ఇలాంటి వారంతా సగౌరవంగా స్వర్గ వనాలలో ఉంటారు.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, మార్చి, 31

ఎన్నికల కర్ణాటకం

రానున్న 2024 లోక్‌సభ ఎన్నికల కురుక్షేత్రం ఎలా ఉండనుంది? దానికి ట్రైలర్ లాంటి ఈ ఏటి తొలి భారీ ఎన్నికల పోరు కర్ణాటక చూస్తే సరి. అందుకు ఇప్పుడు రంగం సిద్ధమైంది. కీలక దక్షిణాది రాష్ట్రాల్లో ఒకటైన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో రానున్న మే 10న జరుగుతాయని కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించేసరికి వేడి మరింత పెరిగింది. 224 స్థానాలున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు వివిధ కారణాల రీత్యా ప్రతి పార్టీకీ కీలకమే. దక్షిణాదికి ముఖద్వారం లాంటి కన్నడ కోటపై పట్టు బిగించడం బీజేపీకి ముఖ్యం. జీఎస్డీపీలో 8వ ర్యాంక్‌లో ఉన్న ఈ పెద్ద ధనిక రాష్ట్రంలో గెలవడం ద్వారా పుంజుకోవడం కాంగ్రెస్‌కు కీలకం. గత ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచినా కాంగ్రెస్‌తో జట్టు కట్టి, ఏడాది పాటు సీఎం పీఠంపై తమవాణ్ణి కూర్చోబెట్టుకున్న జేడీ–ఎస్ తన ప్రాసంగికతను నిరూపించుకోవడానికి ఈ ఎన్నికలు ప్రధానం. వెరసి, ఈసారి మతం, కులం, అవినీతి ప్రధానాంశాలు కానున్న కర్ణాటక ఎన్నికల సమరం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

కాంగ్రెస్, జనతాదళ్– సెక్యులర్ (జేడీ–ఎస్) పార్టీలు ఇప్పటికే అభ్యర్థుల తొలి విడత జాబితా విడుదల చేసి ప్రచారంలో దూసుకుపోతుంటే, బీజేపీ ఏప్రిల్ మొదటి వారానికి జాబితాతో సిద్ధమవు తుందట. నిజానికి కర్ణాటకలో బీజేపీ తొలి విజయం ఈనాటిది కాదు. 2008లోనే స్వతంత్ర ఎమ్మెల్యే లతో కలసి, ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ పీఠంపై కూర్చుంది. దక్షిణాదిన అదే తొలి బీజేపీ సర్కార్. అప్పట్లో ఒకరికి ముగ్గురు ముఖ్యమంత్రులు (యెడియూరప్ప, సదానంద్ గౌడ, జగదీశ్ షెట్టర్) మారారు. ఇక, 2018లో ప్రజాతీర్పు విస్పష్టంగా లేక, హంగ్ అసెంబ్లీ ఏర్పడడంతో ఎన్నికల అనంతర విన్యాసాలు మరింత రంజుగా సాగాయి. ఆ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా బీజేపీ అవతరించింది. దేవెగౌడ సారథ్యంలోని జేడీ(ఎస్)– కాంగ్రెస్ పార్టీల ఎన్నికల అనంతర పొత్తు పెట్టుకున్నాయి. అతి పెద్ద పార్టీగా బీజేపీ పక్షాన ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకొచ్చిన యెడియూరప్ప గద్దెనెక్కారు కానీ, తగినంత మెజారిటీ లేక విశ్వాస పరీక్షకు పది నిమిషాల ముందు పక్కకు తప్పుకోవాల్సి వచ్చింది.

ఆపైన దేవెగౌడ కుమారుడు కుమారస్వామి సీఎంగా జేడీ (ఎస్)– కాంగ్రెస్‌ల ప్రభుత్వం ఏర్పాటైంది. తీరా 'ఆపరేషన్ కమలం–2' ద్వారా 16 మంది ఎమ్మెల్యేలను బీజేపీ తన వైపు తిప్పుకుంది. అలా ఆ సంకీర్ణ సర్కార్ 14 నెలలకే కుప్పకూలింది. మళ్ళీ యెడియూరప్ప అధికారంలోకి వచ్చారు. తీరా రెండేళ్ళకే ఊహించని పరిణామాలతో యెడియూరప్ప ఆ పీఠం బసవరాజ్ బొమ్మైకి కట్టబెట్టారు. అలా 2018 నుంచి అయిదేళ్ళలో నాలుగు విడతల్లో ముగ్గురు సీఎంలుగా వచ్చారు. అసమర్థ పాలన, 40 శాతం కమిషన్ అవినీతి ముద్ర పడేసరికి కాషాయపార్టీ సతమతమవుతోంది. కర్ణాటకలో 7 శాతం ఎస్టీలు, 17 శాతం ఎస్సీలు, 14 శాతం లింగాయత్‌లు, 11 శాతం ఒక్కళిగలని లెక్క. అందుకే, కాంగ్రెస్ 'అహింద' (మైనారిటీలు, వెనుకబడిన వర్గాలు, దళితుల) ఓటుబ్యాంక్‌పై ఆధారపడుతుంటే, దాన్ని ఢీ కొనడానికి బీజేపీ సోషల్ ఇంజనీరింగ్‌కు దిగింది. ఓబీసీ కింద ముస్లిమ్‌లకిస్తున్న 4 శాతం కోటాను తొలగించి, రాష్ట్రంలో బలమైన ఓటుబ్యాంకైన లింగాయత్‌లు, ఒక్కళిగలకు పంచింది. ఎస్సీలకు 15 నుంచి 17 శాతానికీ, ఎస్టీలకు 3 నుంచి 7 శాతానికీ రిజర్వేషన్‌ను పెంచింది.

రిజర్వేషన్లలో తాజా మార్పు తమకు కలిసొస్తుందని బీజేపీ భావిస్తుంటే, కోటా తొలగింపుపై ముస్లిముల్లో, ఎస్సీల్లో అంతర్గత కోటాపై బంజారాల్లో వెల్లువెత్తుతున్న నిరసన ఆ పార్టీకి తలనొప్పే. తాజా ఎన్నికల సర్వేల్లో సీ–ఓటర్ లాంటివి కాంగ్రెస్ ఘనవిజయం ఖరారంటే, 'జీ' లాంటివి కాంగ్రెస్, బీజేపీల మధ్య పోరు నువ్వా, నేనా అన్నట్టు ఉంటుందంటున్నాయి. అంచనాలెలా ఉన్నా బీజేపీ ఈ ఎన్నికల్ని ఆషామాషీగా తీసుకోవట్లేదు. గత 3 నెలల్లో 7సార్లు మోదీ కన్నడసీమలో పర్యటించడమే అందుకు ఉదాహరణ. మోదీతో పాటు అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, గత ఎన్నికల్లో 'టిప్పు సుల్తాన్ వర్సెస్ హనుమాన్' అంటూ భావోద్వేగాలు రెచ్చగొట్టిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు దిగ్గజాలు తాజా ఎన్నికల ప్రచారానికి దిగుతున్నారు.

మొత్తం 5.24 కోట్ల ఓటర్లున్న కర్ణాటకలో తొలిసారి ఓటుహక్కు వచ్చినవారు నిరుటితో పోలిస్తే 9.17 లక్షలు పెరిగారు. అలాగే, 80 ఏళ్ళు పైబడిన దాదాపు 1.5 లక్షల మందికీ, దివ్యాంగులు 5.6 లక్షల మందికీ తొలిసారిగా ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకొనే వీలు కల్పిస్తున్నారు. ఓటింగ్ శాతం పెంచడానికీ, పట్టణ ఓటర్లలో నిరాసక్తతను తగ్గించడానికీ ఇలాంటి చర్యలని అధికారిక కథనం. అయితే, ఇప్పటికే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అనుమానాలు తొలగని అనేక పార్టీలు... ఇక ఇంటి నుంచే ఓటింగ్ అనేది అధికారిక యంత్రాంగ దుర్వినియోగానికి దారి తీస్తుందని ఆందోళన చెందుతున్నాయి. ఆ భయాందోళనల్ని బాపాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే.

ఎవరి బలాబలాలు ఎలా ఉన్నా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి చాలా ముందు నుంచే ప్రతి పార్టీ యాత్రలు, ప్రచారం మొదలెట్టేసింది. ఓటర్లకు డిజిటల్ వాచీలు, రైస్ కుక్కర్ల లాంటి కానుకల పంపిణీ యథేచ్ఛగా సాగుతోంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రావడానికి ముందే రూ. 80 కోట్ల పైగా నగదు చిక్కింది. ఇప్పుడే ఇలా ఉంటే, రేపు ప్రజలు తిరుగులేని తీర్పు ఇస్తే తప్ప ఎన్నికల అనంతరం ఎలా ఉంటుందో ఊహించవచ్చు. ఓట్ల కోసం కోట్లు కుమ్మరిస్తున్న పార్టీలు... ఎన్నికలయ్యాక ఎమ్మెల్యేల బేరసారాలకూ అదే పంథా అనుసరిస్తే ఆశ్చర్యం లేదు. అలా జరిగితే మరోసారి ప్రజాస్వామ్యం పరిహాసం పాలవుతుంది. ఇటీవలి అనేక ఎన్నికల లాగే కర్ణాటకలోనూ ఫలితాల అనంతరమే అసలు నాటకం మొదలుకావచ్చు. దాని కోసం మే 13 దాకా ఆగాల్సిందే!

ప్రజాస్వామ్యానికి పరీక్షా సమయం

విశ్లేషణ



ఎస్.వై. ఖురేషీ

న్యాయమూర్తి శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పుపై సంతకం పెట్టిన వెంటనే 'అనర్హత' అమల్లోకి వచ్చేస్తుందని మాజీ అటార్నీ జనరల్ ఒకరు అన్నారు. విద్వేషపూరిత రాజకీయాలు పెచ్చరిల్లుతున్న ఈ తరుణంలో రెండేళ్ల జైలుశిక్ష పడగల ఐపీసీ సెక్షన్ 153(ఎ), సెక్షన్ 505 పరీక్షకు ఎంతమంది రాజకీయ నేతలు నిలబడగలరు? ఈ రెండు సెక్షన్లూ దేని గురించో తెలుసా? మతం, భాషల ఆధారంగా సమాజంలో శత్రుత్వాన్ని పెంపొందించడం! కాబట్టి, కొంతమంది ఎంపీలను ఎంపిక చేసుకుని మరీ సభ్యత్వాలను రద్దు చేసే ప్రయత్నం ఎందుకు? ప్రజాస్వామ్యం పచ్చగా ఉండాలంటే ప్రతిపక్షం తప్పనిసరి అన్నది గుర్తుంచుకోవాలి. పరువునష్టం కేసుల విషయంలో చట్టాలను సమీక్షించేందుకు ఇదే సరైన తరుణం.

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దయిపోయింది. న్యాయపరంగా, రాజకీయంగా దీని పరిణామాలు ఎలా ఉండనున్నాయన్న ప్రశ్నలు చాలామందిలో తలెత్తుతున్నాయి. రాజకీయ వర్గాల్లో ఇప్పటికే చలామణీలో ఉన్న ప్రశ్నలతోపాటు సభ్యత్వ రద్దుతో రాగల ముఖ్యమైన సరికొత్త సందేహాలకు సమాధానాలు వెతికే ప్రయత్నం చేద్దాం. స్థూలంగా చెప్పాలంటే, దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం భవిష్యత్తు ఏమిటన్నది తరచిచూద్దాం.

సూరత్‌లోని మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి మార్చి 23న పరువునష్టం దావా కేసులో రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.15,000 జరిమానా విధించారు. ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 499, 500ల కింద దోషిగా నిర్ధారించారు. శిక్ష అమలును నెల రోజుల పాటు స్తంభింపజేసి, హైకోర్టును ఆశ్రయించేందుకు వీలుగా బెయిల్ ఇచ్చారు. అయితే న్యాయమూర్తి తీర్పు వెలువరించిన మరుసటి రోజే లోక్‌సభ కార్యాలయం రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీనిపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనలకు దిగిన విషయం తెలిసిందే. ఇందుకు బదులు కాంగ్రెస్ నేతలు శిక్ష రద్దును కోరుతూ హైకోర్టును ఆశ్రయించి ఉండాల్సింది. ఈ సమస్యకు పరిష్కారం న్యాయస్థానాల్లోనే లభిస్తుంది కానీ వీధుల్లో కాదు.

హైకోర్టులు శిక్షను నిలిపివేయడం లేదా రద్దు చేయడం వల్ల మాత్రమే రాహుల్ గాంధీ మళ్లీ లోక్‌సభ సభ్యుడు కాగలరు. 2013 నాటి లిలీ థామస్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఏదైనా ఒక కేసులో శిక్ష ప్రకటించిన వెంటనే లోక్‌సభ సభ్యత్వం దానంతటదే రద్దయిపోతుంది. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ సహా దాదాపు 20 మంది తమ సభ్యత్వాలను కోల్పోయిన విషయం ప్రస్తావనార్హం.

లోక్‌సభ కార్యాలయం తొందరపాటు?

రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేసే విషయంలో లోక్‌సభ కార్యాలయం తొందరపడిందా? మాజీ అటార్నీ జనరల్ ఒకరు చెప్పిన దాని ప్రకారం, లోక్‌సభ కార్యాలయానికి ఇంతకు మించిన ప్రత్యామ్నాయం లేదు. న్యాయమూర్తి శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పుపై సంతకం పెట్టిన వెంటనే 'అనర్హత' అమల్లోకి వచ్చేస్తుందని తెలిపారు. అయితే లక్షద్వీప్ ఎంపీ విషయంలో ఇందుకు విరుద్ధంగా జరిగిన విషయాన్ని ఆయన ప్రస్తావించలేదు.

హత్యాయత్నం చేశాడన్న ఆరోపణలపై కేరళ కోర్టు ఒకటి మహమ్మద్ ఫైజల్‌కు పదేళ్ల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల తరువాత ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ జారీ చేసింది. లక్షద్వీప్ నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ 2023 జనవరి 18న ప్రకటించింది కూడా. అయితే వారం రోజుల తరువాత కేరళ హైకోర్టు మహమ్మద్ ఫైజల్ శిక్షపై స్టే విధించింది. దీంతో సుప్రీంకోర్టు ఉప ఎన్నికను కూడా తాత్కాలికంగా నిలిపివేసింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, జనవరి 25 నుంచి మార్చి 29వ తేదీ వరకూ మహమ్మద్ ఫైజల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించకపోవడం! ఉన్నత న్యాయస్థానం శిక్షపై స్టే విధించిన వెంటనే లోక్‌సభ్య సభ్యత్వం దానంతటదే పునరుద్ధరింపబడుతుందా, లేదా అన్న స్పష్టత మాజీ అటార్నీ జనరల్ ఇవ్వలేకపోయారు. (అయితే, సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణకు వచ్చేందుకు కొన్ని గంటల ముందు ఫైజల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించిన విషయం తెలిసిందే.)



చట్టాల్లోని ఈ లోపం ఎంపిక చేసిన వారిపై వేగంగా చర్యలు తీసుకునేందుకు అవకాశం కల్పిస్తుందన్న వాదన ఉంది. కోర్టుల తీర్పుల అమలును ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేయడం కోర్టు ధిక్కారం కిందకు రాదా? 2018లో ఎన్నికల కమిషన్, లోక్ ప్రహరీ మధ్య జరిగిన ఒక కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ... అప్పీలు పెండింగ్‌లో ఉండి ఉన్నత న్యాయస్థానాలు శిక్షపై స్టే విధిస్తే, శిక్ష పరిణామంగా అమల్లోకి వచ్చే సభ్యత్వ రద్దు పనిచేయదని విస్పష్టంగా తెలిపింది.

రాహుల్ కేసులో ఎన్నో సందేహాలు...

రాహుల్ గాంధీపై సూరత్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలైన కేసుపై ఎన్నో సందేహాలున్నాయి. కేసు పిటిషనర్ గత ఏడాదే హైకోర్టు నుంచి విచారణపై ఎందుకు స్టే తెచ్చుకున్నారన్నది ఒక ప్రశ్న. దీని ఫలితంగా కేసు విచారణ దాదాపు 12 నెలల పాటు ఆలస్యమయ్యేందుకు పిటిషనర్ కారణమయ్యారు. అదనపు సాక్ష్యాలేవీ వెలుగులోకి రాని నేపథ్యంలో ఈ ఏడాది స్టే ఎత్తేయించుకునేందుకు ఏ రకమైన పరిణామాలు కారణమయ్యాయన్నదీ అస్పష్టమే. పైగా ఈ ఏడాది ఫిబ్రవరిలో సూరత్ కోర్టు మేజిస్ట్రేట్ ఎందుకు మారారు?

కర్ణాటకలోని కోలార్‌లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు క్రిమినల్ డిఫమేషన్ కిందకు వస్తాయా? లేక సివిల్ డిఫమేషన్ పరిధిలోకా? 2019 ఏప్రిల్ 13న ఎన్నికల ర్యాలీ సందర్భంగా రాహుల్ అన్నది ఇదీ: ''ఒక చిన్న ప్రశ్న... ఈ దొంగలందరి ఇంటిపేర్లు మోదీ, మోదీ, మోదీ అనే ఎందుకుంది? నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ...'' ఈ వ్యాఖ్య పైనే పరువు నష్టం కేసుల్లో గరిష్ఠంగా విధించగల రెండేళ్ల జైలు శిక్ష విధించవచ్చా? పార్లమెంటు సభ్యత్వం రద్దయ్యేందుకు కనీసం రెండేళ్ల జైలు శిక్ష పడాలన్నది ఇక్కడ కాకతాళీయమేనా?

అన్నింటికంటే ముఖ్యంగా మనలాంటి దేశంలో, విద్వేషపూరిత రాజకీయాలు పెచ్చరిల్లుతున్న ఈ తరుణంలో రెండేళ్ల జైలుశిక్ష పడగల ఐపీసీ సెక్షన్ 153(ఎ), సెక్షన్ 505 పరీక్షకు ఎంతమంది రాజకీయ నేతలు నిలబడగలరు? ఈ రెండింటిలో దేని కిందనైనా శిక్ష పడితే ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8 కింద చట్టసభల సభ్యత్వం రద్దయిపోతుంది. ఈ రెండు సెక్షన్లూ దేని గురించో తెలుసా? మతం, భాషల ఆధారంగా సమాజంలో శత్రుత్వాన్ని పెంపొందించడం! కాబట్టి, కొంతమంది ఎంపీలను ఎంపిక చేసుకుని మరీ వారి సభ్యత్వాలను రద్దు చేసే ప్రయత్నం ఎందుకు? అధికార పక్షంలో ఉంటూ పైన చెప్పిన సెక్షన్ల పరిధిలోకి రాగలవారిని చూసీచూడనట్లు వదిలేయడం ఎందుకు? అధికార పక్షం స్వయంగా చెబుతున్నట్లుగా చట్టం అందరికీ సమానమే, అందరూ చట్టం ముందు సమానులే కావాలి కదా?

సమీక్షకు ఇదే తరుణం...

నా దృష్టిలో పరువునష్టం కేసుల విషయంలో చట్టాలను సమీక్షించేందుకు ఇదే సరైన తరుణం. యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, శ్రీలంక తదితర దేశాల్లో ఇప్పటికే పరువు నష్టం దావాల 'డీక్రిమినలైజేషన్' జరిగింది. ఆయా దేశాల్లో ఇప్పుడు పరువు నష్టం అనేది క్రిమినల్ నేరం కాదు. భారత్ కూడా ఇదే పద్ధతిని అనుసరించాలి.

చివరిగా ఇకపై ఇలాంటి వ్యవహారాలు తగిన పద్ధతి ఆధారంగా న్యాయస్థానాల ద్వారా మాత్రమే జరగాలి. సభ్యత్వ రద్దుపై తీర్పు అనేది వీధుల్లో చర్చించే అంశం కానే కాదు. రాహుల్ లోక్‌సభ సభ్యత్వ రద్దు తాలూకు రాజకీయ పరిణామాలు ఇప్పుడిప్పుడే నెమ్మదిగా తెలుస్తున్నాయి. ఇవి ఎక్కడికి దారితీస్తాయన్నది వేచి చూడాల్సిన అంశం. ఇంకో ఏడాదిలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దీనికి మరింత ప్రాధాన్యం ఏర్పడుతోంది. న్యాయపరంగా లేదా రాజకీయాల్లో ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ అందరూ అంగీకరించాల్సిన విషయం ఒకటి ఉంది... ప్రజాస్వామ్యం పచ్చగా ఉండాలంటే ప్రతిపక్షం తప్పనిసరి అన్నది అందరూ గుర్తుంచుకోవాలి. ప్రతిపక్షాలను చంపేసే ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పడాల్సిందే!

వ్యాసకర్త కేంద్ర మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్

('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అదే గొప్పతనం



శ్రీరాముడిని ఆయన జీవితం పర్ఫెక్టుగా ఉన్నందుకు మనం పూజించడం లేదు ; కానీ ఆయన్ని సూపర్‌స్టార్ చేసినదేమంటే, ఉన్న పరిస్థితులకు సాధ్యమైనంత అత్యుత్తమమైన పద్ధతిలో స్పందించగలగడం!

– జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మిక బోధకుడు

వ్యక్తిపూజ



ఒకప్పుడు పీవీ నరసింహారావు పార్థివ దేహాన్ని కాంగ్రెస్ పార్టీ హెడ్ క్వార్టర్‌లోకి తేకుండా గేట్లు మూసేసిన బానిసలు, ఇప్పుడు రాహుల్ గాంధీకి తమ బంగళాలను వాడుకొమ్మని చెబుతున్నారు. వ్యక్తిపూజ అనేది వారి నరనరాల్లో ఉంది.

– కపిల్ కొమిరెడ్డి, రచయిత

చిరు మేలు



అవును, చిరుధాన్యాల్లో ఉండే అత్యధిక పీచుదనం వల్ల అవి మధుమేహానికి మంచివి. పీచు జీర్ణక్రియను నెమ్మదిగా జరిగేట్టు చేస్తుంది. దీని ఫలితంగా, చక్కెర రక్తంలోకి నెమ్మదిగా కలుస్తుంది. దానివల్ల ఉన్నట్టుండి రక్తంలో చక్కెర పెరిగే రిస్కు తగ్గుతుంది.

– వి. మోహన్, డయబెటాలజిస్ట్

పట్టుకోలేక...



దేశంలోని ప్రతి సీసీ టీవీకి అమృత్ పాల్ సింగ్ (ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు) ఫోజులు ఇవ్వడం పూర్తయ్యేదాకా పంజాబ్ పోలీసులు, అజిత్ దోవల్ బలగాలు వేచి ఉంటున్నాయి. అప్పటిదాకా పట్టుకునేట్టు లేరు.

– హర్తోష్ సింగ్ బాల్, సంపాదకుడు

అప్పుడే కాపాడగలం



మీరు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనుకుంటే, సత్యాన్ని పరిశోధించి ప్రచురించే సంస్థలను గౌరవించే నాయకులకు ఓటేయండి. తమకు నచ్చిన సత్యాన్ని ఎన్నుకోవడం కాకుండా, ఏ ప్రభుత్వాన్నయినా ఎన్నుకునే హక్కు జనానికి ఉందని చెప్పే పార్టీకి ఓటేయండి.

– యువల్ నోవా హరారీ, చరిత్రకారుడు

వారికి పరీక్ష.. వీరికి పొలిటిక్స్

సారాంశం

సరికొండ చలపతి

కథలన్నీ అనగనగాతో ప్రారంభం కాకపోవచ్చు, ఓ లీకేజీతో స్టార్టయి... పొలిటిక్స్‌తో మహాభారత కథ రేంజ్‌కు పెరగవచ్చు. మనం ఇప్పుడు అనగనగా ఓ ఊరుతో మొదలుపెడదాం... ఆ ఊరిలో ఓ ఆసామికి పొలిటిక్స్‌పై ఇంట్రెస్టు. ఎన్నటికయినా సర్పంచ్ కాకపోతానా అని ఆశ. అయితే ఆ ఊరిలో అలా ఆశపడేవారు చాలామందే ఉన్నారు. కాకపోతే ఎలా కావడమో తెలియదు. సమయం కోసం ఎదురు చూస్తున్నారు.

ఓ రోజు ఆ ఆసామి నుదుటన విభూతి రేఖలు, చెవిలో వెంట్రుకలు పెట్టుకుని కనిపించాడు. అది చూసి ఆ ఊరివాళ్లు ఇదేమిటని అడిగితే ఓ పట్టాన జవాబు చెప్పలే. రహస్యంగా ఉంచాడు. కానీ రహస్యం ఆగుతుందా..? రెండు రోజుల్లోనే ఆ నోటా ఈ నోటా అసలు విషయం బయటికి వచ్చింది.

'ఓ స్వాములోరు ఓ గాడిదను మథుర నుంచి తెచ్చారు. అది వసుదేవుడు కాళ్లు పట్టుకున్న గాడిద సంతతికి చెందింది. దాని చుట్టూ ప్రద క్షిణలు చేసి ఆ గాడిద వెంట్రుక చెవిలో పెట్టుకుంటే పుణ్యం వస్తది... ఆ వెంటనే అధికారం వస్తదని ఆ స్వామి చెప్పాడు. అసలే సర్పంచ్ పదవిపై కన్నేసిన మనోడు మరుక్షణం ఆ పని చేసేశాడు. ఈసారి అధికారం మనదే అన్న ధీమాతో తిరుగుతు న్నాడు....'



ఈ రహస్యం క్రమంగా బహిరంగమైంది. అధికారానికి దగ్గరి మార్గం అందరికీ తెలిసింది. రాజకీయాలపై, పదవులపై ఆసక్తి ఉన్నవారు పోలోమని దాని చుట్టూ చేరారు. మూడు ప్రదక్షిణలు చేయడం, వెంట్రుక పీకి చెవిలో పెట్టుకోవడం.. ఇది క్రమేణా చుట్టుపక్కల ఊర్లకు చేరింది. అందరూ క్యూ కట్టారు. పక్కనే విభూతి షాపులు వెలిశాయి. స్నానానికి ఏర్పాట్లు జరిగాయి. అంతా ఓ జాతరలా తయారయ్యింది. అధికారం కోసం ప్రయత్నం చేస్తున్న వారి హడావిడి చూసి అధికారంలో ఉన్న వాళ్లు అలర్ట్ అయ్యారు. ఇదేదో మన పదవి మీదికొచ్చే విషయం లాగా ఉందని భావించి... మందీమార్బలంతో చుట్టుముట్టేశారు. తలో చేయి వేయడం, వెంట్రుకలు పీకడంతో, రాజకీయాలు, పదవులేమో గానీ..

ఆ గాడిద చమ్మొరుకుంది.

ఇప్పుడచ్చంగా టీఎస్‌పీఎస్సీ పరిస్థితి ఇలాగే ఉన్నట్టుంది.

....

ఏ సిట్యుయేషన్ వదిలేయకపోవడమే కదా రాజకీయం అంటే! దీనికి విపక్షం, అధికార పక్షం అన్న తేడా ఉండదు. ఎక్కడానికి వారు, దిగకుండా ఉండడానికి వీరు. ఏ అంశం, ఏ అవకాశం అయినా వదల్లేదు.

....

అందుకే కొద్ది రోజులుగా టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ మీద ప్రతిపక్షాలకూ, అధికార పక్షాలకూ ఓ యుద్ధం నడుస్తోంది. ఒకరిపై ఒకరు కత్తులు దూస్తున్నారు. పేపర్లు, సోషల్ మీడియా అంతా విమర్శల బాణాలు కురుస్తున్నాయి. ప్రతిపక్షాలకు నోటీసులు, విచారణకు రమ్మంటూ ఫర్మానాలు.. మీ పార్టీ సభ్యుడు కారణం కాదా అంటూ అధికార పక్షం నుంచి పంచ్‌లు, ఆధారాలు.. లీకేజీకి ప్రభుత్వము, మంత్రులే బాధ్యులంటూ ప్రతిపక్షాల దీక్షలు, రాజీనామా చేయాలంటూ ధర్నాలు.. కావల్సినంత మసాలా దొరికింది. ఇది క్రమంగా రాజకీయ క్రీడగా మారింది. మరోవైపు బురద కడిగే పనిలో సిట్.

....

ఈ రణంలోనూ తెగిపడుతోంది నిరుద్యోగుల ఆశలే.. వారి భవిష్యత్తే.

....

ఏ వైరి పక్షమూ నష్టపోయింది లేదు. లాభం కోసం ప్రయత్నం తప్ప.

పొలం, బంగారం తాకట్టు పెట్టి కోచింగ్ తీసుకుని, నాలుగు ఎక్కువ మార్కుల కోసం నిద్రాహారాలు మాని, సర్కారు కొలువుకు ఇదే చివరి అవకాశం అని ఉన్న చిన్న ఉద్యోగాలు మానేసి తపస్సు చేస్తున్న యువత కష్టం అంతా ఈ రాజకీయ రంగమార్తాండుల వీరంగం ముందు చిన్నబోతోంది.

బాగా ట్రెండ్ అయిన ఈ విశ్లేషణ చూడండి..

ఇక్కడ ఆందోళనకరమైన విషయం ఏమిటంటే.. హ్యాకింగ్‌లు, అర్ధరాత్రి చోరీలు అక్కర్లేదు. కొంచెం ప్లాన్‌చేస్తే అక్కడ పనిచేసే ఉద్యోగులు ఎవరైనా ప్రశ్నపత్రాలు చోరీచేసే అవకాశం టీఎస్‌పీఎస్సీలోనే ఉంది.. ఇంకో ముఖ్యమైన విషయం.. లీక్ చేసిన వాళ్లు ఆర్థికంగా బలమైన వాళ్లు, ఇలాంటి విషయాల్లో ఆరితేరినవారు కాదు కనుకే ఇది బయటపడింది. సైలెంట్‌గా డబ్బులు వసూలు చేసుకోగలిగినా, ఏ పొలిటీషియన్నో, బడాబాబులో చేసున్నా... ఇది ఎప్పటికీ బయటకివచ్చే చాన్సే ఉండేది కాదు. నిద్రాహారాలు మాని చదివినవారు మా రాత ఇంతే అని సరిపెట్టుకునేవారు. అలా బయటకి రానివి ఎన్ని ఉన్నాయో తెలియదు.

....

30 లక్షల మంది అభ్యర్థులు, లక్షలమంది వారి కుటుంబ సభ్యులు ఆశలు పెట్టుకున్న టీఎస్‌పీఎస్సీలో.. ఇలా పెన్‌డ్రైవ్ పెట్టి అలా పేపర్‌లు బయటకి తీసుకెళ్లగలిగే పరిస్థితి ఉండడం అన్యాయం. ఇద్దరు వ్యక్తుల స్వభావంపై ఫలితాలు ఆధారపడి ఉండడం అన్యాయం. స్వయంగా మంత్రి, ఛైర్మన్‌లే వ్యక్తులపై వేలు చూపడం మన నిస్సహాయత్వాన్ని, పలు జీవితాలను శాసించగలిగే వ్యవస్థ డొల్లతనాన్ని చూపుతోంది.

....

ఈ కామెంట్ చూడండి..

"నేను నా ఫ్రెండ్స్, ఉదయం టిఫిన్ చేయకుండా మధ్యాహ్నం సాయిబాబా టెంపుల్‌లో భోజనం చేస్తూ, రాత్రి సమయంలో ఒక పులిహోర ప్యాకెట్ తింటూ, స్టడీ హాల్లో ఉంటూ, వారానికి ఒకసారి కేటరింగ్ సర్వీస్ చేసి ఫీజు కట్టుకుని చదివాం.. చివరకు ఇలా అయ్యింది. ఏ నమ్మకంతో మళ్లీ ప్రిపేర్ అవ్వాలి"... ఇది నిఖార్సయిన మచ్చుతునక.

...ఇప్పుడు చేయాల్సింది ఈ నమ్మకాన్ని నిలబెట్టడమే. దీన్ని రాజకీయ క్రీడ చేయడం కాదు... పైన కథలో చెప్పుకున్నట్లు దొరికింది కదా అని.. ఉన్న వెంట్రుకలు పీకి ఓ వ్యవస్థను, అనేక నిరుద్యోగుల ఆశలను చంపడం కాదు... ఇలా కళ్లనిండా ఆశలు నింపుకొని, కంటినిండా నిద్రపోకుండా రాత్రింబవళ్లూ చదువుతున్న నిరుద్యోగుల్లో మళ్లీ ఆసక్తి నింపడం, ఆశలు వెలిగించడం! ప్రతిపక్షం నుంచైనా.. అధికారపక్షం నుంచైనా అందరూ కోరుకునేది ఇదే!

చరిత్రంతా చేదు జ్ఞాపకాలే..

ఒక్క ఉద్యోగం తల రాత మారుస్తుంది. తరతరాల దారిద్ర్యాన్ని తీరుస్తుంది. ఎన్నో తరాలకు అక్షరాస్యత అందిస్తుంది. ముఖ్యంగా అట్టడుగు వర్గాల జీవితాలను అకస్మాత్తుగా మార్చగలిగేది ఉద్యోగమే. అదీ పై స్థాయి సర్కారీ కొలువైతే కాసింత పవర్ కూడా.. కానీ, ఉద్యోగ నియామకాల్లో అనేకసార్లు అధికార పక్షాల, వ్యవస్థల నిర్లక్ష్యమే కనిపిస్తుంది. తరచూ దేశంలో ఏదో ఒక చోట స్కూల్ బోర్డ్ పరీక్షలో, యూనివర్సిటీ పరీక్షలో, ఉద్యోగ పరీక్షలో ఏదో ఒక పేపర్ లీకేజీ బయటపడుతూనే ఉంది.

పేపర్లను ముద్రించే ప్రెస్‌ల సిబ్బంది నుంచి ప్రభుత్వ అధికారులు, అధ్యాపకుల దాకా చాలా మంది లీకేజీలకు కారకులుగా ఉంటున్నారు. లక్షలు, కోట్లలో సొమ్ము చేతులు మారుతోంది. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం.. గత ఏడేళ్లలో వివిధ రాష్ట్రాల్లో 70కి పైగా ప్రశ్నపత్రాల లీకేజీలు బయటపడ్డాయి. ఏకంగా కోటిన్నర మందికిపైగా విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడింది.

ఇటీవలే అస్సాంలో పదో తరగతి సైన్స్‌సబ్జెక్టు ప్రశ్నపత్రం లీకైంది. ప్రశ్నపత్రం దొరికినవాళ్లు కేవలం రూ.200 నుంచి రూ.3 వేల రేటుతో అమ్ముకుంటూ వెళ్లారు. మరి కొందరు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసు కున్నారు. పదో తరగతి ప్రశ్నపత్రాలనే చూస్తే.. గత ఏడేళ్లలో పశ్చిమ బెంగాల్‌లో పదిసార్లు (మెయిన్, సప్లిమెంటరీ కలిపి)... బిహార్‌లో ఆరుసార్లు లీకయ్యాయి

తమిళనాడులో 2022లో పదో తరగతితోపాటు 12వ తరగతి (ఇంటర్) ప్రశ్నపత్రాలు లీకయ్యాయి. ఉద్యోగ పరీక్షల లీకేజీలో రాజస్థాన్ రికార్డునే సృష్టించింది. అక్కడ 2015 – 2022 మధ్య ఏకంగా 14 పోటీ పరీక్షల పేపర్లు లీకయ్యాయి. ఇందులో యూజీసీ నెట్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్ష వంటివీ ఉండటం గమనార్హం. చివరిసారిగా గత డిసెంబర్‌లో సీనియర్ ప్రభుత్వ టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి జనరల్ నాలెడ్జ్ ప్రశ్నపత్రం లీకవడంతో పరీక్షను రద్దు చేశారు.

పేపర్ల లీకేజీలో గుజరాత్ కూడా పోటీ పడుతోంది. ఆ రాష్ట్రంలో గత ఏడేళ్లలో 14 పరీక్షల పేపర్లు లీకయ్యాయి.


2017 – 2022 మధ్య యూపీలో ఎనిమిది పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయి. తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, బిహార్, హరియాణా... ఏ రాష్ట్రం దీనికి మినహాయింపు కాదు.

అప్పుడే సార్థకత!

సృష్టిలోని 84 లక్షల జీవరాశుల్లో మానవ జన్మ ఉత్తమమైనది బుద్ధి, ఆలోచన, వాక్కు కలిగిన మానవుడు మిగతా జీవుల కంటే ఉత్తముడు, ఉన్నతుడు. నిజానికి మిగిలిన జీవుల నుంచి మనిషిని వేరుచేసినవి ఈ లక్షణాలే. నిద్ర, ఆహార, మైథునాలకే పశుపక్ష్యాదులు పరిమితమవుతాయి. మనిషి కూడా కేవలం వాటికే పరిమితమైననాడు మానవ జన్మకు సార్థకత ఉండదు. అందుకే మంచి ఆలోచనతో సత్కర్మలు చేస్తూ దైవ కృపకు పాత్రులు కావాలి.

మానవుడితో సహా భూమి మీద జన్మించిన ప్రాణులన్నీ ఆయువు తీరిపోగానే మృతి చెందాల్సిందే. జీవం లేని దేహం తిరిగి పంచ భూతాల్లో కలిసిపోతుంది. పాపపుణ్యాల ఆధారంగా జీవుడికి మరో జన్మ ప్రాప్తిస్తుంది.

మానవ జీవన ప్రమాణం నూరేళ్లయినా నిండు జీవితం గడిపే భాగ్యం అందరికీ దక్కడం లేదు. వారి వారి కర్మల ఆధారంగా ఆయుః ప్రమాణాలు నిర్ణయింపబడతాయి. కలియుగంలో జన్మించిన మానవులు పాపకర్మల మూలంగా ఆయువును క్షీణింపజేసుకుంటూ అకాల మరణం పొందుతున్నారు.



జ్యోతిర్మయం

ఒకప్పుడు మహర్షులు, మహానుభావులు తమ ఆయువును వృద్ధి చేసుకోగలిగే వాళ్ళు. మరి కొందరు మృత్యువునే జయించారు. దశరథుడు, రాముడు, రావణుడు వంటివారు ఆయుష్షును పెంచుకోగా... పరశురాముడు, హనుమంతుడు వంటివారు మృత్యుంజయులయ్యారు.

భగవంతుడు జగన్నాటక సూత్రధారి. జనులంతా అతని నాటక రంగంలో పాత్రధారులు. తనకు నచ్చినట్టు ప్రవర్తించిన వాళ్లను ఆయువు తీరగానే దేవుడు తనలో కలుపుకొంటాడు. అక్రమ రీతిలో ప్రవర్తించిన వాళ్ళను తగువిధంగా శిక్షిస్తాడు.

మానవుడై జన్మించిన వారు పురుషార్థాలైన ధర్మార్థ కామ మోక్షాలను సంపాదించాలి. ధర్మ మార్గాన్ని వదలకుండా అర్థ సంపాదన చేసి, ధర్మ విరుద్ధం కాని కామాన్ని అనుభవించి, మోక్ష యత్నం చేసి విముక్తులవ్వాలి. పురుషార్థాల ముఖ్యోద్దేశం ఇదే.

మానవుడెలాగూ మృత్యువును జయించ లేడు. కనీసం ఉత్తమ నడవడిక, ఆధ్యాత్మిక భావ చైతన్యంతో మంచి మార్గంలో నడవడానికి ప్రయత్నించాలి. భగవంతుని ఆజ్ఞకు బద్ధులై ఆయన అనుగ్రహం పొందేలా ప్రవర్తించడం మానవుని కర్తవ్యం. అనివార్యమైన మృత్యువు ఎవరిని ఎప్పుడు ఆహ్వానిస్తుందో తెలియదు. కాలహరణం చేయకుండా సత్కార్యాలను చేసి భగవంతుని కృపకు పాత్రులు కావడం వల్లనే మానవజన్మకు సార్థకత చేకూరుతుంది.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.దశమి రా.1.55 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** పుష్యమి రా.2.05 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** ఉ.8.23 నుండి 10.09 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.24 నుండి 9.15 వరకు, తదుపరి ప.12.29 నుండి 1.17 వరకు, **అమృతఘడియలు:** సా.6.59 నుండి 8.45 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.00, **సూర్యాస్తమయం:** 6.08.



మాంగల్యధారణ మహోత్సవంలో భాగంగా మంగళసూత్రాలను చూపిస్తున్న అర్చకులు

రామతీర్థంలో వైభవంగా రాములోరి కల్యాణం

సాక్షి ప్రతినిధి, విజయనగరం/సింహాచలం: శ్రీరామనవమి సందర్భంగా విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం రామతీర్థంలోని రామస్వామివారి పుణ్యక్షేత్రంలో శ్రీసీతారామస్వామి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. వేకువజామునే ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆంధ్రాలో రెండో భద్రాద్రిగా పేరుగాంచిన రామతీర్థంలో స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఉదయం 10 గంటలకు స్వామి కల్యాణ వేడుక ప్రారంభమైంది. ప్రత్యేక పూజల అనంతరం సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో పల్లకిలో ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. సీతారామలక్ష్మణులకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, సముద్ర, నదీజలాలతో అష్టకలశ స్నపన మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలతో సీతారాములను అలంకరించి కల్యాణానికి సిద్ధం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో ఉత్సవ విగ్రహాల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు. తరువాత మాంగల్యధారణ జరిపించారు. ముత్యాల తలంబ్రాల కార్యక్రమం కనులపండువగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన 35 మంది రుత్వికులు, ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను జరిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఝాన్సీ దంపతులు సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు. సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం తరఫున ఆలయ ఈవో వి.త్రినాథరావు, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు, అధికారులు పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఆలయంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు.



శ్రీసీతారాముల కల్యాణం సందర్భంగా మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు, చిత్రంలో చినజీయర్ స్వామి

కనులపండువగా.. భద్రాద్రి రామయ్య పెండ్లి సంబరం

సాక్షి, భద్రాచలం: భద్రాచలం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ గర్భగుడిలోని మూల విరాట్టులకు గురువారం ఉదయం 8 గంటల సమయంలో శాస్త్రోక్తంగా లఘు కల్యాణం నిర్వహించారు. 9.30 గంటల తర్వాత లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పల్లకిలో తీసుకొచ్చి బాజాభజంత్రీల నడుమ మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి చేర్చారు. కల్యాణ మండపంలో శ్రీరాముడు వెండి సింహాసనంలో ఆసీనులు కాగా.. శ్రీయోద్వాహం అనంతరం అప్పటివరకు మండపంలోనే ఉన్న సీతమ్మ తూర్పు ముఖంగా బయల్దేరి కల్యాణ మండపంలో ప్రదక్షిణ చేసి శ్రీరాముడికి ఎదురుగా వెండి గజాసనంపైకి చేరుకున్నారు. ద్వాదశ దర్భలతో సీతమ్మకు యోక్త్రాబంధనం చేశారు. శ్రీరాముడు గృహస్థ ఆశ్రమంలోకి ప్రవేశిస్తున్నాడని తెలుపుతూ యజ్ఞోపవీత ధారణ చేశారు.

చింతాకు పతకం.. పచ్చల హారం ధరించి

రామదాసు చేయించిన చింతాకు పతకం సీతమ్మకు, పచ్చలహారం రామయ్యకు అలంకరించారు. లక్ష్మణుడికి రామమాడ ధరింపజేశారు. అభిజిత్ లగ్నం ముహూర్తం 11.59 గంటల సమయం కాగానే అర్చక స్వాములు వధూవరులైన సీతారాముల ఉత్సవమూర్తుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం పెట్టారు. తర్వాత శ్రీరామదాసు చేయించిన మూడు బొట్లు ఉన్న మంగళసూత్రానికి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.29 గంటలకు సీతమ్మకు మాంగల్యధారణ జరిగింది. తర్వాత వెండి పాత్రల్లో ఉంచిన ముత్యాల తలంబ్రాలను సీతారాములపై పోశారు. అనంతరం గోటితో ఒలిచిన తలంబ్రాలతో వేడుక నిర్వహించారు. తర్వాత వానర మాయురం (బంతులాట) వేడుక, గోదాదేవి–శ్రీరంగనాథుల లఘు కల్యాణం నిర్వహించారు. మంగళహారతి అనంతరం సీతారాములను పల్లకీలో ఊరేగిస్తూ ఆలయంలోకి తీసుకెళ్లారు. ఈ వేడుకకు చినజీయర్‌స్వామి హాజరై భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొన్నారు. శ్రీరామనవమి అనంతరం శుక్రవారం మిథిలా స్టేడియంలో పన్నెండేళ్లకు ఓసారి వచ్చే పుష్కర పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

శ్రీవారి ఆలయంలో ఘనంగా శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం శ్రీరామనవమి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 9 నుంచి 10 గంటల నడుమ ఆలయంలోని బంగారువాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థానం వేడుకగా జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి తోమాలసేవ, అర్చన ఏకాంతంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హనుమంతునిపై శ్రీవేంకటాద్రిరాముడు

గురువారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీరాముడు తన భక్తుడైన హనుమంతునిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హనుమంతవాహన సేవలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కాగా, తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది.



తిరుమంజనంలో సేద తీరుతున్న సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుల వారు

ద్రాక్షారామ భీమేశ్వరుని దర్శించుకున్న సుప్రీంకోర్టు జడ్జి



సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ రామ సుబ్రమణ్యంకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణ్యం కుటుంబసమేతంగా గురువారం రాత్రి దర్శించుకున్నారు. వారికి ఈవో పితాని తారకేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారికి జస్టిస్ రామసుబ్రమణ్యం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నంది మండపంలో వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందజేశారు. న్యాయమూర్తికి స్వామి వారి జ్ఞాపికను మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అందజేశారు.

శారదాపీఠంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



శ్రీసీతారాములకు హారతి ఇస్తున్న స్వరూపానందేంద్ర స్వామి

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠంలో శ్రీరామనవమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారాముల కల్యాణం కనులపండువగా సాగింది. పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర మహా సరస్వతి స్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులతో కలిసి కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. అనంతరం స్వరూపానందేంద్ర స్వామి సీతారాములకు విశేష పూజలు నిర్వహించారు. రాజోపచారాలు నిర్వహించి మహా మంగళ హారతులిచ్చారు. కల్యాణానంతరం భక్తులకు ప్రసాదం, పానకం అందజేశారు.

విశాఖ పోర్టు అథారిటీలో 8 మంది సస్పెన్షన్

సాక్షి, విశాఖపట్నం: ఓ ఉన్నతాధికారి ఆగ్రహం కారణంగా ఎనిమిది మంది సస్పెన్షన్‌కు గురయ్యారు. విశాఖపట్నం పోర్టు ట్రస్టులో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అసలేం జరిగిందంటే.. వారం క్రితం విశాఖ పోర్టు జనరల్ కార్గో బెర్త్ నుంచి వెనకవైపు వెళ్లే మార్గంలో తన కారులో పోర్టు ఉన్నతాధికారి వెళ్తున్నారు. పోర్టుకు సంబంధించిన రైలు ట్రాక్‌ను దాటించి డ్రైవర్ కారును ముందుకు తీసుకెళ్లిన 5 సెకన్లలో ఆ ట్రాక్‌మీదుగా ట్రైన్ దూసుకెళ్లింది. ఈ హఠాత్పరిణామానికి పోర్టు ఉన్నతాధికారికి కోపం వచ్చి.. ఇది తనపై దాడిగా భావించారు. కుట్ర కోణం అనుమానంతో ఆరా తీశారు. సీసీ కెమెరాలో అంతా సాధారణ పరిస్థితులే కనిపించాయి. అయినా కుట్ర జరిగిందనే భావించిన ఆయన.. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ట్రైన్ లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్, ఆ ప్రాంతంలో ఉన్న ఇంజనీరింగ్ సిబ్బంది, తన కారు డ్రైవర్ సహా మొత్తం 8 మందిపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ జంక్షన్ క్రాస్ చేసే ప్రతిసారీ తాము హారన్ వేస్తామని, ఆరోజు కూడా హారన్ మోగించామని లోకో పైలట్లు చెబుతున్నారు. అయినా చర్యలు తీసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వివరణ తీసుకునేందుకు కూడా ఉన్నతాధికారి సమయం ఇవ్వడంలేదని ఉద్యోగులు చెప్పారు. ఘటనపై అంతర్గత విచారణకు ఆదేశించాలని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అవేమీ చేయకుండా ఇలా విధుల నుంచి సస్పెండ్ చేయడం సరికాదంటూ పోర్టు ఉద్యోగ, కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి.

ఒంటిమిట్టలో మార్మోగిన రామనామ స్మరణ

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, పెన్నా సిమెంట్స్ అధినేత వేణుగోపాల్‌రెడ్డి తదితరులు స్వామిని దర్శించుకుని గర్భాలయంలోని మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామనవమి కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, అన్నప్రసాదం, క్యూలైన్ల వంటి ఏర్పాట్లు టీటీడీ చేసింది.

శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఏకశిలానగరి (ఒంటిమిట్ట)లో శ్రీ కోదండ రామస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం శ్రీరామ నవమి సందర్భంగా ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. శుక్రవారం ధ్వజారోహణ చేయనున్నారు.

పేదలకు స్థలాలివ్వడంపై కోర్టులకెక్కడం దుర్మార్గం

914వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: అమరావతి రాజధాని ప్రాంతంలోని ఆర్–5 జోన్‌లో 54వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు ప్రభుత్వం ముందుకెళుతుంటే చంద్రబాబు అండ్ కో ఆధ్వర్యంలోని కులవాదులు కోర్టులకెక్కి అడ్డుకోవాలని చూడటం దుర్మార్గమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు గురువారం 914వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బహుజనులకు అన్యాయం జరిగితే స్పందించని ప్రతిపక్షాలు, తమ స్వార్థం కోసం అమరావతిని గుప్పెట్లో పెట్టుకోవాలనే తాపత్రయంతో పేదలను ఈ ప్రాంతం నుంచి తరిమికొట్టడమే లక్ష్యంగా కులవాద ఉద్యమం చేస్తుండడం విడ్డూరమన్నారు. 29 కేసుల్లో అరెస్టు కాకుండా స్టేలు తెచ్చుకుని వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న చంద్రబాబు, మార్గదర్శి వ్యవహారంలో చట్టాలను ఉల్లంఘించి దోపిడీ చేసిన రామోజీరావును అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం ఎల్లో మీడియాలో అసత్యాలకు తెరలేపిన బాబు, ఆయనకు వత్తాసు పలుకుతున్న ప్రతిపక్ష పార్టీల మాటలు ప్రజలు ఎప్పటికీ నమ్మరన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బిడ్డల చెంతకు చేరిన తల్లి

- మతిస్థిమితం కోల్పోయి రాష్ట్రాలు దాటి వచ్చిన మహిళ
- అక్కున చేర్చుకుని అయిన వారికి అప్పగించిన 'దిశ'



ప్రియాంక షైనీని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న దిశ వన్‌స్టాప్ సిబ్బంది

కాకినాడ క్రైం: ప్రాణప్రదంగా చూసుకునే ఇద్దరు బిడ్డల్నీ వదిలేసి రోడ్డు పాలైన ఓ తల్లి తిరిగి వారి చెంతకు చేరింది. భర్త వదిలేశాడనే వేదన తాళలేక మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళను దిశ వన్ స్టాప్ సెంటర్ అక్కున చేర్చుకుంది. రాష్ట్రాలు దాటి వచ్చి అనాథలా రోడ్లు పట్టిన ఆ తల్లిని తిరిగి బిడ్డల చెంతకు చేర్చింది. వివరాలివీ.. సుమా రు నెల రోజులక్రితం ఓ రోజు అర్ధరాత్రి కాకినాడ జిల్లా కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా కూ ర్చున్న ఓ అనాథ మహిళ వెంట ఇద్దరు వ్యక్తులు పడ్డారు. వారినుంచి తప్పించుకున్న ఆమె సహా యం కోసం రైల్వే సిబ్బంది క్యాబిన్ తలుపులు కొట్టింది. సిబ్బంది బయటకు రావడంతో ఆ దుండగులిద్దరూ పరారయ్యారు. రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఏవీకే సంతోష్ ఆ మహిళ దుస్థితిని గమనించి, మతిస్థిమితం కోల్పోయిందని నిర్ధారించారు. ఆమె పరిస్థితిని జిల్లా మహిళా, శిశు సాధికార అధికారి ప్రవీణకు వివరించి సహాయం కోరారు. తక్షణమే స్పందించిన ఆమె దిశ వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ కె.శైలజకు తగిన ఆదేశాలిచ్చారు. శైలజ బాధిత మహిళను కాకినాడ జీజీహెచ్‌లోని దిశ వన్ స్టాప్ సెంటర్‌కు తరలించారు. నెల రోజులపాటు సపర్యలు చేసి ఆమె వివరాలు రాబట్టారు. ఆమె పేరు ప్రియాంక షైనీ అని, ఊరు గోరఖ్‌పూర్ అని గుర్తించారు. దీంతో ఆమె ఫొటో సర్క్యులేట్ చేసి.. ఆ మహిళ కుటుంబ సభ్యుల కోసం తీవ్రంగా ప్రయత్నించారు. 2021 నవంబర్ 2వ తేదీన ఆ మహిళ అదృశ్యమైనట్టు గోరఖ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని నిర్ధారణ కాగా.. అక్కడి పోలీసుల ద్వారా ప్రియాంక షైనీ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వీడియో కాల్‌లో ఆమెను చూసి నిర్ధారించుకున్నారు. హుటాహుటిన కాకినాడ వచ్చారు. దిశ వన్‌స్టాప్ బృందం ఏఎస్‌ఐ చంద్ర, కౌన్సిలర్ జమీమా, ఐటీ స్టాఫ్ దుర్గాదేవి సమక్షంలో ప్రియాంకను అధికారులు గురువారం ఆమె సోదరికి అప్పగించారు. ఈ సందర్భంగా ప్రియాంక సోదరి మాట్లాడుతూ.. తన అక్కకు 12, 10 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారని, ఏడాది కాలంగా అమ్మ ఏదని వారు అడుగుతుంటే ఊరెళ్లిందని, త్వరలోనే వచ్చేస్తుంద ని అబద్ధం చెబుతూ కాలం గడిపామని భావోద్వేగానికి గురైంది. తన సోదరిని రక్షించిన కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్, రైల్వే పోలీస్ సిబ్బంది, అక్కున చేర్చుకు న్న దిశ వన్‌స్టాప్ బృందానికి ధన్యవాదాలు తెలిపింది.

విద్యుత్ తీగలు తగిలి వేటగాడు మృతి

- ఆరుగురు వేటగాళ్ల అరెస్ట్



జి.సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటో)

ఐరాల(చిత్తూరు జిల్లా): వన్యప్రాణులను వేటాడేందుకు వెళ్లి ఓ వేటగాడు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన ఘటన గురువారం వెలుగుచూసింది. మరో ఆరుగురు వేటగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. ఐరాల మండలంలోని బెస్తపల్లెకు చెందిన జి.సుబ్రహ్మణ్యం (51), అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్, నందయ్య, వడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప, సుబ్రహ్మణ్యం, చిన్నబ్బ, వీరభద్రలతో కలసి మంగళవారం రాత్రి తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేట కోసం వెళ్లారు. వన్యప్రాణులను చంపేందుకు అటవీ ప్రాంతం మీదుగా గ్రామాలకు వెళ్లే విద్యుత్ తీగలకు వీరు అక్రమంగా వైర్లు తగిలించారు. అనంతరం దూరంగా వెళ్లి కూర్చున్నారు. ఈ క్రమంలో వారు అమర్చిన విద్యుత్ తీగల వద్ద నుంచి పెద్ద శబ్దం రావడంతో.. పరిశీలించడానికి సుబ్రహ్మణ్యం వెళ్లాడు. వారు అమర్చిన విద్యుత్ తీగ కిందకు వేలాడుతూ అతనికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంత సమయానికి అతను తిరిగి రాకపోవడంతో సహచర వేటగాళ్లు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే సుబ్రహ్మణ్యం మృతిచెంది ఉండడం గమనించారు. భయంతో ఘటనాస్థలంలో ఆనవాలు లేకుండా చెరిపివేశారు. అక్కడి నుంచి మృతదేహాన్ని సుమారు రెండు కిలోమీటర్లు మోసుకెళ్లి తోకబండ అటవీ ప్రాంతంలోని పొదల్లో పడేశారు. ఆ ఆరుగురు తిరిగి తమ ఇళ్లకు వెళ్లిపోయారు. బుధవారం సుబ్రహ్మణ్యం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఎలాంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఇంటికి వచ్చేశారు. గురువారం మరోసారి తోకబండ అటవీ ప్రాంతంలో గాలిస్తుండగా, ఓ చోట దుర్వాసన వచ్చింది. అక్కడ సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే ఆయన కుమారుడు వెంకటేష్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ ఆశీర్వాదం, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని విచారించి సహచర వేటగాళ్లు ఆరుగురిని అరెస్టు చేశారు.

రోల్ మోడల్

పాఠశాలలో పిల్లల సంఖ్య పెంపే లక్ష్యం

21 ఏళ్లలో 241 మంది చేరికకు కృషి • ఆదర్శంగా మక్కే మాస్టారు సేవలు

తాను ఏ పాఠశాలలో పనిచేస్తే అక్కడ విద్యార్థుల సంఖ్య (రోల్) పెంచడమే కాక ఉత్తమ విద్యను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మక్కే వేణుగోపాలరావు మాస్టారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేస్తుండటం, విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపరచడం వంటి అంశాలే కాక విద్య ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరిస్తూ వారి పిల్లలను బడులకు పంపేలా అవగాహన కల్పిస్తున్నారు. తన 21 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఇప్పటివరకు 241 మంది విద్యార్థులను ఇలా పాఠశాలల్లో చేర్పించారు. పిల్లలందరినీ మనబడిలో చేర్చుదాం – ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం' అనే నినాదంతో ఆయన కృషి చేస్తున్నారు.



విద్యార్థులలో ఒకడిగా కూర్చొని పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు మక్కే వేణుగోపాలరావు

నూజివీడు: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ సిబ్బందిని ఇంటింటికి పంపించి పిల్లలు ఎక్కడున్నా గాలించి తమ పాఠశాలల్లో చేర్చుకుంటున్న ఈ రోజుల్లో తాను పనిచేసే పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే కాకుండా పేద విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు మక్కే వేణుగోపాలరావు మాస్టారు. 2002 డీఎస్సీలో ఎంపికై ఆగిరిపల్లి మండలంలోని ఎం.సూరవరంలోని ఎంపీయూపీ స్కూల్‌లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా వేణుగోపాలరావు చేరారు. గ్రామంలోని యూపీ స్కూల్.. హైస్కూల్ కావాలని సురవరం చుట్టుపక్కల గ్రామాలైన కొమ్మూరు, కృష్ణవరం సగ్గురు, బండారుగూడెం ప్రాంత ప్రజల చిరకాల స్వప్నంగా మారింది. ఈ నేపథ్యంలో ఆనాటి, ప్రస్తుత ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చొరవతో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. 2005 సంవత్సరంలో 6, 7, 8 తరగతులతో ప్రారంభమైన ఈ పాఠశాలకు ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న కె.ఆనంద్‌బాబు, మక్కే వేణుగోపాల్‌రావులను నియమించారు. అదే గ్రామంలో నివాసం ఉంటున్న మక్కే వేణుగోపాలరావు చుట్టుపక్కల గ్రామాల్లో తిరిగి 70 మంది విద్యార్థులను ఈ పాఠశాలలో చేర్పించారు. 2007–2008 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 18 మంది విద్యార్థులకు గాను 17 మంది ఉత్తీర్ణులయ్యారు. 2008–2009 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థిని పి.ఝాన్సి 542 మార్కులు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. గంప సతీష్ అనే విద్యార్థి 526 మార్కులు సాధించడంతో విజయవాడ పాలిటెక్నిక్ కాలేజీలో ఉచిత సీటు లభించింది. అనంతరం జరిగిన బదిలీల్లో 2009 ఆగస్టులో సర్నాలగూడెం ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలకు వచ్చారు. అయితే ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకంలో ఏజెన్సీ లేకపోవడంతో విద్యార్థులకు భోజనం అందకపోవడాన్ని వేణుగోపాలరావు గమనించారు. దీంతో అదే రోజు తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటుచేసి మండల విద్యాశాఖ అధికారి అనుమతితో ఏజెన్సీని నియమించారు. అప్పుడు ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 12 మందే. కాగా, మూడేళ్ల పాటు ఏకోపాధ్యాయునిగా పనిచేస్తూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 25కు పెంచారు. దీంతో ఈ పాఠశాలకు మరొక ఉపాధ్యాయ పోస్టును ప్రభుత్వం మంజూరు చేసింది. ఇక్కడ పనిచేస్తున్న కాలంలోనే ఎంపీపీఎస్ తోటపల్లి స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీగా ఎనిమిదేళ్ల వ్యవహరించి విద్యావ్యాప్తికి కృషి చేశారు. 2017 ఆగస్టులో ఎంపీపీఎస్ ఈదర మెయిన్ పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఆ సమయంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 27 మాత్రమే. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తూ గురుకుల పాఠశాలలో సీట్లు, నవోదయ సీట్లు సాధించడం వలన మూడేళ్లలోనే పాఠశాల రోల్ 137కి చేరింది. దీంతో 2020 సంవత్సరంలో జరిగిన బదిలీలల్లో ఈ పాఠశాలకు అదనంగా ఒక ఎల్‌ఎఫ్‌ఎల్, రెండు ఎస్జీటీ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయగా మొత్తం ఉపాధ్యాయుల సంఖ్య ఐదుకు చేరింది. మండలం మొత్తం మీద ఐదుగురు ఉపాధ్యాయులున్న ఏకైక ప్రాథమిక పాఠశాల ఇదే కావడం విశేషం. 2022 జూలైలో ఈ పాఠశాలలోని 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో కలపగా, అదే మండలంలోని సింహాద్రి అప్పారావుపేటలో నూతనంగా ప్రారంభించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు డిప్యుటేషన్‌పై వచ్చారు. అక్కడ కూడా ఈ విద్యా సంవత్సరంలో 48 మంది విద్యార్థులను చేర్చారు. దీంతో ఈ పాఠశాలకు ఒక ఎల్‌ఎఫ్‌ఎల్, రెండు ఎస్జీజీ పోస్టులు మంజూరయ్యాయి.

వృత్తే దైవంగా..

విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడం ఒక్క ఉపాధ్యాయుడికే సాధ్యం. అలాంటి వృత్తిని దైవంగా భావిస్తున్నాను. పేద, నిరుపేద పిల్లలు చదువు లేక వారి జీవితాలు వెనుకపడకూడదనే లక్ష్యంతో ఆయా వర్గాల పిల్లల్లో వెలుగులు నింపినప్పుడే ఈ వృత్తికి న్యాయం చేసిన వారమవుతాం. నమ్మకంతో తల్లిదండ్రులను చైతన్యపరిచి వారి పిల్లలను పాఠశాలల్లో చేర్చేవాడిని. ప్రస్తుత ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంతో గత 75 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలలను అభివృద్ధి చేసింది. అలాగే పాఠ్యపుస్తకాల్లోని కంటెంట్ కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా ఉండి ఉపాధ్యాయులు సరిగ్గా పాఠాలు చెబితే ప్రైవేటు పాఠశాలలు ఎందులోనూ పోటీపడలేవు. పాఠాలు నేర్పడంలో ఉండే సంతృప్తి ఉపాధ్యాయుడికి ఎందులోనూ దొరకదు.

– మక్కే వేణుగోపాలరావు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ఆగిరిపల్లి మండలం

ఇంటింటికీ తిరిగి.. చైతన్యం నింపి

- ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయుడు మక్కే వేణుగోపాలరావు కృషి చేశారు.
- పాఠశాల ఆవాస ప్రాంతంలోని పేద, నిరుపేదల ఇళ్లకు తిరిగి తల్లిదండ్రుల్లో చైతన్యం నింపి ప్రభుత్వ పాఠశాలలో వారి పిల్లలను చేర్చేవారు.
- తాను పనిచేసే పాఠశాల ఆవాస ప్రాంతంలోని 5–10 ఏళ్ల లోపు వయస్సు పిల్లల వివరాలను సేకరించి, వారిలో చదువు మధ్యలో మానేసిన వారిని, పేద, నిరుపేద వర్గాల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేవారు
- 2002 నుంచి 2012 వరకు తాను పనిచేసే గ్రామంలోనే నివాసం ఉంటూ పిల్లల తల్లిదండ్రులకు అందుబాటులో ఉండేవారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు చెప్పేవారు
- ఏడో తరగతి చదివి మానివేసిన వారితో పదో తరగతిని ప్రైవేటుగా చదివించి, దూరవిద్య ద్వారా డిగ్రీలు చదివించేవారు. వారికి ప్రత్యేకంగా ట్యూషన్లు చెప్పేవారు
- విద్యార్థులను మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, వ్యవసాయశాఖ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు తీసుకెళ్లి విధులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించేవారు
- ప్రతి ఏటా పాఠశాల విద్యార్థులను తన సొంత ఖర్చులతో విజయవాడలో నిర్వహించే బుక్ ఫెస్టివల్‌కు తీసుకెళ్లేవారు.
- తరగతి గదిలో విద్యార్థులలో ఒకడిగా కూర్చుని పాఠాలు బోధిస్తారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్, గణితంలో నైపుణ్యాలను పెంచేవారు
- మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందించి ప్రోత్సాహించేవారు
- దాతల సహకారంతో విద్యార్థులకు ప్రముఖుల జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలను అందజేసేవారు.
- 2022 సెప్టెంబర్ ఐదో తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏలూరులో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు.

క్లుప్తంగా

ఫెర్రీలో మంటలు.. 31 మంది మృతి

మనీలా: ఫిలిప్పీన్స్‌లో గురువారం ఫెర్రీలో అగ్ని ప్రమాదం సంభవించి 31 మంది చనిపోగా మరో ఏడుగురు గల్లంతయ్యారు. ఎంవీ లేడీ మేరీ జాయ్–3 అనే ఫెర్రీ సుమారు 250 మంది ప్రయాణికులతో బుధవారం సాయంత్రం తీర ప్రాంత నగరం జంబొయాంగా నుంచి సులు ప్రావిన్స్‌లోని జోలో పట్టణం వైపు బయలు దేరింది. మార్గమధ్యంలో అర్ధరాత్రి సమయంలో బసిలాన్ ప్రావిన్స్‌కు సమీపంలో మంటలు చెలరేగాయి. కొందరు మంటల్లో సజీవదహనం కాగా మరికొందరు భయాందోళనలతో నీళ్లలో దూకారు. మొత్తం 31 మృతదేహాలను సహాయ సిబ్బంది గుర్తించారు. మరో ఏడుగురి జాడ తెలియాల్సి ఉంది. గాయపడిన 23 మందిని ఆస్పత్రులకు తరలించారు. ఫెర్రీని బసిలాన్ తీరానికి తీసుకువచ్చారు. గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు చెప్పారు. దీవుల సముదాయం ఫిలిప్పీన్స్‌లో ఇటువంటి ఘటనలు సర్వసాధారణం.

అసెంబ్లీలో అశ్లీల వీక్షణం

త్రిపురలో బీజేపీ ఎమ్మెల్యే నిర్వాకం



అగర్తలా: త్రిపుర శాసనసభలో అధికార బీజేపీ ఎమ్మెల్యే జాదవ్ లాల్‌నాథ్ తన మొబైల్ ఫోన్‌లో అశ్లీల వీడియోలు తిలకిస్తూ దొరికిపోయాడు. అసెంబ్లీ ప్రతిష్టను మంటగలిపిన జాదవ్ లాల్‌నాథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. త్రిపుర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బుధవారం ఆయన సభలో పోర్న్ వీడియోలు చూస్తున్నట్లుగా వీడియో క్లిప్ ఒకటి బయటకు వచ్చింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జాదవ్ లాల్‌నాథ్ గత ఎన్నికల్లో ఉత్తర త్రిపుర జిల్లాలోని బాగ్‌బస్సా నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించారు. తనపై వచ్చిన ఆరోపణలపై స్పందించారు. సభలో ఉండగా తన ఫోన్‌కు కాల్ వచ్చిందని, వెంటనే ఫోన్ తెరపై అశ్లీల వీడియోలు ప్రత్యక్షమయ్యాయని అన్నారు. వెంటనే వాటిని క్లోజ్ చేశానని తెలిపారు. అసెంబ్లీలో ఫోన్ వాడొద్దన్న సంగతి తనకు తెలుసని చెప్పారు. పవిత్రమైన అసెంబ్లీలో పోర్న్ వీడియోలు చూడడం సిగ్గుచేటని, బీజేపీ ఎమ్మెల్యే జాదవ్ లాల్‌నాథ్‌పై కఠిన చర్యలు చేపట్టాలని త్రిపుర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిరాజిత్ సిన్హా డిమాండ్ చేశారు. 2012లో కర్ణాటక అసెంబ్లీలో ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు ఫోన్‌లో అశ్లీల దృశ్యాలు చూస్తూ దొరికిపోయిన సంగతి తెలిసిందే.

ఖర్గే ఇంట గెలిచేనా!



- కాంగ్రెస్ అధ్యక్షుడికి అగ్నిపరీక్షగా మారిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు
- పార్టీని ఏకతాటిపై నడపడంలో సమర్థత చాటుకున్న వైనం
- రాహుల్‌పై అనర్హత వేటుకు నిరసనగా విపక్షాలను కలుపుకొని వెళ్లడంలోనూ విజయం

ఎస్.రాజమహేంద్రారెడ్డి

మల్లికార్జున ఖర్గే.. ది గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్ కొత్త బాస్. గాంధీల ఇంటి పార్టీలాంటి కాంగ్రెస్‌కు గాంధీయేతరులు అధ్యక్షుడు కావడం విశేషం. ఆ పదవికి ఎంపిక కావడమే ఆయన సమర్థతకు నిదర్శనం. అంతగా పట్టులేని ఈశాన్య రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖర్గే తన ప్రభావాన్ని అంతగా చూపెట్టలేకపోయినప్పటికీ పార్టీని ఏకతాటిపై నడపడంలో తన సమర్థతను చాటాడనే చెప్పుకోవాలి. రాహుల్ గాంధీపై అనర్హత వేటు సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ముక్త కంఠంతో నిరసన గళాన్ని వినిపించడంలోనూ ఖర్గే తన నాయకత్వ గరిమను రుజువు చేసుకున్నారు. అనర్హత వేటుకు నిరసనగా విపక్షాలన్నింటినీ ఒకే వేదికపై మోహరించడంలోనూ విజయం సాధించారు. పార్లమెంట్‌లో అదానీ వ్యవహారంపైనా, పార్లమెంట్ బయట అనర్హత వేటు పైనా సామూహిక నిరసనలకు కాంగ్రెస్ పార్టీ ఖర్గే సారథ్యంలోనే నాయకత్వ బాధ్యతను భుజాని కెత్తుకుంది. ఈ నేపథ్యంలోనే కర్ణాటక అసెంబ్లీ పోరుకు నగారా మోగింది. వచ్చే ఏడాది జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు ఖర్గేకు ఇది అసలు సిసలైన పరీక్ష. ఒకరకంగా అగ్నిపరీక్ష. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా తన సొంత రాష్ట్రమైన కర్ణాటకలో పార్టీని మళ్లీ గద్దెనెక్కించడం ఇప్పుడు ఆయన ముందున్న ప్రధాన, ఏకైక లక్ష్యం. ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు. ఇంటి పోరులో గెలుస్తారో లేదో మే 13న(కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే రోజు) తేలనుంది. ఖర్గే హీరోనో లేక జీరోనో అదే రోజు కర్ణాటకతోపాటు దేశానికీ తెలుస్తుంది.

ఇప్పటికే తొలి విజయం

నిజానికి చాలా రోజుల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పోరుకు పూర్తి సన్నద్ధతతో బరిలోకి దిగడం ఇదే మొదటిసారి. ఎన్నికల సంఘం కర్ణాటక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి ఓ వారం రోజుల ముందే కాంగ్రెస్ 124 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. నిత్యం అంతర్గత పోరుతో తలమునకలై ఉండే కాంగ్రెస్ పార్టీకి ఇది శుభ పరిణామం. తొలి జాబితాను ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా సామరస్యపూర్వక వాతావరణంలో ప్రకటించడం కచ్చితంగా ఖర్గే వ్యవహార శైలికి అద్దం పడుతుంది. మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మధ్య ఉన్న చిరకాల భేదాభిప్రాయాలు ఈ ఎన్నికల్లో కర్ణాటక కాంగ్రెస్‌కు పెద్ద తలనొప్పిగా మారడం ఖాయమనుకున్నారు. ఎన్నికల వేళ పార్టీ వ్యవహారాలను చక్కదిద్దడంలో నిష్ణాతుడిగా పేరుగాంచిన ఖర్గే, ఏఐసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటినుంచే వీరిద్దరి సంఘర్షణపై ఓ కన్నేసి ఉంచారు. సరిగ్గా షెడ్యూల్ ప్రకటించే సమయానికి ఇద్దరి మధ్య రాజీ కుదిర్చి తొలి విజయాన్ని నమోదు చేసుకున్నారు. మే 10న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయభేరీ మోగిస్తే ఆ క్రెడిట్ అంతా ఆయనదే అవుతుంది.

జేడీ(ఎస్)తో పొత్తుకు విముఖత

ఒకే గొడుగు కింద వైరి వర్గాల ఘర్షణ ఏ స్థాయిలో ఉంటుందో ఖర్గేకు అనుభవపూర్వకంగా తెలుసు. తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఖర్గే ఒక్కసారి కూడా కర్ణాటక ముఖ్యమంత్రి కాలేకపోయారు. అవకాశాలు రాక కాదు, అవకాశాలు తలుపుతట్టినా అంతర్గత పోరును తట్టుకొని నిలబడలేకపోయారు. ఒక్కసారి కాదు, ఏకంగా మూడుసార్లు ఆయన నుంచి ముఖ్యమంత్రి పదవి తృటిలో చేజారిపోయింది. 1999లో ఎస్.ఎం.కృష్ణ, 2004లో ఎన్.ధరమ్ సింగ్, 2013లో సిద్ధరామయ్య నుంచి ఎదురైన గట్టి పోటీని ఎదుర్కోలేకపోయారు. 2004లో మిశ్రమ ఫలితం వచ్చినప్పటికీ సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహించే అవకాశం వచ్చింది. దాదాపు ఖాయమైపోయిందనుకున్న తరుణంలో జేడీ(ఎస్) అధినేత దేవెగౌడ అభ్యంతరం చెప్పడంతో తన సహచరుడైన మరో సీనియర్ నాయకుడు ధరమ్‌సింగ్ ముఖ్యమంత్రి కావడానికి సహకరించారు. ఈ అనుభవం వల్లే జేడీ(ఎస్)తో ఎన్నికల పొత్తుకు ఖర్గే విముఖంగా ఉన్నారు. ఎన్నికల తర్వాత సంకీర్ణం తప్పని పరిస్థితి ఎదురైనా జేడీ(ఎస్)తో దోస్తీ కలలోని మాట అని ఖర్గే ఈపాటికే సుస్పష్టంగా చెప్పేశారు. ఈ మేరకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని సైతం ఒప్పించినట్లు వినికిడి.

మది దోచిన సర్వేలు

కింగ్ అయ్యే అవకాశం మూడుసార్లు చేజారిన ఖర్గే ఈసారి కింగ్‌మేకర్ కావాలన్న కృత నిశ్చయంతో ఉన్నారు. ఇంటి గెలిచి చూపించి, రచ్చ గెలుపు మీద ఇనుమడించిన ఉత్సాహంతో దృష్టి సారించాలని ఆశిస్తున్నారు. ఇటీవలి కొన్ని సర్వేల ఫలితాలు ఖర్గే మనసు దోచాయి. ఇండియాటుడే నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ద నేషన్' సర్వేలో కర్ణాటకలో జనవరిలో లోక్‌సభ ఎన్నికలు జరిగి ఉంటే 28 సీట్లకు కాంగ్రెస్ 17 సీట్లను దక్కించుకొనేది అని ఆ సర్వే సారాంశం. కర్ణాటక ఎన్నికల నగారా మోగిన రోజే ఏబీపీ–సీ ఓటర్ సర్వే కాంగ్రెస్‌కే విజయాన్ని కట్టబెట్టింది. ఆ పార్టీకి 115–127 సీట్లు వస్తాయంది. 224 అసెంబ్లీ స్థానాలున్న కర్ణాటక అసెంబ్లీలో 117 స్థానాలంటే సంకీర్ణం జోలికెళ్లకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చు. ఈ సర్వే ఖర్గే మనసు దోచి ఉంటుంది. ఇక కర్ణాటక ప్రజల మనసులు దోచడానికి ఖర్గే వ్యూహాలు సిద్ధం చేసుకోవాలి.

కోతల వేళ శుభవార్త

- హెచ్–1బీ వీసా హోల్డర్ల జీవిత భాగస్వాములు అమెరికాలో ఉద్యోగం చేసుకోవచ్చు
- అమెరికా జడ్జి తీర్పు



వాషింగ్టన్: ఆర్థిక సంక్షోభ భయాలతో అమెరికాలో టెక్ కంపెనీలు హెచ్–1బీ వీసాదారులను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్న తరుణంలో వారి జీవిత భాగస్వామి అమెరికాలో ఉద్యోగం చేసుకోవచ్చని అమెరికా న్యాయమూర్తి ఒకరు తీర్పు చెప్పారు. దీంతో అమెరికాలో టెక్నాలజీ రంగంలో ఉద్యోగాలు పోయి ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కొంటున్న వేలాది మంది భారతీయ టెకీలకు పెద్ద ఊరట లభించినట్లయింది. అమెరికాలో ప్రత్యేక ఉపాధి, నైపుణ్య వృత్తుల్లోకి తీసుకునేందుకు అక్కడి కంపెనీలు నాన్ ఇమిగ్రెంట్ హెచ్–1బీ వీసాలతో భారత్‌వంటి దేశాలకు చెందిన విదేశీ నిపుణులకు కొలువులు కల్పిస్తున్న విషయం విదితమే. అయితే ఇలా ఏటా వేలాదిగా తరలివస్తున్న హెచ్–1బీ వీసాదారులు, వారి భాగస్వాముల కారణంగా స్థానిక అమెరికన్లు ఉద్యోగాలు సాధించలేకపోతున్నారని సేవ్ జాబ్స్ యూఎస్‌ఏ అనే సంస్థ వాషింగ్టన్‌లోని జిల్లా కోర్టులో దావా వేసింది. హెచ్–1బీ వీసాదారుల జీవితభాగస్వాములూ జాబ్ కార్డ్ సాధించి ఉద్యోగాలు చేసేందుకు వీలు కల్పిస్తున్న ఒబామా కాలంనాటి నిబంధనలను కొట్టేయాలని సంస్థ కోరింది. ఈ దావాను అమెజాన్, ఆపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి బడా కంపెనీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇప్పటికే అమెరికా ప్రభుత్వం హెచ్–1బీ వీసాదారుల దాదాపు లక్ష మంది జీవితభాగస్వాములకు పని చేసుకునేందుకు అనుమతులు ఇచ్చింది. ఈ కేసును మార్చి 28వ తేదీన జిల్లా మహిళా జడ్జి తాన్య చుత్కాన్ విచారించారు. 'అమెరికా ప్రభుత్వం పూర్తి బాధ్యతతోనే వారికి వర్క్ పర్మిట్ ఇచ్చింది. వీరితోపాటే వేర్వేరు కేటగిరీల వారికీ తగు అనుమతులు ఇచ్చింది. విద్య కోసం వచ్చే వారికి, వారి జీవిత భాగస్వామికి, వారిపై ఆధారపడిన వారికి హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఉపాధి అనుమతులు కల్పించింది. విదేశీ ప్రభుత్వాధికారులు, అంతర్జాతీయ సంస్థల అధికారులు, ఉద్యోగుల జీవితభాగస్వాములకూ అనుమతులు ఉన్నాయి' అంటూ సేవ్ జాబ్స్ యూఎస్‌ఏ పిటిషన్‌ను జడ్జి కొట్టేశారు. అయితే తీర్పును ఎగువ కోర్టులో సవాల్ చేస్తామని సంస్థ తెలిపింది.

అభినందనీయం

'ఉద్యోగాలు పోయి కష్టాల్లో ఉన్న హెచ్–1బీ హోల్డర్ల కుటుంబాలకు ఈ తీర్పు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. వలసదారుల హక్కుల సమానత్వ వ్యవస్థ సాధనకు ఇది ముందడుగు' అని వలసదారుల హక్కులపై పోరాడే భారతీయ మూలాలున్న అమెరికా న్యాయవాది అజయ్ భుటోరియా వ్యాఖ్యానించారు. గత ఏడాది నవంబర్ నుంచి చూస్తే గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, అమెజాన్‌సహా అమెరికాలోని చాలా ఐటీ కంపెనీలు దాదాపు 2,00,000 మంది ఉద్యోగులను తొలగించాయని 'ది వాషింగ్టన్ పోస్ట్' తన కథనంలో పేర్కొనడం తెల్సిందే. ఇలా ఉద్యోగాలు పోయిన వారిలో 30–40 శాతం మంది భారతీయ ఐటీ నిపుణులే కావడం విషాదం.

'దహీ'పై వెనక్కి తగ్గిన ఎఫ్ఎస్ఎస్ఏఐ

కర్డ్‌తోపాటు ప్రాంతీయ భాషను వాడుకోవచ్చంటూ మళ్లీ ఉత్తర్వులు



చెన్నై/బెంగళూరు: పెరుగు ప్యాకెట్లపై ఇంగ్లిష్ 'కర్డ్'కు బదులుగా హిందీలోని 'దహీ' ముద్రించాలన్న ఆదేశాలు వివాదాస్పదం కావడంతో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) వెనక్కి తగ్గింది. కర్డ్‌ను కొనసాగిస్తూనే పక్కనే సమానార్థం .. తెలుగులో అయితే పెరుగు, కన్నడలో మొసరు, తమిళమైతే తాయిర్ అని ప్రాంతీయ భాషను ముద్రించవచ్చని స్పష్టతనిస్తూ గురువారం సవరణ ఉత్తర్వులు జారీ చేసింది. పెరుగు ప్యాకెట్లపై కర్డ్‌కు బదులుగా హిందీ సమానార్థం 'దహీ'ని ముద్రించాలంటూ ఈ నెల 10వ తేదీన ఎఫ్ఎస్ఎస్ఏఐ రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. తమిళనాడు కో ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ 'ఆవిన్' బ్రాండ్‌తో, కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) నంది బ్రాండ్‌తో పెరుగును విక్రయిస్తున్నాయి. ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలపై తమిళనాడు సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలపై హిందీని బలవంతంగా రుద్దేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎప్పటిలాగానే తమిళ 'తాయిర్'నే వాడుతామని, 'దహీ' అని మాత్రం వాడబోమంటూ రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఎస్ఎస్ఏఐకి సమాధానమిచ్చింది. అధికార డీఎంకే పార్టీ 'నహీ టు దహీ' అంటూ ఆన్‌లైన్ ఉద్యమాన్ని ప్రారంభించింది. 'దహీ' వివాదంపై తమిళనాడు బీజేపీ విభాగం అభ్యంతరం తెలిపింది. కర్ణాటక ప్రభుత్వ అధీనంలోని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) నందిని బ్రాండ్‌తో తీసుకువస్తున్న పెరుగు ప్యాకెట్లపై హిందీ దహీ పక్కన బ్రాకెట్లలో కన్నడ (మొసరు) ముద్రించాలంటూ ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇచ్చిన మార్గదర్శకాలపై రాష్ట్ర మాజీ సీఎం కుమారస్వామి మండిపడ్డారు. ఈ చర్య కన్నడిగుల ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టడమేనన్నారు. దీంతో ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజాగా సవరణ ఉత్తర్వులిచ్చింది.

పాకిస్తాన్‌లో హిందూ డాక్టర్ కాల్చివేత

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని కరాచీ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, ప్రముఖ కంటి వైద్యుడు, హిందూ మతస్తుడైన డాక్టర్ బీర్బల్ జినానీని దుండగులు గురువారం తుపాకీతో కాల్చి చంపారు. కరాచీ సమీపంలోని ల్యారీ ఎక్స్‌ప్రెస్ రహదారిపై కారులో వెళ్తుండగా దుండుగులు ఘాతుకానికి పాల్పడ్డారు. పాకిస్తాన్‌లో హిందువులే లక్ష్యంగా దాడులు పెరిగిపోతున్నాయి. మార్చి నెలలో ఇది రెండో హత్య కావడం గమనార్హం. ఇటీవలే పాకిస్తాన్‌లోని హైదరాబాద్ పట్టణంలో హిందూ మతానికి చెందిన ధరమ్‌దేవ్ రాఠీ అనే వైద్యుడిని ముష్కరులు పొట్టనపెట్టుకున్నారు.

ఆర్మీ హెలికాప్టర్లు ఢీకొని..9 మంది మృతి

ఫోర్ట్‌కాంప్‌బెల్(అమెరికా): కెంటకీలో అమెరికా ఆర్మీకి చెందిన రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లు ఢీకొన్న ఘటనలో 9 మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఫోర్ట్ కాంప్‌బెల్‌కు 30 మైళ్లదూరంలో బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. 101 ఎయిర్‌బోర్న్ డివిజన్‌కు చెందిన హెచ్‌హెచ్–60 బ్లాక్ హాక్ హెలికాప్టర్లు రెండూ రాత్రి వేళ జరుగుతున్న రోజువారీ శిక్షణ సమయంలో ప్రమాదానికి గురికావడంపై దర్యాప్తు జరుగుతోందని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో కొంత అటవి, కొంతమైదానం ఉన్నాయని కెంటకీ గవర్నర్ ఆండీ చెప్పారు.



పార్లమెంట్ లోపల పనులను పర్యవేక్షిస్తున్న ప్రధాని మోదీ

పార్లమెంట్ నూతన భవనాన్ని సందర్శించిన ప్రధాని

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి మోదీ గురువారం సాయంత్రం పార్లమెంట్ నూతన భవనాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రధాని మోదీ అక్కడ వివిధ విభాగాలు కొనసాగుతున్న పలు పనులను తనిఖీ చేశారు. నిర్మాణంలో పాల్గొంటున్న సిబ్బందితో మాట్లాడారు. పార్లమెంట్‌లోని ఉభయసభల్లో కల్పించే వివిధ సదుపాయాలను ఆయన పరిశీలించారు. అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న పార్లమెంట్ భవనానికి ప్రధాని మోదీ 2020 డిసెంబర్‌లో శంకుస్థాపన చేశారు. గత నవంబర్‌కే ఇది పూర్తి కావాల్సి ఉండగా వివిధ కారణాలతో ఆలస్యమైంది. దీనిని మరికొద్ది రోజుల్లో ప్రారంభించే అవకాశాలున్నాయి.

ఇండోర్ ఆలయంలో విషాదం

బావి పైకప్పు కూలి 14 మంది భక్తులు మృతి

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో పండుగపూట విషాద ఘటన చోటుచేసుకుంది. బావి పైకప్పు కూలి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పటేల్‌నగర్‌లోని బేలేశ్వర్ మహాదేవ్ ఝులేలాల్ ఆలయంలో పూజా కార్యక్రమాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొందరు భక్తులు బావిపై కట్టిన స్లాబ్‌పై నిలబడి ఉండగా అది హఠాత్తుగా కూలింది. సుమారు 35 మంది బావిలో పడిపోయారు. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు సాయంత్రం వరకు 19 మందిని కాపాడగలిగారు. మరో 14 మంది చనిపోయినట్లు కలెక్టర్ ఇళయ రాజా చెప్పారు. వీరిలో 10 మంది మహిళలేనన్నారు. విశాలమైన పురాతన బావిపై స్లాబ్ వేసి, దానిపై ఆలయం నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. ఎక్కువ సంఖ్యలో జనం చేరడంతో అది కూలిందన్నారు. ఆలయంలో ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున అందజేస్తామని సీఎం ప్రకటించారు. బావిలోని నీటిని పూర్తిగా తోడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నట్లు ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో, అక్కడి పరిస్థితిని సీఎం చౌహాన్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



బావి వద్ద సహాయక చర్యలు చేపట్టిన దృశ్యం

సిద్దరామయ్యపై యడ్డీ కుమారుడు పోటీ?



బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ దిగ్గజ నాయకుడు సిద్దరామయ్య మే 10న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడనున్న వరుణ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున బి.ఎస్. యడియూరప్ప కుమారుడు బరిలో దిగుతారని ప్రచారం జరుగుతోంది. తన కుమారుడు బి.వై. విజయేంద్ర వరుణ నియోజకవర్గం నుంచి పోటీ పడే అవకాశాలను కొట్టి పారేయలేమని యడియూరప్ప చెప్పడంతో రాజకీయంగా ఈ స్థానంపై ఆసక్తి పెరిగింది. మైసూరు జిల్లాలో ముఖ్య నియోజకవర్గాల్లో ఒకటైన వరుణకి ప్రస్తుతం సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో వరుణ నుంచి సిద్దరామయ్య పోటీ చేస్తున్నట్టు కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించింది. సిద్దరామయ్యపై మీ కుమారుడు విజయేంద్ర పోటీ పడతారా అని గురువారం యడియూరప్పని విలేకరులు ప్రశ్నించగా ''దీనిపై చర్చలైతే సాగుతున్నాయి. వరుణలో నెగ్గడం సిద్దరామయ్యకు అంత సులభం కాదు. మేము మంచి అభ్యర్థినే నిలబెట్టి గట్టి పోటీ ఇస్తాం. చూద్దాం ఏమవుతుందో'' అని వ్యాఖ్యానించారు. దీనిపై సిద్దరామయ్య స్పందిస్తూ తనపై ఎవరు పోటీకి దిగినా పట్టించుకోనని అన్నారు. యడియూరప్ప పోటీకి దిగినా స్వాగతిస్తామని కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు డి.కె. శివకుమార్ పేర్కొనడం విశేషం.

అమృత్‌పాల్ కోసం డ్రోన్‌తో గాలింపు

హోషియార్‌పూర్: వివాదాస్పద సిక్కు మత బోధకుడు అమృత్‌పాల్ సింగ్ జాడ కోసం పంజాబ్ పోలీసులు వేట ముమ్మరం చేశారు. గురువారం డ్రోన్‌ను రంగంలోకి దించారు. హోషియార్‌పూర్ జిల్లాలోని మర్నాయిన్ గ్రామంలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో డ్రోన్‌తో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు రోజుల క్రితం ఇదే గ్రామంలో కొందరు అనుమానితులు తమ కారును వదిలేసి పారిపోయారు. వారిలో అమృత్‌పాల్ ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కాగా, తాను ఎక్కడికీ పారిపోలేదని, త్వరలోనే ప్రపంచం ఎదుటకు వస్తానని అమృత్‌పాల్ వెల్లడించాడు. ఈ మేరకు గురువారం మరో వీడియో తెరపైకి వచ్చింది. చావంటే తనకు భయం లేదని ఆ వీడియోలో వ్యాఖ్యానించాడు.

'రాహుల్' పరిణామాలను గమనిస్తున్నాం

న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దుపై అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య కొనసాగుతున్న రగడ ముదిరింది. 'రాహుల్‌కి వ్యతిరేకంగా కోర్టు తీర్పు, అనర్హత వేటు తదనంతర పరిణామాలను గమనిస్తున్నాం. లోక్‌సభ సభ్యత్వం రద్దు చేయడం సమంజసమేనా? అనేది పై కోర్టులో తేలుతుంది' అని జర్మనీ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఒకరు మీడియాతో అన్నారు. దీనికి కాంగ్రెస్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మన దేశ అంతర్గత వ్యవహారాల్లోకి విదేశీ శక్తులను కాంగ్రెస్ ఆహ్వానిస్తోందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ట్వీట్‌చేశారు. ఈ ట్వీట్‌పై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పందించారు. 'అసలైన వ్యవహారాన్ని ఎందుకు పక్కదారి పట్టిస్తున్నారు? అదానీపై రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలకు ప్రధాని సమాధానం ఇవ్వడంలేదు. ప్రజల దృష్టిని మళ్లించడం కాదు, మేము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పండి'' అని డిమాండ్ చేశారు.

మోదీపై ఆప్ దేశవ్యాప్త పోస్టర్ ప్రచారం

న్యూఢిల్లీ: ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఆప్ గురువారం నుంచి దేశవ్యాప్త ప్రచారం ప్రారంభించింది. మోదీ హటావో, దేశ్ బచావో అనే నినాదంతో ప్రాంతీయ భాషల్లో ముద్రించిన పోస్టర్లు, బ్యానర్లను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆప్ జాతీయ కన్వీనర్ గోపాల్ రాయ్ చెప్పారు. ప్రధాని మోదీ, బీజేపీ ఇచ్చిన అమలు కాని హామీల గురించి ప్రజలకు తెలియజెప్పడమే తమ ఉద్దేశమన్నారు. హామీలను నెరవేర్చకపోగా, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ మేరకు ఇప్పటికే పోస్టర్లు, బ్యానర్లను 22 రాష్ట్రాల్లో ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులకు కూడా అవగాహన కల్పించేందుకు ఏప్రిల్ 10వ తేదీ నుంచి అన్ని యూనివర్సిటీల్లోనూ ఇటువంటి పోస్టర్లు, బ్యానర్లనే ఏర్పాటు చేస్తామన్నారు.

గద్దె దించేందుకు ఢిల్లీకి పోదాం

- ఐక్యంగా ముందుకు సాగుదాం
- ధర్నా సందర్భంగా విపక్షాలకు మమత పిలుపు

కోల్‌కతా: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీని గద్దె దించేందుకు విపక్ష పార్టీలన్నీ ఢిల్లీ దిశగా కదంతొక్కాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోమారు పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం, గృహ, ప్రజాపనులు తదితర పథకాలకు రాష్ట్రానికి కేంద్ర నిధుల మంజూరులో పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని తీవ్రంగా నిర్లక్ష్యంచేస్తూ మోదీ సర్కార్ సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని మమత ఆగ్రహం వ్యక్తంచేశారు. నిధుల విడుదలలో కేంద్రం వివక్షను నిరసిస్తూ బుధవారం నుంచి కోల్‌కతాలోని రెడ్‌రోడ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మమత ధర్నా చేస్తున్న విషయం విదితమే. ఈ ధర్నాలో గురువారం మమత మాట్లాడారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని భారతపాలన నుంచి తొలగించేందుకు 80 ఏళ్ల క్రితం సింగపూర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'ఢిల్లీ చలో' పిలుపునివ్వడం తెల్సిందే. ఇదే తరహాలో.. 'నేడు మనం బీజేపీని అధికార పీఠం నుంచి పక్కకు నెట్టేసేందుకు ఐక్యంగా ఢిల్లీకి బయల్దేరదాం. ఔర్ ఏక్ బార్ ఢిల్లీ చలో' అంటూ విపక్ష పార్టీలకు మమత పిలుపునిచ్చారు. 'కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు, తప్పుడు కేసులు, బెదిరింపుల ద్వారానే బీజేపీ కేంద్రంలో పాలన సాగించగలుగుతోంది. అన్ని పార్టీలు అవినీతిమయమంటూ తనను మాత్రం సత్యరుషిలా అభివర్ణించుకుంటోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు బీజేపీకి, దేశ పౌరులకు మధ్య పోరు. ధరాభారం నుంచి పేదలను కాపాడాలంటే బీజేపీని అధికారం నుంచి పక్కనబెట్టాల్సిందే. బీజేపీ దుశ్శాసనుడు, దుర్యోధనుడిలా తయారైంది' అని మమత అన్నారు.

సోమవారం చెన్నైలో విపక్షాల భేటీ

న్యూఢిల్లీ: దేశంలో సామాజిక న్యాయం అమలు తీరుతెన్నులపై చర్చించడానికి కాంగ్రెస్‌తోపాటు 20 ప్రతిపక్ష పార్టీల నేతలు సోమవారం తమిళనాడు రాజధాని చెన్నైలో భేటీ కానున్నారు. డీఎంకే చీఫ్ స్టాలిన్ ఈ సమావేశం నిర్వహించనున్నారు. జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) చీఫ్ హేమంత్ సోరెన్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎస్పీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, బీఆర్ఎస్ నాయకుడు కె.కేశవరావు, సీపీఎం నేత సీతారాం ఏచూరి, సీపీఐ నాయకుడు డి.రాజా, ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్య నేత సంజయ్ సింగ్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి డెరెక్ ఓ బ్రియన్ తదితరులు పాల్గొంటారు. మరికొన్ని పార్టీల నుంచి ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇది రాజకీయ సమావేశం కాదని, సామాజిక అంశంపై చర్చించడానికి జరుగుతున్న భేటీ అని విపక్ష నేతలు వెల్లడించారు.

నిఘా ఆరోపణలతో వాల్‌స్ట్రీట్ జర్నల్ విలేకరి అరెస్ట్

అమెరికా ఆదేశాలతో పనిచేస్తున్నాడని రష్యా ఆరోపణ



మాస్కో: ఉక్రెయిన్ యుద్ధంతో బద్ధశత్రువులుగా తయారైన అమెరికా, రష్యాల సంబంధాలు మరింత క్షీణించే పరిణామం ఒకటి సంభవించింది. రష్యాలో విలేకరిగా విధులు నిర్వర్తిస్తున్న అమెరికాకు చెందిన అంతర్జాతీయ వార్తాపత్రిక 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్'కు చెందిన ఇవాన్ గెర్ష్‌కోవిచ్‌ను రష్యా నిఘా సంస్థ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్(ఎఫ్ఎస్‌బీ) అరెస్ట్‌చేసింది. రహస్య పత్రాలను సేకరించేందుకు ప్రయత్నించాడని అతనిపై అభియోగాలు మోపింది. 'అమెరికా ఆదేశాలతోనే నిషేధిత ప్రాంతంలోని తమ సైనిక పారిశ్రామికవాడలోని ఒక సంస్థకు చెందిన రహస్య పత్రాలను సేకరించడంలో ఇవాన్ బిజీగా ఉన్నాడు. అందుకే అరెస్ట్ చేశాం' అని ఎఫ్ఎస్‌బీ గురువారం ప్రకటించింది. వాల్‌స్ట్రీట్ జర్నల్ మాస్కో బ్యూరోలో కరస్పాండెంట్‌గా పనిచేసే ఇవాన్ ఉక్రెయిన్, రష్యా, ఇతర సోవియట్ యూనియన్ దేశాల్లో వార్తల కవరేజీ విధులు నిర్వర్తిస్తున్నాడు. రష్యా మోపిన నేరం రుజువు అయితే గరిష్టంగా 20 సంవత్సరాల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. తమ విలేకరి అరెస్ట్‌ను వార్తాసంస్థ తీవ్రంగా ఖండించింది. కోల్డ్ వార్ తర్వాత అమెరికా రిపోర్టర్‌ను రష్యా అరెస్ట్‌చేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇవాన్‌ను ఏ తేదీలో అరెస్ట్‌చేసిందీ ఎఫ్ఎస్‌బీ వెల్లడించలేదుగానీ ఉరాల్ పర్వతాల దగ్గర్లోని ఎకటిన్‌బర్గ్ నగరంలో అతడిని అరెస్ట్‌చేసినట్లు తెలుస్తోంది. ఖైదీల పరస్పర మార్పిడిలో భాగంగా జైళ్లలో ఉన్న రష్యా ఆయుధ మధ్యవర్తి విక్టర్ బౌట్‌ను, డబ్ల్యూఎన్‌బీఏ స్టార్ బ్రిట్నీ గ్రీనర్‌ను రష్యా, అమెరికాలు మార్చుకున్న విషయం విదితమే.



హౌరా నగరంలోని కాజీపారాలో వాహనాలు, వస్తువులకు నిప్పుపెట్టిన దృశ్యం

బెంగాల్, మహారాష్ట్రల్లో 'నవమి' ఉద్రిక్తతలు

- దుకాణాలు ధ్వంసం, వాహనాలకు నిప్పు
- పోలీసులకు గాయాలు

న్యూఢిల్లీ/హౌరా: రామనవమి ఉత్సవాల సందర్భంగా పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బెంగాల్‌లోని హౌరా నగరంలోని కాజీపారా ప్రాంతంలో గురువారం సాయంత్రం రామనవమి ర్యాలీ విషయమై రెండు వర్గాల మధ్య గొడవ మొదలైంది. రెచ్చిపోయిన దుండగులు వాహనాలకు నిప్పుపెట్టారు. పలు ఆటోలు, దుకాణాలను ధ్వంసం చేశారు. పోలీసులు లాఠీచార్జితో పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పలువురిని అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో కిరాద్‌పురా రామాలయం వద్ద రెండు వర్గాల మధ్య ఘర్షణను నివారించేందుకు పోలీసులు టియర్ గ్యాస్, ప్లాస్టిక్ బుల్లెట్‌లను ప్రయోగించడంతోపాటు కాల్పులు కూడా జరిపారు. సుమారు 500 మందితో కూడిన గుంపు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. పెట్రోల్ బాంబులు విసిరారు. ఈ సందర్భంగా 10 మంది పోలీసులు సహా 12 మంది గాయపడ్డారు. బుధవారం రాత్రి ఇదే ప్రాంతంలో సంఘ విద్రోహ శక్తులు 13 వాహనాలకు నిప్పుపెట్టాయి. రాజధాని ఢిల్లీలోని జహంగీర్‌పురిలో శ్రీరామ్‌భగవాన్ ప్రతిమ యాత్రకు పోలీసులు అనుమతివ్వలేదు. అయితే, కొందరు నిషేధాజ్ఞలు ధిక్కరిస్తూ యాత్ర నిర్వహించారు. గత ఏడాది ఇక్కడే హనుమాన్ జయంతి వేడుక రోజు పెద్ద ఎత్తున అల్లర్లు జరిగాయి. గుజరాత్‌లోని వడోదరాలో రెండు రామనవమి ర్యాలీలపై దుండగులు రాళ్లు రువ్వారు. అయితే, ఎవరూ గాయపడలేదని పోలీసులు చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 31 । మార్చి । 2023



మదిదోచే ఆర్ట్

బెంగళూరు జయనగరలోని ఆర్ట్ గ్యాలరీలో గురువారం ప్రారంభమైన చిత్రలేఖన ప్రదర్శన. ఆసక్తిగా తిలకిస్తున్న సందర్శకులు

న్యూస్‌రీల్

నృత్యం చేస్తూనే మృత్యుఒడికి

యశవంతపుర: కడబ తాలూకా దోళ్పాడి గ్రామం ఇడ్యడ్కలో దేవుని పాత్రలో నృత్యం చేస్తూనే కన్నుమూశాడో కళాకారుడు. ఎడమంగల గ్రామం కాంతు అజిల మూలంగిరికి చెందిన బాబు (55) దేవుని వేషంలో అనేక నృత్యాలను చేస్తూ పేరు పొందాడు. గురువారం తెల్లవారుజామున ఇడ్యడ్క గ్రామంలో నేమోత్సవం జరిగింది. దేవుని వేషంలో నృత్యం చేస్తున్న బాబు కుప్పకూలిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

బంజారాలకు నచ్చజెబుతాం: యడ్డి

శివాజీనగర: రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ పార్టీ లేనిపోని ఆరోపణలు చేస్తోందని, ఇది సరికాదని బీజేపీ నేత బీఎస్ యడియూరప్ప అన్నారు. బంజారా సామాజిక వర్గానికి నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గురువారం బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రిజర్వేషన్ విధానం వల్ల అన్ని సామాజిక వర్గాలకు న్యాయం లభించిందని అన్నారు. ఎవరికీ అన్యాయం జరగలేదన్నారు. ముస్లింలకు అన్యాయం జరగలేదు, వారిని ఆర్థికంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్‌లోకి చేర్చినట్లు తెలిపారు. ఎవరికి టికెట్ ఇవ్వాలి అనేది పార్టీ నాయకత్వం తీర్మానిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు శోభాకరంద్లాజె, భగవాన్ ఖూబా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకురాలి వేదన



సవితా బాయి

యశవంతపుర: దావణగెరె జిల్లా మాయకొండ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌ను కేఎస్ బసవరాజ్‌కు లభించింది. ఈ పరిణామంతో పార్టీ నాయకురాలు సవితా బాయి కంగుతిన్నారు. సవితా గురువారం దావణగెరెలో విలేకరులతో మాట్లాడుతూ విలపించారు. పార్టీ నాయకులే నన్ను మోసం చేశారు, నా ఫోటోను అశ్లీలంగా మార్ఫింగ్ చేసి కాంగ్రెస్ హైకమాండ్‌కు పంపారు. అందువల్లే నాకు టికెట్ దొరకలేదు అని వాపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి బసవరాజ్ కారణమని ఆమె దావణగెరె సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రాచీన శిలలు లభ్యం




దొడ్డబళ్లాపురం: తవ్వకాలో పురాతన శిలలు బయటపడ్డ సంఘటన దొడ్డ పట్టణంలో చోటుచేసుకుంది. తేరు వీధిలోని విశ్వేశ్వరయ్య క్రీడామైదానంలో అభివృద్ధి పనుల కోసం తవ్వుతుండగా పలు పురాతన రాతి శిలలు వెలుగు చూసాయి. అయితే ఇవి ఏ కాలం నాటివి అనేది నిర్ధారణ కావాలి. కోలారు జిల్లాలో అధికంగా ఉండే వీరగల్లు తరహాలో ఈ శిలలు ఉన్నాయి. రాతి ఫలకం మీద వీరుల బొమ్మలు చెక్కి ఉన్నాయి.

యువ ఓటర్ల కోసం కాంగ్రెస్ అభియాన

శివాజీనగర: ఈ విధానసభ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేసే 18- 23 ఏళ్ల మధ్యనున్న యువ ఓటర్ల కోసం కాంగ్రెస్ పార్టీ అభియానను ఆరంభించింది. అన్ని పాఠశాల, కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, సామాజికంగా జాగృతి కార్యక్రమాలను చేపడుతారు. గురువారం బెంగళూరులో పార్టీ ఆఫీసులో ఏఐసీసీ నేత అభిషేక్ దత్ మాట్లాడుతూ నిరుద్యోగ పట్టభద్రులకు నెలకు రూ.3 వేలు, డిప్లొమా చేసినవారికి రూ.1500 భృతి ఇస్తామని హామీ ఇచ్చామన్నారు. దీనిపై కూడా యువ ఓటర్లలో జాగృతి కల్పిస్తామన్నారు.

భారీగా అక్రమ మద్యం సీజ్




పట్టుబడ్డ మద్యం, స్పిరిట్ ట్యాంకర్

దొడ్డబళ్లాపురం: బెళగావి నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న మద్యం, 30 వేల లీటర్ల స్పిరిట్‌ను అబ్కారీ పోలీసులు నెలమంగల వద్ద సీజ్ చేసారు. నెలమంగల సమీపంలోని బెంగళూరు-తుమకూరు హైవేలో జాస్ టోల్ వద్ద ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అబ్కారి అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఒక ట్యాంకర్‌లో తరలిస్తున్న రూ.54 లక్షల విలువైన మద్యం, 30 వేల లీటర్ల స్పిరిట్ పట్టుబడింది.

అభ్యర్థుల జాబితాపై తర్జనభర్జన

- అధికార బీజేపీలో కసరత్తు
- అప్పుడే తొలి జాబితా విడుదల చేసిన విపక్షాలు
- మునుముందు వలసల జోరు?





ఆచితూచి అడుగేస్తున్న కాషాయ నేతలు

సాక్షి, బెంగళూరు: విధానసభ ఎన్నికల ఢంకా మోగడంతో అభ్యర్థుల ఎంపికపై రాజకీయ పార్టీలన్నీ దృష్టి పెట్టాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, జేడీఎస్‌లు ఒక అడుగు ముందుకు వేసి తొలి విడతగా అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అధికార బీజేపీ మాత్రం అభ్యర్థుల ఎంపికపై వేచి చూస్తోంది. హైకమాండ్ స్థాయిలో సమీక్షలు జరిగినప్పటికీ అభ్యర్థుల ఎంపిక ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదు. బుధవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో బీజేపీ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించింది. ప్రస్తుత ఎమ్మెల్యేల్లో కొందరికి టికెట్లు దక్కకపోవచ్చనే అంచనాలతో వారిలో భయం పట్టుకుంది. టికెట్ దక్కదనే అనుమానం ఉన్న నేతలు పార్టీ హైకమాండ్, రాష్ట్ర నాయకత్వం వద్ద లాబీయింగ్ చేస్తున్నారు.

గుజరాత్ నమూనాపై బీజేపీ చూపు

బీజేపీ తమ అభ్యర్థుల ఎంపికలో గుజరాత్ మోడల్‌ని అనుసరిస్తోంది. ఈ క్రమంలో కొందరు సిట్టింగ్‌లకు మొండిచేయి చూపే అవకాశాలు ఉన్నాయి. కొత్త ముఖాలను బరిలో నిలుపుతారనే వార్తలు ఊపందుకున్నాయి. గెలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్న వారికే టికెట్ అనే నినాదం వినిపిస్తోంది. కాషాయనేతలు ఇటీవలే జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. రాష్ట్ర నేతల భేటీలో ఆమోదించి కేంద్ర ఎన్నికల కమిటీ ఆమోదం కోసం పంపించనున్నారు. ఇందుకు మరో నాలుగైదు రోజులు పట్టే అవకాశం ఉంది. ఢిల్లీలో మార్పులు చేర్పుల తరువాత అభ్యర్థుల జాబితా విడుదల కానుంది. ఏప్రిల్ 10లోగా అభ్యర్థులెవరో వెల్లడవుతుందని సమాచారం.

రెండో జాబితా కూర్పులో కాంగ్రెస్, జేడీఎస్

ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఇప్పటికే 124 మందితో కూడిన తొలి జాబితా విడుదల చేసింది. గురువారం కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ సమితి సమావేశమై రెండో జాబితాపై కసరత్తు చేశారు. తుది జాబితాను సిద్ధం చేసి హైకమాండ్ ఆమోదం కోసం పంపించనున్నారు. ఏప్రిల్ 10న జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది.

కాంగ్రెస్ కంటే ముందస్తుగానే జేడీఎస్ తొలి విడతలో 93 మందితో కూడిన జాబితాను విడుదల చేసింది. తదుపరి అభ్యర్థుల జాబితాపై ముఖ్య నేతలు ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపారు. రెండు, మూడు రోజుల్లో జేడీఎస్ పార్టీ నుంచి రెండో జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే అన్ని పార్టీల్లో టికెట్లు రాని నాయకులు, సిట్టింగ్‌లు పార్టీలు మారే అవకాశాలున్నాయి.



శాకంబరీదేవిగా దర్శనం



బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి బనశంకరీ దేవీ శాకంబరీదేవీ అలంకరణలో దర్శనమిచ్చింది. శ్రీరామనవమి సందర్భంగా గురువారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం అర్చకులు సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్‌లు అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చనలు చేశారు. వివిధ పండ్లు, కూరగాయలతో అలంకరించారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన గావించారు.

కాంగ్రెస్- బీజేపీ కుమ్మక్కు: కుమారస్వామి

సాక్షి, బెంగళూరు: నన్ను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీతో లోపాయకారి ఒప్పందాలు చేసుకుందని జేడీఎస్ మాజీ సీఎం కుమారస్వామి ఆరోపించారు. గురువారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు మంత్రి కె.నారాయణగౌడకు సీటు ఆఫర్ చేశారన్నారు. నేను హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులతో ఒప్పందం చేసుకున్నానని బిజెపి నాయకులు ఆరోపించారు, దీనికి రుజువులు ఉన్నాయా అని ప్రశ్నించారు. గతంలో సిద్దరామయ్య వరుణలో ఒంటరిగా పోటీచేసి కేవలం 200 ఓట్ల మెజారిటీతో గెలిచారన్నారు. ఓటర్లు రెండు జాతీయ పార్టీలకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

ఎమ్మెల్యే గౌరిశంకర్ ఎన్నిక చెల్లదు

- ఎన్నికల అక్రమాల కేసులో హైకోర్టు సంచలన తీర్పు



తుమకూరు రూరల్ ఎమ్మెల్యే గౌరిశంకర్

శివాజీనగర: తుమకూరు జిల్లా గ్రామీణ నియోజకవర్గ జేడీఎస్ ఎమ్మెల్యే డీసీ గౌరిశంకర్ ఎన్నిక చెల్లదని హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. న్యాయమూర్తి జస్టిస్ సునీల్‌దత్ యాదవ్ ఉన్న ఏకసభ్య ధర్మాసనం గురువారం తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్యే తరఫు న్యాయవాది స్టే ఇవ్వాలని విన్నవించగా, 30 రోజుల పాటు స్టే జారీ చేసింది. 30 రోజుల్లో సుప్రీంలో పరిష్కారం కాకపోతే ఆయనపై అనర్హత వేటు తప్పదు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి ఎన్నికైనవారు అనర్హతకు గురైతే ప్రజా ప్రతినిధుల చట్టం కింద ఆరు సంవత్సరాల పాటు ఏ ఎన్నికల్లో పోటీ చేయకూడదు.

ఏమిటీ కేసు

గత 2018 విధానసభ ఎన్నికల్లో తుమకూరు రూరల్ నుంచి గౌరిశంకర్ జేడీఎస్ అభ్యర్థిగా, సురేశ్‌గౌడ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో గౌరిశంకర్ సుమారు 5,500 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. అయితే అనేక రకాల అక్రమాలకు పాల్పడి గెలుపొందారని, కాబట్టి ఆయన ఎన్నికను రద్దు చేయాలని ప్రత్యర్థి సురేశ్‌గౌడ హైకోర్టులో కేసు వేశారు. ఈ పిటిషన్‌పై సుదీర్ఘంగా జరిగిన వాదోపవాదాల తరువాత జస్టిస్ ఎస్.సునీల్‌దత్ యాదవ్ తీర్పును రిజర్వులో ఉంచి, గురువారం తీర్పు వెలువరించారు. అక్రమాలు రుజువైనందున గౌరి శంకర్ ఎన్నిక చెల్లదని ప్రకటించారు. కాగా, ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం చెప్పారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల ముందు ఇటువంటి తీర్పు రావడం జేడీఎస్‌కు మింగుడుపడడం లేదు.

జైలుశిక్ష కేసులో ఎమ్మెల్యేకు అరెస్టు వారంట్

యశవంతపుర: చిక్కమగళూరు జిల్లా మూడిగెరె బీజేపీ ఎమ్మెల్యే ఎంపీ కుమారస్వామికి కష్టం ఎదురైంది. బెంగళూరులోని ప్రజాప్రతినిధుల కోర్టు నాన్‌బెయిలబుల్ అరెస్టు వారంట్‌ను జారీ చేసింది. దీంతో ఆయనను అరెస్ట్ భయం వెంటాడుతోంది. చిక్కమగళూరు జిల్లా ఎస్పీ ఉమాప్రశాంత్‌కు ఈ వారంట్‌ను పంపి ఆయనను అరెస్ట్ చేసి తమ ముందు ఉంచాలని కోర్టు ఆదేశించింది. ఎమ్మెల్యే చెక్కు బౌన్స్ కేసులో ఇరుక్కున్నారు. ఆయన ఒక వ్యక్తికి 8 చెక్కులను ఇచ్చి రూ. 1.38 కోట్ల రుణాన్ని తీసుకున్నారు. డబ్బులు తిరిగి చెల్లించని కారణంగా రుణదాత కేసు వేయగా, విచారణ జరిగింది. ఫిబ్రవరి 13న కుమారస్వామికి ఆరునెలల జైలు శిక్షను బెంగళూరు ప్రజాప్రతినిధుల విధించింది. ఆ కేసులో హాజరు పరచాలని ఆదేశించింది.

తుక్కు వాహనాలతో దందా





నగరంలో సంచరిస్తున్న వాహనాలు



- కాలం చెల్లిన వాహనాలకు అక్రమ రిజిస్ట్రేషన్లు
- ఎడాపెడా రోడ్లపై సంచారం

బనశంకరి: పాత కార్లకు మరమ్మతులు చేసి కొత్త హంగులతో షికార్లకు వెళ్లే అమెరికా కల్చర్ ఐటీ సిటీలో నూ పెరిగింది. పాతకలంనాటి జీపులు, జిప్సీలకు లక్షలాది రూపాయలు వెచ్చించి కొత్త వాహనం మాదిరిగా తయారు చేయించుకోవడం కొందరికి హాబీ. ఈ క్రేజ్ నేపథ్యంలో కాలం చెల్లిన మిలిటరీ వాహనాలను భారీ ధరలకు విక్రయించే ముఠాలు ఊపందుకున్నాయి. బహిరంగ వేలంలో తక్కువకు కొనుగోలుచేసిన పోలీస్, మిలిటరీ వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయించి అమ్ముతున్నట్లు వెలుగులోకి వచ్చింది. నిజానికి ఇవి తుక్కుగా మార్చాల్సిన వాహనాలు.

5 ఏళ్లు కాదు.. 15 ఏళ్లు

మోటారు వాహనచట్టం ప్రకారం వేలంలో కొనుగోలుచేసిన ఏ వాహనంకైనా రిజిస్ట్రేషన్ కాలపరిమితి గరిష్ఠంగా 5 ఏళ్లు మాత్రమే ఇవ్వాలి. కానీ ఆర్‌టీఓ ఆఫీసుల్లో ఇటువంటి వేలం వాహనాలకు ఏకంగా 15 ఏళ్ల వరకు రిజిస్ట్రేషన్ అవధి ఇస్తున్నట్లు తేలింది. బెంగళూరు నగరంతో పాటు రాష్ట్రంలోని కొన్ని ఆర్‌టీఓ కార్యాలయాల్లో ఈ దందా జరుగుతోందని రవాణా శాఖ ఉన్నతాధికారులే ప్రకటించడం గమనార్హం. వాహనం విక్రయించే ముఠాలు నకిలీ పత్రాలను సృష్టిస్తాయి, ఆపై ఆర్టీవో బ్రోకర్లు, అధికారులకు ముడుపులు ముట్టజెప్పి 15 ఏళ్ల పాటు కొనసాగేలా రిజిస్ట్రేషన్ చేయిస్తారు. వీటిని బడా బాబుల పిల్లలు, ధనవంతులు కొనుగోలు చేసి షికార్లకు వెళ్తారు. ఫోటోలు, వీడియోలతో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తూ దర్పాన్ని ప్రదర్శించడానికి ఈ వాహనాలను వాడుకుంటారు.

కేంద్ర నిబంధనలు బేఖాతరు

ఇటువంటి కండీషన్ లేని వాహనాలు రోడ్లపై తిరుగుతూ ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉంటాయనడంలో సందేహంలేదు. పైగా అధిక ఇంధనాన్ని తాగుతూ ఎంతో కాలుష్యాన్ని వెదజల్లుతాయి కూడా. ప్రస్తుతం వాయు కాలుష్య నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం 15 ఏళ్లు దాటిన వాహనాలను గుజరీకి పంపాలని ఆదేశించింది. ఈ రకంగా గుజరీకి వెళ్లాల్సిన మిలిటరీ జీపులు, జిప్సీలకు చట్టబద్ధంగా 15 ఏళ్ల రిజిస్ట్రేషన్ అవధి ఇవ్వడం పెద్ద నేరమే అవుతుందని రవాణా శాఖ నిపుణులు తెలిపారు.

33 ఏళ్లు తిరగొచ్చా?

ఒక కేసును పరిశీలిస్తే 2005లో తయారైన జిప్సి కింగ్ ఎంపిఐ ఎంజి413 డబ్ల్యూ మోడల్ జీప్‌ను (కేఎం2- ఎంటీ- 6646) 2023 మార్చి 8న రిజిస్ట్రేషన్ చేశారు. దీని వ్యాలిడిటి, ఫిట్‌నెస్ అవధి 2038 మార్చి 7 వరకు ఉందని ఆర్‌సీ కార్డులో నమోదు చేశారు. మామూలుగా 15 ఏళ్ల వరకు వినియోగించవచ్చు. కానీ 2005లో తయారైన వాహనం 2038 వరకు అంటే.. ఏకంగా 33 ఏళ్ల పాటు రోడ్లపై తిరగడానికి సై అన్నారు.

పనిచేసే ఇంట్లో నేపాలీ ముఠా దోపిడీ

బనశంకరి: డాక్టరు భార్యను బంధించి రూ.13.75 లక్షల విలువచేసే 250 గ్రాములు బంగారు ఆభరణాలను నేపాలీ ముఠా దోచుకుంది. ఈ ఘటన గోవిందరాజపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వీరణ్ణపాళ్యలో పశు వైద్యుడు డాక్టర్ షాహిద్ ఉంటున్నాడు. వారం క్రితం నేపాల్ కు చెందిన దీపక్, అంజనీ దంపతులు పని మనుషులుగా చేరారు. షాహిద్, అతని ఇద్దరు కుమారులు పని మీద బయటకు వెళ్లగా భార్య ఒక్కటే ఇంట్లో ఉంది. నేపాలీ దంపతులు ఫోన్ చేసి మరో ఇద్దరిని రహస్యంగా పిలిపించారు. యజమానురాలిని ఒక గదిలో బంధించి, ఇల్లు మొత్తం గాలించి 250 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. గోవిందపుర పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు.

పని మనుషులపై నిఘాపెట్టండి

ఇంట్లో పనులకు నియమించుకునేవారి పూర్వాపరాలను తెలుసుకుని పనిలోకి తీసుకోవాలని పోలీసులు సూచించారు. తక్కువ జీతాలకే వస్తారని ఎవరిని పడితే వారిని పనిలోకి తీసుకుంటే ఇటువంటి ఘటనలు జరుగుతాయి కాబట్టి జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

మా పోరాటం ఫలించింది

బనశంకరి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యంతో సీఎం బసవరాజబొమ్మై నిర్ణయంతో పంచమసాలి సముదాయ పోరాటం ఫలించింది. గ్రామాల్లో విజయోత్సవాలను ఆచరిస్తామని కూడల సంగమ పంచమసాలి పీఠాధిపతి జయబసవ మృత్యుంజయ స్వామి చెప్పారు. వీరశైవ లింగాయత సముదాయం రిజర్వేషన్‌ను 2ఏ కు చేర్చి 7 శాతం కల్పించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. సీఎంని కలిసి సన్మానించారు. ఇక ఓబీసీ కోసం పోరాడుతామన్నారు.



మైసూరులో కూలిన చెట్టు

పిడుగులతో కూడిన వర్షసూచన

బనశంకరి: రాష్ట్రంలోని పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశముంది. రానున్న 24 గంటల్లో బెంగళూరుతో పాటు అనేక జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షం కురవవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. బెంగళూరు నగర, గ్రామాంతర, మైసూరు, మండ్య, చామరాజనగర, రామనగర, తుమకూరు, కొడగు జిల్లాలకు వర్షసూచన ఉంది. మరోవైపు మైసూరులో బుధవారం సాయంత్రం గాలి, ఉరుములతో కూడిన వర్షం కుదిపేసింది. పలుప్రాంతాల్లో చెట్లు కూలి వాహనాలు ధ్వంసమయ్యాయి.



మైసూరులో విరిగిపడిన చెట్లు



శ్రీరామనవమి సందర్భంగా గురువారం బెంగళూరు సుభాష్ నగరలో రాముని విగ్రహం ఊరేగింపు

జయ రామా జగదభిరామా

బనశంకరి: పితృవాక్య పరిపాలకుడు, ధర్మ పరిరక్షకునిగా ఇలపై శ్రీరాముడు అవతరించిన రోజును శ్రీరామనవమిగా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం బెంగళూరు రాజాజీనగర రామ మందిర వద్ద గల శ్రీరామ దేవస్థానం, మైసూరు రోడ్డు గాలి ఆంజనేయ మందిరం, జయనగర పట్టాభిరామ ఆలయం, విజయనగర మారుతి మందిర, మైసూరు బ్యాంక్ సర్కిల్, యలహంక గేట్ ఆంజనేయ ఆలయాలు, మహాలక్ష్మీ లేఔట్ శ్రీ ప్రసన్న వీరాంజనేయస్వామి మందిరాలలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాల వద్ద భక్తులకు పానకం, మజ్జిగ, పెసరు బేడలను పంపిణీచేశారు. నగరంలో శ్రీరామ భక్త మండలి ఆధ్వర్యంలో నవమి ఉత్సవాలను ఆచరించారు. శ్రీరాముడు, హనుమంతుడు వేషధారణతో కళాకారులు సందడి చేశారు. రాష్ట్ర మంతటా ఆంజనేయ, శ్రీరామ ఆలయాల్లో ఆనందోత్సాహాలతో సంబరాలు జరిగాయి. కలబుర్గిలో బృహత్ శోభాయాత్ర నిర్వహించారు.



కలబుర్గిలో హిందూ సంఘాల శోభాయాత్ర



కలబుర్గిలో శోభాయాత్రలో పానకం పంచుతున్న ముస్లింలు



బెళగావిలో ఊరేగింపు

నీల మేఘ శ్యామా కోదండరామా


సిరుగుప్ప: ప్యాటె ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాములకు అలంకరణ


బళ్లారి అర్బన్: కోట ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివార్లకు అలంకరణ


కాకర్లతోటలో సీతారాముల రథోత్సవం


శ్రీ బాలాంజనేయ స్వామికి అలంకరణ

- ఆలయాల్లో నేత్రపర్వంగా సీతారాముల కళ్యాణోత్సవాలు, ప్రత్యేకపూజలు
- వైభవంగా శ్రీరామ నవమి


కనక దుర్గమ్మ ఆలయం వద్ద శ్రీరామ దేవాలయంలో ప్రత్యేక పూజలు

సాక్షి,బళ్లారి: శ్రీరామ నవమి వేడుకలు బళ్లారి, కొప్పళ, రాయచూరు, విజయనగర జిల్లాల్లో గురువారం ఘనంగా జరిగాయి. శ్రీరామ నామస్మరణతో కోదండ రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు మార్మోగాయి. పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. బళ్లారి నగరంలోని శ్రీరామ దేవాలయాలు, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాల్లో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. శ్రీరాంపుర కాలనీ, మోతీ సర్కిల్, శ్రీకనక దుర్గమ్మ, హవంబావి తదితర ప్రాంతాల్లో శ్రీరామ, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అన్నదానాలు నిర్వహించారు. 8వ వార్డు పరిధిలో ఆంధ్రాళ్‌లోని శ్రీరామ దేవాలయంలో సామాజిక కార్యకర్త వెంకటరెడ్డి, కార్పొరేటర్ రామాంజినేయుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించడంతో పాటు అన్నదానం చేశారు. అనంతరం రథోత్సవాన్ని నిర్వహిచారు.

కంప్లి: శ్రీ రామనవమి సందర్భంగా అమృత శిలా రామచంద్ర ఆలయంలో 118వ శ్రీ రామనవమి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం, సాయంత్రం విద్వాన్ శ్రీపాద జాలిహాళ్ ఆధ్వర్యంలో శ్రీరామాయణ ప్రవచనాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరిపారు. భక్తుల సమక్షంలో పల్లకి ఉత్సవం నిర్వహించారు.

రాయచూరురూరల్: జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రాయచూరు గ్రామీణ నియోజకవర్గంలో పంచముఖి గాణ దాల్ ఆంజనేయ స్వామి ప్రాణ దేవర ఆలయంలో ఎమ్మెల్యే బసనగౌడ, మాజీ ఎమ్మెల్యే తిప్పరాజ్ పూజలు చేశారు. రైల్వే స్టేషన్ సమీపంలో రామాలయం, కోటలోని బాలాంజనేయ స్వామి, పాతాళాంజనేయ, బెట్టద్ రామాలయం, మంగళవార పేటలో మారుతి దేవాలయంలో శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆర్యవైశ్య గీతా మందిర్‌లో ఆర్యవైశ్య సమాజం ఆధ్వర్యంలో పూజలు రథోత్సవం నిర్వహించారు.

హొసపేటె: శ్రీరామనవమి పండుగ సందర్భంగా గురువారం నగరంలోని రాణిపేట కాలనీ, టీబీ డ్యాం ఈవీవీ క్యాంపులో శ్రీరామ ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించి సీతారామ కళ్యాణం నిర్వహించారు. ప్రజలు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

బళ్లారిఅర్బన్: బాలాంజనేయస్వామి ఆలయంలో బాలనంద స్వామి ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. శ్రీ అభయ వరదాంజనేయ స్వామి ఆలయంలో అధ్యక్షుడు ధనుంజయ నేతృత్వంలో నాగరాజ్ ఆచారి కళ్యాణోత్సవం నిర్వహించారు. శ్రీ కోట ఆంజనేయ స్వామి, కాకర్లతోట ఆంజనేయ స్వామి, మిల్లర్‌పేట్ ఆంజనేయ స్వామి, రెడ్డి వీధి ఆంజనేయ స్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు నేత్రపర్వంగా సాగాయి.

సిరుగుప్ప: నగరంలో అభయాంజనేయ ఆలయం ఎదురుగా వీహెచ్‌పీ, భజరంగదళ్ ఆధ్వర్యంలో శ్రీరామచంద్ర భావ చిత్రపటానికి పూజలు జరిపి ప్రసాదాలు పంపిణీ చేశారు. బి.కె.ఎస్.చన్నబసవ, ఆనంద హెగ్డె పాల్గొన్నారు.

గంగావతి: వడ్డరహట్టి, బసపట్న, గంగావతి నగరంలోని శ్రీ సీతారామ ఆలయాల్లో, ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేషంగా నిర్వహించారు. వడ్డరహట్టి గ్రామంలోని శ్రీ సీతారామ ఆలయంలో ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి పూజలు చేశారు.

గంగావతి రూరల్: బాపిరెడ్డి క్యాంపులోని శ్రీరామ ఆలయంలో సీతారాముల కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది.


హొసపేటె: సీతారాములకు విశేష పూజలు


రాయచూరు రూరల్: రథోత్సవం


హొసపేటె: అన్నదానం


పూజల్లో పాల్గొన్న గంగావతి ఎమ్మెల్యే పరణ్ణ


ఆంధ్రాళులో తేరు ఉత్సవం


కంప్లిలో రథోత్సవం


బళ్లారి: బాలాంజనేయ స్వామి ఆలయంలో

క్లుప్తంగా

శ్రీరామనవమి సంబరాలు


ఓ ఆలయంలో విశేష పూజలు

విజయపుర: శ్రీరామనవమి పండుగ సందర్భంగా పట్టణంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని శ్రీరామ దేవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. రోడ్లపై అక్కడక్కడ భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. గురువారం ఉదయం నుంచే ఆలయాలకు వచ్చిన వందలాది మంది భక్తులు శ్రీరామ, ఆంజనేయ జపంలో మునిగిపోయారు.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

- ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ అరెస్ట్

రాయచూరు రూరల్: విద్యార్థినులను లైంగికంగా వేధించిన ప్రిన్సిపాల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రాయచూరు తాలుకా శక్తి నగర్‌లో ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిలకు మంచి మార్కులు వేసి పీయూసీలో చేర్పుతామని ఆశపెట్టిన విజయ కుమార్ అనే ప్రిన్సిపాల్ ఈ నెల 16న విద్యార్థినులను తన గదికి పిలిపించి లైంగికంగా సహకరించాలని ఒత్తిడి చేశాడు. బాధిత విద్యార్థినులు తమ తల్లిదండ్రుల వద్ద గోడు వెల్లబోసుకున్నారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం కళాశాలకు వెళ్లిన పోలీసులు విచారణ చేపట్టి ప్రిన్సిపాల్‌ను అరెస్ట్ చేశారు.

నాసిరకం టైల్స్ వేశారని ఆందోళన


ఆందోళన చేస్తున్న దళిత నేతలు

రాయచూరురూరల్ : నగరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నాసిరకం టైల్స్ అమర్చారని ఆరోపిస్తూ దళిత సేన జిల్లాధ్యక్షుడు విశ్వనాథ్ పట్టి గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. నాసిరకం పనులకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రౌడీలపై బహిష్కరణ వేటు

మైసూరు: విధానసభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో మైసూరు నగర పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రౌడీషీటర్లపై చర్యలు తీసుకుంటున్నారు. మైసూరు నగరానికి చెందిన ఐదుగురు రౌడీలను నగర బహిష్కరణ చేశారు. సుమారు నాలుగైదు నెలల పాటు బహిష్కరణ అమలులో ఉంటుంది. ఈ ఐదుగురు పదేపదే నేరాలకు పాల్పడి సమాజంలో భయానక పరిస్థితులను కల్పించిన వారని పోలీసులు తెలిపారు.

కాపురానికి రాలేదని భార్యపై హత్యాయత్నం

హొసపేటె: కాపురానికి రాలేదని కక్ష పెంచుకున్న భర్త భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఉదంతం హగరిబొమ్మనహళ్లిలో చోటు చేసుకుంది. వివరాలు.. హొసపేటెకు చెందిన రమేష్‌తో హగరి బొమ్మనహళ్లికి తాలూకా భోవి కాలనీకి చెందిన యువతితో వివాహమైంది. రమేష్ మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోలేదు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. ఎన్ని రోజులు ఎదురుచూసినా భార్య రాలేదు. దీంతో రమేష్ తన భార్య ఇంటికి వెళ్లాడు. తనతో రావాలని కోరగా ఆమె ససేమిరా అంది. దీంతో వెంట తెచ్చుకున్న మచ్చుతో ఆమెపై దాడికి యత్నించగా అక్కడున్నవారు అడ్డుకున్నారు. హగరిబొమ్మనహళ్లి పోలీసులు రమేష్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి

రాయచూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి నీర మాన్వి వద్ద చోటు చేసుకుంది. నీరమాన్వికి చెందిన రాఘవేంద్రకు ఏడాది క్రితం సువర్ణ (24) అనే మహిళతో వివాహమైంది. ప్రస్తుతం ఆమె గర్భిణి. బుధవారం రాత్రి బైక్‌లో దంపతులు మాన్వి నుంచి నీరమాన్వికి వెళ్తుండగా నీర మాన్వి సమీపంలో రమేష్ అనే వ్యక్తి బైక్‌పై వస్తూ ఢీకొన్నాడు. ప్రమాదంలో సువర్ణ కింద పడగా అదే సమయంలో వచ్చిన ట్రాక్టర్ ఆమెపై వెళ్లింది. దీంఓ ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హీరేమఠ్ తెలిపారు.

కన్నడపై అభిమానం పెంచుకోవాలి

రాయచూరు రూరల్: కన్నడ సాహిత్యానికి ప్రతీక రాయచూరు జిల్లా అని తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జ్యోతి వెలిగించి మాట్లాడారు. దత్తి ఉపన్యాసాలతో ప్రజలకు కన్నడపై అభిమానం పెంచాలన్నారు. అనంతరం సాహితీవేత్తలను సన్మానించారు.

ఆ మూడు పార్టీలను సాగనంపండి

హుబ్లీ: రాష్ట్రంలో పాలన సాగించిన కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ పార్టీల్లో అవినీతి పరులు ఉన్నారని, ఈక్రమంలో అవినీతి రహిత పాలనకై ఆమ్‌ఆద్మీ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ ఎన్నికల ప్రచార సమితి అధ్యక్షుడు ముఖ్యమంత్రిచంద్రు విజ్ఞప్తి చేశారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జేడీఎస్ అనైతికంగా అధికారం చేపట్టిందని, బీజేపీ నిరంకుశ పాలన సాగిస్తూ అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తోందని, ఇక ఏళ్లుగా పాలన సాగించిన కాంగ్రెస్ ఇప్పుడు గ్యారెంటీ కార్డులు అంటూ ప్రజలను మభ్య పెడుతోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల కోసం ఎస్సీ రిజర్వేషన్‌ను బీజేపీ ప్రకటించడం ఖండనీయం అన్నారు. అవినీతి నిర్మూలన జరిగితే ప్రజలకు కనీస వసతులు, రైతులకు ఇరిగేష్ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయన్నారు.


30బీఎల్ఆర్23: మాట్లాడుతున్న ఆమ్‌ఆద్మీ నేత ముఖ్యమంత్రిచంద్రు

ప్రేమజంట అనుమానాస్పద మృతి

హుబ్లీ: ప్రేమజంట అనుమానాస్పద స్థితిలోమృతి చెందిన ఘటన ధార్వాడ తాలూకా హెబ్బళ్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువకుడు, 16 ఏళ్ల బాలిక ప్రేమించుకున్నారు. మూడు రోజులుగా ఇద్దరూ అదృశ్యమయారు. దీంతో బాలిక తల్లిదండ్రులు ధార్వాడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో సదరు యువకుడికి చెందిన నిర్మాణంలో ఉన్న భవనంలో బుధవారం ఇద్దరూ విగతజీవులుగా కనిపించారు. ధార్వాడ గ్రామీణ పోలీసులు వచ్చి పరిశీలించి మృతదేహాలను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. ఇద్దరి మృతి విషయంలో అనుమానాలు లేవని మృతురాలి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొంది.

జేడీఎస్‌లో చేరిక


కుమారస్వామి నేతృత్వంలో పార్టీ కడువాను వేసుకున్న చెన్నకేశవ

గంగావతి: బీజేపీ నేత హెచ్ఆర్ చెన్నకేశవ జేడీఎస్‌లో చేరారు. బెంగళూరులో హెచ్‌డీ కుమారస్వామి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సీఎం ఇబ్రహీం అయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీలో చేరిక


సురేష్‌బాబు సమక్షంలో చేరుతున్న దృశ్యం

కంప్లి: గణికహాళ్ గ్రామ ప్రముఖులు, యువకులు మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు సమక్షంలో బీజేపీలో చేరారు. వారందరినీ పూలమాలలతో ఆహ్వానించి.. మీ రాక మీ మద్దతు నాకు మరింత ఊపు ఉత్సాహం ఇచ్చిందని సురేష్‌బాబు అన్నారు.

నడి రోడ్డుపై పాక్ అనుకూల నినాదాలు

సాక్షి బెంగళూరు: నడి రోడ్డుపై 24 ఏళ్ల ఒక యువకుడు జై పాకిస్తాన్ అంటూ నినాదాలు చేసిన ఉదంతం మైకో లేఔట్ పోలీసు స్టేషన్ పరిధిలోని బీటీఎం లేఔట్ రెండో స్టేజ్ ఏడో మెయిన్ వద్ద బుధవారం జరిగింది. పాకిస్తాన్ జిందాబాద్ అని నినాదాలు చేసిన వ్యక్తిని అంకుశ్ (24)గా గుర్తించారు. మైకోలేఔట్ పోలీసులు వచ్చి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా అతనొక మానసకి రోగి అని తెలిసింది. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి వదిలేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి పడి యువకుడి మృతి

యశవంతపుర: అపార్ట్‌మెంట్‌పైనుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన మంగళూరు నగరంలోని కేపీటీ వద్ద చోటు చేసుకుంది. మృతుడిని మహమ్మద్ శమాల్(21)గా గుర్తించారు. గురువారం ఉదయం అల్పాహారం తీసుకొని బాల్కనిపైకి వెళ్తుండగా అదుపుతప్పి కింద పడిపోయి మృతి చెందాడు. కద్రి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అక్రమ మద్యం పట్టివేత

కేజీఎఫ్: తాలూకాలోని పుంగనూరు క్రాస్ వద్ద ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గస్తు ఉన్న కేజీఎఫ్ అబ్కారీ పోలీసులు బుధవారం రాత్రి అక్రమంగా లారీలో రవాణా చేస్తున్న 562 లీటర్‌ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 4.1 లక్షలని తెలిపారు. మద్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకున్నారు.

నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

గంగావతి: ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గంగావతి అసెంబ్లీ నియోజక ఎన్నికల అధికారి బసవన్నేప్ప కల్‌శెట్టి తెలిపారు. ఆయన తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 235 కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నామని తెలిపారు. మొత్తం 2,00,597 మంది ఓటర్లు ఉన్నారని, ప్రతి ఒక్కరూ మే10న ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్‌ను ప్రతి రాజకీయ నాయకుడు అనుసరించాలన్నారు.

కోలారు వార్తలు...

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి


కోలారులో ప్రత్యేక అలంకరణలో కోదండరామస్వామి, శోభాయాత్రలో జన సందోహం

కోలారు : జిల్లా వ్యాప్తంగా గురువారం శ్రీరామ నవమి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నగరంలోని కోదండరామస్వామి ఆలయంలో కోదండ రామస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూలతో విశేషంగా స్వామివారిని అలంకరణ చేశారు. నగరంలోని ప్రధాన వీధుల్లో, వాడ వాడలా పానకం పెసరబేడలను పంచి పెట్టారు. శ్రీరామ సేన ఆధ్వర్యంలో భారీ శోభాయాత్రను నిర్వహించారు. శ్రీరామసేన అధ్యక్షుడు ప్రమోద్ ముతాలిక్ శోభా యాత్రలో పాల్గొన్నారు. కాగా ఎంజీ రోడ్డులో శోభా యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు ఫ్లెక్సీలను ఎన్నికల అధికారులు కోడ్ నెపంతో తొలగించారు. దీంతో శ్రీరామసేన కార్యకర్తలు, నగరసభ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

మాలూరు: పట్టణంలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా తేరు వేడుకను నిర్వహించారు. మూల విగ్రహానికి పంచామృత అభిషేకం, వేద మంత్ర పారాయణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను తేరులో ప్రతిష్టించి రథోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే కె వై నంజేగౌడ, మాజీ ఎమ్మెల్యే మంజునాథ్‌గౌడ, హూడి విజయకుమార్ పాల్గొన్నారు.

కేజీఎఫ్: నగరంలోని చాంపియన్ రీఫ్ బీజీఎంఎల్ ఆస్పత్రి ముందు ఉన్న బయలు ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరాంజనేయస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో కమ్మసంద్ర సుధీష్ శాస్త్రి నేతృత్వంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు పానకం, పెసర బేడలను పంచారు.

కార్యాలయం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్

శివాజీనగర: నగరంలోని శివాజీనగర నియోజకవర్గం చిన్నప్పగార్డన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన 'నమ్మ కర్ణాటక సేన' బెంగళూరు నగర జిల్లా శాఖ కార్యాలయాన్ని ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్‌ను, రాష్ట్రాధ్యక్షుడు బసవరాజ పడకోటిను, స్థానిక కాంగ్రెస్ నాయకుడు సీ.క్రిష్ణేగౌడను కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు సుమతి ధనుంజయ, కేపీసీసీ సభ్యుడు వీ.పీ.ఆనందరాజ్, ఇనాయుతుల్లా, ఎం.సీ.శ్రీనివాస్, గజేంద్ర, అనిల్ కుమార్, బండె శివ, బాలాజీ, కిరణ్, పెంచలయ్య పాల్గొన్నారు.

గోబర్ గ్యాస్‌పై అవగాహన

కేజీఎఫ్: తాలూకాలోని మద్దినాయకనహళ్లి గ్రామంలో గురువారం మూమార్క్, సిస్టమా సంస్థల ఆధ్వర్యంలో సామాన్య ప్రజలకు తక్కువ ఖర్చుతో గోబర్ గ్యాస్ ఏర్పాటు చేయడంపై వివరించారు. రైతులు పశువుల పేడ నుంచే గోబర్‌గ్యాస్‌ను తయారు చేసుకుని తమ ఇంట్లో వంట చేయడానికి ఉపయోగించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల వంట గ్యాస్ ఖర్చు తగ్గుతుందని అన్నారు.

మలేమహదేశ్వరునికి రూ.1.82 కోట్ల ఆదాయం

మైసూరు: చామరాజనగర జిల్లా హనూరు తాలూకా మలేమహదేశ్వర బెట్టలో కొలువైన మహదేశ్వర ఆలయ హుండీని గురువారం లెక్కించగా కోట్లాది రూపాయల ఆదాయం లభించింది. అమవాస్య , ఉగాది జాతర మహోత్సవం, ప్రభుత్వ సెలవురోజుల్లో రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. 22 రోజుల్లో రూ. 1,82,30,192 నగదు, 85 గ్రాముల బంగారం, 1.60 కేజీల వెండి భక్తులు సమర్పించినట్లు అధికారులు తెలిపారు.

నాయకులు కోడ్‌ను పాటించాలి


మాట్లాడుతున్న అధికారి నందిని

శ్రీనివాసపురం: రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడినందున పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని శ్రీనివాసపురం తాలూకా ఎన్నికల అధికారి ఆర్‌బి నందిని తెలిపారు. గురువారం తాలూకాఫీసులో విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కోడ్ పాలనలో ఎలాంటి లోపాలు కనిపించినా చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఏప్రిల్ 13న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ వెలువడుతుందన్నారు. విలేకరుల సమావేశంలో తహసీల్దార్ శిరీన్‌తాజ్, ఈవో కృష్ణప్ప ఉన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ


ప్రతిఘటన నిర్వహిస్తున్న కార్యకర్తలు

కోలారు: రాహుల్‌గాంధీ ఎంపీ స్థానం నుంచి అనర్హత విధించడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నాయకులు గురువారం నగరంలోని గాంధీవనం వద్ద నల్ల బ్యాడ్జీలను ధరించి మౌన ప్రతిఘటన నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రజా ప్రభుత్వాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నించకూడదనే దురుద్దేశంతో రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిందన్నారు. ధర్నాలో కాంగ్రెస్ ఎమ్మెల్సీలు ఎంఎల్ అనిల్‌కుమార్, నజీర్ అహ్మద్, నాయకులు లక్ష్మీనారాయణ, ఊరు బాగిలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్టీలో నాపై నిర్లక్ష్యం తగదు

కోలారు: జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు బణకహళ్లి నటరాజ్, తాలూకా అధ్యక్షురాలు కుర్కి రాజేశ్వరిలు తాలూకాలో తనను నిర్లక్ష్యం చేస్తున్నారని , ఎలాంటి బాధ్యతలను అప్పగించడం లేదని తాలూకా ఎస్‌సి విభాగం అధ్యక్షుడు హెచ్ఎన్ మూర్తి ఆరోపించారు. గురువారం పాత్రికేయుల భవనంలో మాట్లాడుతూ నన్ను జేడీఎస్ తాలూకా ఎస్‌సి విభాగం అధ్యక్షునిగా ఆరునెలల క్రితం నియమించారు. అప్పటి నుంచి పార్టీ నిర్వహిస్తున్న ఏ కార్యక్రమానికి తనను ఆహ్వానించడం లేదని వాపోయారు.

క్లుప్తంగా

కోడ్ ఉల్లంఘన... ఎమ్మెల్యేపై కేసు

యశవంతపుర: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన చిక్కమగళూరు జిల్లా మూడిగెరె ఎమ్మెల్యే ఎం.పి.కుమారస్వామిపై అధికారులు కేసు నమోదు చేశారు. కోడ్ అమలులో ఉన్నా మహిళలకు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేసినట్లు మూడిగెరె ఎన్నికల అధికారి పీ రాజేశ్.. కుమారస్వామిపై మూడిగెరె పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదైంది.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు


పాలికె కార్యాలయ వద్ద ప్రభుత్వ ప్రకటనల ఫ్లెక్సీని తొలగించిన దృశ్యం

తుమకూరు: ఎన్నికల కోడ్‌ను అధికారులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. తుమకూరులో ఎమ్మెల్యే జ్యోతిగణేశ్ కార్యాలయం మూసేశారు. మేయర్, ప్రతిపక్ష నాయకుల కార్యాలయాల నామఫలకాలను తొలగించారు. కలెక్టరేట్‌లో సీఎం, మంత్రుల చిత్రపటాలను తొలగించారు.

1న ధ్యానశక్తి శిబిరం

బనశంకరి: రుద్రప్రయాగ్‌కు చెందిన యోగి బాబాసదానవదగిరిమహారాజ్ నేతృత్వంలో ఏప్రిల్ 1న చెన్నసంద్రలోని మహావతార్ ఫౌండేషన్ కార్యాలయ ఆవరణలో ధ్యానశక్తి శిబిరాన్ని నిర్వహించున్నారు. ధ్యానశక్తి, వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తారు. వివరాలకు 9008532066 నెంబరు సంప్రదించాలని మహావతార్ సంస్థ నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి


అద్వైత్‌శెట్టి(ఫైల్)

యశవంతపుర: ట్యూషన్‌కు వెళ్లిన విద్యార్థి అనుమానాస్పద స్థితిలో శవమై తేలాడు.ఈ ఘటన కడబ తాలూకాలో జరిగింది. కోడింబాళ గ్రామానికి చెందిన గుండిమజలు నివాసి మంజునాథశెట్టి కుమారుడు అద్వైత్‌శెట్టి(15) కడబ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ట్యూషన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లలేదు. కుటుంబసభ్యులు గాలించగా కుమారధార నది ఒడ్డున నాకూరు గయలో గురువారం విగతజీవిగా కనిపించాడు. శుక్రవారం నుంచి టెన్త్ పరీక్షలు రాయాల్సిన తమ కుమారుడు శవమై కనిపించడంతో హతాశులై విలపించారు.

కారు డ్రైవర్‌పై టోల్ సిబ్బంది దాడి

దొడ్డబళ్లాపురం: బెంగళూరు శివార్లలో మైసూరు ఎక్స్‌ప్రెస్ వే పై కణమిణకి టోల్ వద్ద టోల్ సిబ్బంది ఒక కారు డ్రైవర్‌పై దాడి చేశారు. బెంగళూరు థణిసంద్ర నివాసి విశ్వనథ్ దాడికి గురైన వ్యక్తి. ఈయన బుధవారం అర్ధరాత్రి బెంగళూరు నుంచి మైసూరు వెళ్తూ టోల్ మార్గంలో వచ్చారు. ఎంత సేపయినా ఫాస్ట్‌ట్యాగ్ స్కాన్ కాకపోవడంతో విసుగుచెందిన విశ్వనాథ్ మరో మార్గంలో వెళ్లడానికి ప్రయత్నించాడు. దీంతో టోల్ సిబ్బంది అందరూ కలిసి విశ్వనాథ్‌ను దుర్భాషలాడుతూ దాడిచేశారు. ఈ దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాధితుడు కుంబళగోడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు.

ఎన్నికల ఆఫీసు ప్రారంభం



కృష్ణరాజపురం: కేంద్ర ఎన్నికల సంఘం కర్ణాటక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఇక్కడి కేఆర్ పురం సెగ్మెంట్‌లో ఎన్నికల ఏర్పాట్లను చేస్తున్నారు. గురువారం మహదేవపుర విధానసభ క్షేత్రం ఎన్నికల అధికారి కార్యాలయాన్ని కెఆర్‌పురం లోని దేవసంద్ర అప్పర్ హెచ్‌పి స్కూల్ ఆవరణలో ప్రారంభించారు. సహాయక ఎన్నికల అధికారి, తహసీల్దార్ అజిత్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నామినేషన్ల దాఖలు, ఉపసంహరణలు, ప్రచారానికి అనుమతులకు ఇక్కడ దరఖాస్తు చేసుకోవాలి. అలాగే కోడ్ ఉల్లంఘనల గురించి ఇక్కడ ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

సిద్ధు ఇంటి ఎదుట ధర్నా

శివాజీనగర: కొన్ని నియోజకవర్గాల్లో టికెట్ పంపిణీలో అసంతృప్తికి గురైన ఆశావహుల మద్దతుదారులు ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్య ఇంటి వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. నాగలక్ష్మీ చౌదరి, పీ.ఎస్.కృష్ణమూర్తి నేతృత్వంలో ధర్నా జరిగింది. దాసరహళ్లి, మొళకాల్మురు నియోజకవర్గాలనుంచి వచ్చిన మద్దతు దారులు ఆందోళన నిర్వహించారు. ఈక్రమంలో ఓ అభిమాని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దాసరహళ్లి నుంచి ధనంజయ్‌కు టికెట్ ఇవ్వరాదని డిమాండ్ చేశారు. యోగేశ్‌కు టికెట్ ఇవ్వాలని మొళకాల్మురు నుంచి వచ్చిన అభిమానులు అర్ధనగ్నంగా ధర్నా నిర్వహించారు.

పది భరతం పట్టాలి



గురువారం బెంగళూరు శేషాద్రిపురంలోని ఒక పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు, బెళగావిలో ఓ కాలేజీలో పరీక్షా కేంద్రంలో నంబర్లు వేస్తున్న దృశ్యం

- నేటి నుంచి ఎస్ఎస్ఎల్‌సీ పబ్లిక్ పరీక్షలు
- హాజరు కానున్న 8.42 లక్షల మంది
- 3,305 పరీక్షా కేంద్రాలు సిద్ధం

శివాజీనగర: విద్యార్థి జీవితంలో ప్రధాన ఘట్టమైన ఎస్ఎస్ఎల్‌సీ (టెన్త్) ప్రధాన పరీక్షలు నేడు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఒకవైపు విధానసభ ఎన్నికల ప్రక్రియ షురూ కాగా, ఆ సందడి మధ్య బాలలకు అసలు పరీక్షలు మొదలయ్యాయి. పేపర్ లీకేజీ, కాపీలను అరికట్టేందుకు పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ షాపులను మూసివేయాలని విద్యాశాఖ ఆదేశించింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో గురువారం విద్యాశాఖ అధికారులు పరీక్షల ఏర్పాట్లను తనిఖీ చేశారు.

తొలిరోజు భాషా పరీక్ష

5833 ప్రభుత్వ పాఠశాలలు, 3,605 ఎయిడెడ్, 6060 అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 8.42 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల బాలలు 3.60 లక్షల మంది. 3,305 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరుగనుంది. తొలిరోజు ప్రథమ భాష కన్నడ, హిందీ, తెలుగు, మరాఠి, ఉర్దు, సంస్కృతం, ఇంగ్లీష్ సబ్జెక్టుల పరీక్ష జరుగుతుంది. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.45 గంటల వరకు పరీక్ష జరుగనుంది.

ఏప్రిల్ 15 వరకు

ప్రశ్నాపత్రాలను జిల్లా, తాలూకా ఖజానా ఆఫీసుల నుంచి పరీక్ష కేంద్రాలకు గట్టి భద్రత మధ్య తరలిస్తారు. ఏప్రిల్ 15న పరీక్షలు సమాప్తమవుతాయి. పరీక్షల మధ్యలో వచ్చే సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పునశ్చరణ చేసుకోవాలని, సందేహాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో నివృత్తి చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపి ఆర్టీసీ, బీఎంటీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు.

నిబంధనలు పాటించాలి

- పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్, వాచ్, ఇతరత్రా ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకొని వెళ్లరాదు
- విద్యార్థులు యూనిఫాం ధరించి హాజరుకావాలి. హిజాబ్ తరహా వస్త్రధారణ ఉంటే అనుమతి ఉండదు. హాల్ టికెట్‌ను మరువరాదు
- కనీసం ఒక గంటకు ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకుని పరీక్షా గదులను గుర్తుంచుకోవాలి.

ఆటో ఎక్కితే దోచేశారు

కృష్ణరాజపురం: దోపిడీకి పాల్పడిన ఇద్దరు దొంగలను ఉప్పారపేట పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 26న ఉప్పారపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. బార్‌లో తాగి బయటకు వచ్చిన వ్యక్తులు ఇంటికి వెళ్లాలని ఒక ఆటోలో ఎక్కారు. అయితే ఆటోవాలా, మరొకరు నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి బెదిరించి మందుబాబుల మొబైల్, డబ్బులు దోచుకుని పరారీ అయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఉప్పారపేట పోలీసులు ఆటోడ్రైవర్‌ను, మరో దొంగను అరెస్టు చేశారు. వారి నుంచి ఒక ఆటో, రెండు మొబైళ్లు, రూ. 4 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.


స్వాధీనం చేసుకున్న సొత్తు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


హేమావతి (ఫైల్)

దొడ్డబళ్లాపురం: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. టిప్పర్ దూసుకెళ్లిన దుర్ఘటనలో యువతి మృతిచెందింది. ఈ సంఘటన నెలమంగల తాలూకా లక్కూరు వద్ద చోటుచేసుకుంది. నరసీపుర గ్రామానికి చెందిన హేమావతి (27) మృతురాలు. ఆమె కూరగాయలు తీసుకుని స్కూటర్‌పై ఇంటికి తిరిగి వెళ్తుండగా వెనుకగా వచ్చిన లారీ ఢీకొంది. హేమావతి కిందపడగా వెనుక నుండి వచ్చిన టిప్పర్ ఆమెపై దూసుకువెళ్లింది. దీంతో హేమావతి అక్కడికక్కడే మృతిచెందింది. దాబస్‌పేట పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్..ఇద్దరి మృతి

బనశంకరి: రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకులను బలి తీసుకుంది. యలహంక పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెంగళూరులోని బళ్లారిరోడ్డు కాఫీడే వద్ద వేగంగా వెళుతున్న బైక్ నియంత్రణ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. బైకులో వెళుతున్న ఇద్దరు తలలకు డివైడర్ తగలడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు మృతదేహాలను ఆస్పత్రికి తరలంచారు. మృతులు వివరాలు తెలియాల్సి ఉంది.

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం నియోజకవర్గంలో నిష్పక్షపాతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి డాక్టర్ జీ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించినట్లు తెలిపారు. జిల్లాలో 2,079,05 మంది ఓటర్లు ఉండగా వీరిలో 80 సంవత్సరాలు దాటినవారు 5061 మంది ఉన్నారనారు. యువ ఓటర్లు 5616 మంది ఉన్నారన్నారు. 252 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో ఓటర్లకు సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. క్కబళ్లాపురం తహసీల్దార్, సహాయక ఎన్నికల అధికారి గణపతిశాస్త్రి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

- డ్రైవర్ నిర్లక్ష్యమేనంటూ ప్రజల ఆందోళన


ఆందోళన చేస్తున్న ప్రజలు

యశవంతపుర: రోడ్డు దాటుతుండగా బస్ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మంగళూరు నగర పరిధిలోని బెందూరు వెల్ వద్ద గురువారం జరిగింది. ఆయగ్నెస్ సర్కిల్ వైపు వెళ్తున్న సీటీ బస్ బెందూర్ వెల్ జంక్షన్‌కు చేరుకుంది. ఐరిన్ డిసోజ(55) అనే మహిళ బస్సు దిగి రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందింది. డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళ ప్రాణాలు కోల్పోయిందని ఆరోపిస్తూ ప్రజలు ఆందోళనకు దిగారు. తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 24న బైక్‌ను బస్సు ఢీకొని 11 సంవత్సరాల బాలుడు మృతి చెందాడని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే మొయిద్దీన్, ప్రతిపక్ష నాయకుడు నవీన్ డిసోజలు వెళ్లి ఆందోళనకారులతో చర్చించారు.

చెట్టుపై నుంచి పడి రైతు మృతి

మండ్య: చెట్టుపై ఆకులను తెంచేందుకు పైకి ఎక్కిన రైతు కింద పడి మరణించాడు. ఈఘటన మళవళ్లి తాలూకా దొడ్డచెన్నిపుర గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బోరేగౌడ (45) తన పొలంలో చెట్టుపైకి ఎక్కి మూగజీవాల ఆహారం కోసం ఆకులను తెంచుతుండగా కాలు జారి కింద పడ్డాడు. అతన్ని బెంగళూరుకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. హలగూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

గిరిజన సంఘాల రాస్తారోకో


నిరసన తెలుపుతున్న దృశ్యం

శివమొగ్గ: ఎస్సీ ఎస్టీల రిజర్వేషన్లలో వర్గీకరణను వ్యతిరేకిస్తూ బంజారా, ఇతర గిరిజన సంఘాల ఆందోళకారులు నిరసనలు కొనసాగించారు. గురువారం ఉదయం శివమొగ్గ నగరం శివార్లలోని మలవగొప్పలో జాతీయ రహదారిపై బంజార, భోవి సామాజికవర్గానికి చెందిన కొందరు ఆందోళన చేశారు. టైర్లకు నిప్పంటించి రాస్తారోకో చేశారు. తక్షణమే అంతర్గత రిజర్వేషన్ కల్పించే ఆదేశాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆ తర్వాత పోలీసులు కలుగజేసుకుని వారికి నచ్చజెప్పారు.

ఆ పనులకు కోడ్ ఆటంకం కాదు

యశవంతపుర: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొత్త పనులను ప్రారంభించటానికి అవకాశం లేదని, అయితే ఇప్పటికే కొనసాగుతున్న పనులకు కోడ్ వర్తించదని అధికారులు పేర్కొంటున్నారు. రాజధాని బెంగళూరులో నమ్మ మెట్రో, స్మార్ట్ సిటీ, టెండర్ ష్యూర్, అండర్ డ్రైనేజ్, రాజకాలువ పనులు, చెరువుల పునరుద్ధరణ, రహదారి పనులకు కోడ్ వర్తించదని ఎన్నికల కమిషన్ పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించవచ్చు. కొప్పళ జిల్లాలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన తాగునీటి పథకం పనులను రద్దు చేశారు. ప్రస్తుతం ఉన్న మంత్రులు బెంగళూరు వదలి వెళ్లాలంటే ఎన్నికల అధికారుల అనుమతులను తీసుకోవాలని ఉంటుంది. కరవు ప్రాంతాలలో పర్యటించటానికి ఎన్నికల కోడ్ వర్తించదు. తాగునీరు, గోశాలకు వెళ్లాలంటే అనుమతులు తీసుకోవాలి.

బంగారు నగలు చోరీ

మండ్య: దుండగులు ఇంటి పైకప్పు తొలగించి లోపలకి చొరబడి లక్షలాది రూపాయల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన మళవళ్లి తాలూకా బెళకవాడిలో జరిగింది. గ్రామానికి చెందిన ఉమేశ్ అనేవ్యక్తి తన బంధువుల ఇంట్లో జరిగే అంత్యక్రియల కోసం వేరే ఊరికి వెళ్లారు. పసిగట్టిన దొంగలు ఇంట్లోకి చొరబడి రెండు బంగారు గొలుసులు, ఒక ఉంగరంతో పాటు సుమారు రూ. లక్ష విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బెళకవాడిపోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా శ్రీరామనవమి

హోసూరు: హోసూరు కామరాజ్ కాలనీలోని ఆంధ్రసాంస్కృతిక సమితి భవనంలో గురువారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమితి నిర్వాహక సభ్యులు అన్నయప్ప సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి శ్రీరాముని అష్టోత్తరశతనామావళిని పఠించారు. సత్యనారాయణ, రంగారెడ్డి, ఎస్.టి.రాజు, మనోహర్, శ్రీనివాస్, ముత్తుక్రిష్టన్, దయానత్తం, రమణారెడ్డి, గోపాల్, శాంసింగ్, చంద్రశేఖర్, విశ్వనాథ్ తదితరులు పాల్గొని భద్రాచల రామదాసు కీర్తనలను ఆలాపించారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎస్.ఆర్.శ్రీనివాస్

శివాజీనగర: గుబ్బి అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి రాజీనామా చేసిన జేడీఎస్ నాయకుడు ఎస్.ఆర్.శ్రీనివాస్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేపీసీసీ కార్యాలయంలో ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఎస్.ఆర్.శ్రీనివాస్‌కు జెండా అందజేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఓటర్లను ప్రలోభపెడితే చర్యలు

శివమొగ్గ: ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లాధికారి డాక్టర్ ఆర్.సెల్వమణి హెచ్చరించారు. గిఫ్ట్ ఓచర్లు, సిమ్‌కార్డు బ్యాలెన్స్, తీర్థయాత్రలు ఏర్పాటు చేయడ, ఆహార కిట్ల పంపిణీ, మద్యం సరఫరా చేసినవారిపై ప్రజా ప్రతినిధుల చట్టం 1951 కింద కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు రసీదులు, ధ్రువీకరణ పత్రాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదును తరలించరాదని హెచ్చరించారు.

దుకాణదారుడిపై దాడి

హోసూరు: మద్యం తాగేందుకు డబ్బులివ్వకపోవడంతో దుకాణదారునిపై దాడి చేశారు. పట్టణంలోని కడవుల్‌నగర్‌లో శక్తి అనే చిల్లరదుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి వీఓసీ నగర్ ప్రాంతానికి చెందిన నాగేష్, జార్జ్, చక్కరై మద్యం మత్తులో వెళ్లి శక్తిని డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వకపోవడంతో ఆవేశానికి గురై దాడి చేశారు. తీవ్ర గాయాలేర్పడిన శక్తి హోసూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

మహిళపై కత్తితో దాడి.. నిందితుడి అరెస్ట్

కెలమంగలం: పాతకెల కారణంగా మహిళపై దాడి చేసిన భవన నిర్మాణ కార్మికున్ని అంచెట్టి పోలీసులు అరెస్ట్ చేశారు. అంచెట్టిసమీపంలోని తీనపట్టి గ్రామానికి చెందిన గౌరికి, అదే ప్రాంతానికి చెందిన మునిరాజ్ మధ్య పాతకక్షలున్నాయి. బుధవారం సాయంత్రం గౌరి కాలినడకన వెళ్తుండగా మునిరాజ్ అసభ్యంగా దూషించడంతో పాటు కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలేర్పడిన ఆమెను క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంచెట్టి పోలీసులు కేసు నమోదు చేసుకొని మునిరాజ్‌ను అరెస్ట్ చేశారు.

ఎడ్ల పరుషకు విశేష స్పందన


పరుషకు వచ్చిన వృషభాలు

గౌరిబిదనూరు: విదురాశ్వత్థం ఎడ్ల పరుషకు విశేష స్పందన లభించినట్లు విదురాశ్వత్థం ఈఓ మరిరాజు తెలిపారు. రాష్ట్రంతోపాటు ఏపీ, తమిళనాడు నుంచి రైతులు వచ్చి ఎడ్లను కొనుగోలు చేశారన్నారు. 3వేలకుపైగా ఎడ్లు పరుషకు వచ్చాయన్నారు. తాలూకాలోని కెంకరె గ్రామానికి చెందిన నరసింహారెడ్డి తన జత ఎడ్లను విక్రయానికి ఉంచగా రూ. 2 లక్షలకు అమ్ముడుపోయాయన్నారు. ఏప్రిల్ 6న వార్షిక బ్రహ్మ రథోత్సవం నిర్వహించనునన్నట్లు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

గౌరిబిదనూరు: నేటినుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు కట్టు దిటిటమైన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ మహేశ్ పత్రె తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాలూకాలో 14 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 56 పాఠశాలలకు చెందిన 3481 మంది పరీక్షలరకు హాజరు కానున్నారన్నారు. విద్యాశాఖనుంచి 352 మంది సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. 28 మంది ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. విద్యార్థులకు అస్వస్థతకు గురైతే వెంటనే చికిత్సలు అందిస్తారన్నారు. హాల్ టికెట్లు చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్ష కేంద్రానికి చేరుకోవచ్చన్నారు. అవసరమైన చోట్ల సీసీకెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈఓ హరీశ్, తాలూకా విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి, నగరసభ కమిషనర్ గీత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ మహేశ్ పత్రె

విద్యతోనే ఉత్తమసమాజ నిర్మాణం

బనశంకరి: విద్యతోనే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమని బెంగళూరు వర్సిటీ విశ్రాంత చాన్సలర్ డాక్టర్ కే.సిద్దప్ప అన్నారు. ఎంబీఏలో ర్యాంకులు సాధించిన శ్రీకృష్ణ కళాశాలకు చెందిన విద్యార్థులకు స్థానిక ఒక హోటల్‌లో సన్మానం ఏర్పాటు చేశారు. మొదటి ర్యాంకు సాధించిన ఏ.పవిత్ర, నాలుగోర్యాంక్ సాధించిన ఏ.నిశాంత్, ఐదోర్యాంక్ సాధించిన రోజాను గురువారం డాక్టర్ ఎం.రుక్మాంగదనాయుడు, డాక్టర్ కే.సిద్దప్ప ఘనంగా సన్మానించి మాట్లాడారు. పవిత్ర పేద కుటుంబం నుంచి వచ్చి ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. జలజాక్షమ్మ, ప్రొఫెసర్ ఎస్‌పీ.మనోహర్, వేణుగోపాల్, ప్రిన్సిపాళ్లు ఉషాకుమారి, కమలసుగంతి తదితరులు పాల్గొన్నారు.


ర్యాంకులు సాధించిన పవిత్ర, నిశాంత్, రోజాను సన్మానిస్తున్న దృశ్యం

ఐకమత్యంగా నవమి ఉత్సవాలు


మైసూరులో పానకం పంచుతున్న దృశ్యం


మంజునాథనగరలో శ్రీరాముడికి పూజలు


తుమకూరు: లింగప్పనపాళ్యలో అలంకరణ

మైసూరు: మైసూరు రాజుల నగరంలో గురువారం రామనవమి ఉత్సవాలను హిందూ ముస్లింలు కలసికట్టుగా ఆచరించి భావైక్యతను చాటిచెప్పారు. ఇరు వర్గాలకు చెందిన యువ భక్తులు ప్రజలకు పానకం, వడపప్పు, మజ్జిగను పంచిపెట్టారు. నారాయణ శాస్త్రి రోడ్డులోని జిల్లా పెండాల్ ఓనర్ల సంఘం ఈ కార్య క్రమాన్ని ఏర్పాటుచేశారు.

బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి సామసంద్ర పాళ్యలో సమాజ సేవకుడు శ్రీనివాస్ రెడ్డి, బీజేపి నేత మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్కిల్‌లో సీతారాముల వారి చిత్రపటానికి పూజలు చేసి పప్పు పానకం పంచిపెట్టారు. వెంకటేష్ , సంతోష్, సందీప్ పాల్గొన్నారు.

బనశంకరి: రాజాజీనగర బసవేశ్వర నగర వార్డు మంజునాథనగరలో మాజీ కార్పొరేటర్ ఎస్‌హెచ్.పద్మరాజ్, ఉమాపతి పద్మరాజ్ ఆధ్వర్యంలో 5 వేల మంది భక్తులకు పానకం పంపిణీ చేశారు.

తుమకూరు: లింగప్పన పాళ్యలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామివార్లకు పూజలు చేశారు.

హోసూరు వార్తలు..

వాడవాడలా శ్రీరామనవమి ఉత్సవాలు


సీతారాముల చిత్రపటాలను విశేషంగా అలంకరించిన దృశ్యం


సీతారాముల ఊరేగింపు దృశ్యం

హోసూరు, కెలమంగలం, క్రిష్ణగిరి: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం శ్రీరామ, ఆంజనేయస్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. హోసూరు పట్టణంలోని నేతాజీ రోడ్డులో శ్రీరామాలయంలో రామలక్ష్మణ సీతాదేవి విగ్రహాలకు పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్ సంయుక్తంగా శ్రీరామ, ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించి భక్తులకు చల్లని పానీయాలు, అన్నదానం నిర్వహించాయి. పట్టణంలోని రామాలయాల్లో, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు కిక్కిరిశారు.

డెంకణీకోట, కెలమంగలంలో


డెంకణీకోటలో ప్రసిద్ధి పొందిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణాంజనేయస్వాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో పురవీధుల్లో ఊరేగించారు. కెలమంగలం సమీపంలోని హొసపురం వద్ద వెలసిన 32 అడుగుల నిలువెత్తు ఆంజనేయస్వామి ఆలయంలో, హనుమంతపురం వద్ద వెలసిన వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయంలో ఉత్సవాలు జరిగాయి. సూళగిరిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో, క్రిష్ణగిరి సమీపంలోని కాటువీరాంజనేయస్వామి ఆలయాల్లో వేకువజాము నుంచి విశేష పూజలను జరిపించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

హోసూరు: హోసూరు సమితిలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దీపక్‌జేకప్ గురువారం పరిశీలించారు. హోసూరు తాలూకా నెల్లూరు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాలలో రూ. 46.22 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి భవనాల పనులను, ప్రాథమిక పాఠశాలలో రూ. 5.32 లక్షలతో నిర్మిస్తున్న వంటగది, రూ. 1.54 లక్షలతో ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయ భవన పనులను కలెక్టర్ పరిశీలించారు. బాగలూరు బస్టాండులో రూ. 1.75 కోట్లతో ఏర్పాటు చేస్తున్న మహిళల విడిది, వంటగది నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు. బీడీవో రామచంద్రన్, అధికారులు భూపతి, కుమార్, గౌరి, ధనలక్ష్మి, ప్రభాకర్, కవిత తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దీపక్‌జేకప్

టెంపో డ్రైవర్ల సంఘం ప్రారంభం



హోసూరు: హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో కొత్తగా ఏర్పడిన టెంపో డ్రైవర్ల కార్మిక సంఘాన్ని అన్నాడీఎంకే పార్టీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి పి.బాలక్రిష్ణారెడ్డి ప్రారంభించి డ్రైవర్లకు యూనిఫాంలను అందజేశారు. అన్నాడీఎంకే హయాంలో హోసూరు పట్టణంలోనే కాక తళి పరిసర గ్రామీణ ప్రాంతాలకు కూడా రోడ్ల వసతులు కల్పించామని చెప్పారు. డీఎంకే ప్రభుత్వం ఇప్పుడు పాడైన రోడ్లకు కనీసం మరమ్మతులు చేయడం లేదని ఆరోపించారు. నేతలు శ్రీనివాసన్ అశోక్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, రాజు, యూనియన్ చైర్పర్సన్ శశివెంకటస్వామి పాల్గొన్నారు.

గంజా చాక్లెట్ విక్రేతల అరెస్ట్

హోసూరు: గంజా చాక్లెట్లు విక్రయిస్తున్న నలుగురు పట్టుబడ్డారు. హోసూరు పట్టణ పోలీసులు బుధవారం హోసూరు- పాత బెంగళూరు రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రెండు ఆటోలను తనిఖీ చేయగా గంజాచాకెట్ల రవాణా వెలుగు చూసింది. రామ్ నగర్ నివాసి సుల్తాన్(32), కర్నూరు వాసి గణేష్ మేధ(38), గాంధీ రోడ్డు నివాసి జమీర్(34), వాసవి నగర్ నివాసి శబరీష్(36)ను అరెస్ట్ చేసి 600 గ్రాముల గంజాచాక్లెట్లు, ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

బైక్ దొంగ అరెస్ట్

క్రిష్ణగిరి: బైక్ చోరీలకు పాల్పడుతున్న పోచ్చంపల్లి తాలూకా అందేరిపట్టి గ్రామానికి చెందిన సతీష్‌కుమార్(27) అనే దొంగను పోలీసులు అరెస్ట్ చేసి బైక్ స్వాధీనం చేసుకున్నారు. క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలోని ఎగ్గూరు గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ తిరుపతి(37)కి చెందిన బైక్‌ను నిందితుడు చోరీ చేశాడు.

క్లుప్తంగా...

9 వరకు మహిళా జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సంపూర్ణ ఆరోగ్యం అందించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని, ఇందులో భాగంగా ఏప్రిల్ 9 వరకు మహిళా జర్నలిస్టులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి తెలిపారు. సమాచార కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సీఎస్ ప్రారంభించారు. ఏప్రిల్ 2వ మినహా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఉచిత వైద్య శిబిరం ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన మహిళా జర్నలిస్టులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సీఎస్ సూచించారు. జిల్లాల్లో పనిచేస్తున్న గుర్తింపు పొందిన మహిళా జర్నలిస్టులకు ఆయా జిల్లా కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు సమాచార కమిషనర్ అరవింద్ కుమార్ తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ నాగయ్య కాంబ్లి, కిషోర్‌బాబు, జాయింట్ డైరెక్టర్లు వెంకటరమణ, జగన్, శ్రీనివాస్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు ఇవీ..

మాస్టర్ హెల్త్ చెకప్‌లో భాగంగా రక్త పరీక్ష (సీబీపీ), బ్లడ్ షుగర్, డయాబెటిక్ పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, కాల్షియం, మూత్ర పరీక్షలు, విటమిన్ బీ12, డీ3, ఈసీజీ, ఎక్స్–రే, అల్ట్రాసోనోగ్రఫీ, మామోగ్రామ్, పాప్‌స్మెర్ వంటి రోగనిర్ధారణ పరీక్షలు ఉంటాయి, స్క్రీనింగ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ ఎగ్జామినేషన్, ఐ స్క్రీనింగ్, డెంటల్ పరీక్షలు, గైనకాలజీ పరీక్షలు నిర్వహిస్తారు.

తూనికల్లో మోసం

సాక్షి, హైదరాబాద్: కొందరు వ్యాపారులు వినియోగదారులను నిండాముంచుతున్నారు. తూకాల్లో మోసం చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. తక్కువ తూకం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు వ్యాపారులు తూకాల్లో మోసం యథేచ్ఛగా చేస్తుంటే.. మరికొందరు దొడ్డిదారిన చేస్తున్నారు. ఇలా కిలోకు ఏకంగా 100 గ్రాముల నుంచి 200 గ్రాముల వరకు తక్కువ తూకం వేస్తున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వ్యాపారుల మోసాలు పెరుగుతున్నా.. తూనికలు కొలతలు శాఖ తనిఖీలు మొక్కుబడిగా ఉంటున్నాయని విమర్శలు వస్తున్నాయి. కేసుల నమోదు, జరిమానాలు అంతంత మాత్రమేనంటున్నారు.

కటింగ్ బాట్లు... సెట్టింగ్ మిషన్లు

వ్యాపారులు బాట్ల (తూనిక రాళ్ల) కింది భాగంలో కట్ చేస్తారు. కనీసం 100 గ్రాముల నుంచి 200 గ్రాముల వరకు అందులో ఉన్న ఇనుము తీసేస్తారు. ముందు భాగంలో భాగానే కనిపించినా.. అడుగు భాగం మాత్రం డొల్లగా ఉంటుంది. చేతిలో పట్టుకుని సరిగ్గా చూస్తే కాని తెలియని పరిస్థితి. కటింగ్ చేసిన భాగంలో ఒక రేకును పెడతారు. ఇలా ఏ మాత్రం అనుమానం రాకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకుంటారు. మరో వైపు వెయింగ్ మిషన్ల ద్వారా కూడా తూకంలో మోసం జరుగుతోందని వినియోగదారులు వాపోతున్నారు. ఎలాంటి అనుమానం రాకుండా మిషన్ కింద వైపు ఉన్న బటన్ నొక్కితే సరిపోతుందని, కిలోకు 200 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు తక్కువ తూగేలా సెట్టింగ్ చేయవచ్చని తెలుస్తోంది.

పట్టించుకోని అధికారులు..

తూనికలు, కొలతల శాఖ అధికారుల నిర్లక్ష్యం వ్యాపారులకు కల్పతరువుగా మారిందని విమర్శలు వస్తున్నాయి. వినియోగదారులు ఫిర్యాదు చేస్తేకాని అధికారులు తనిఖీ చేసే పరిస్థితి లేదని, స్పెషల్ డ్రైవ్‌లు సైతం అంతంత మాత్రంగానే ఉంటున్నాయని చెపుతున్నారు. నిబంధనల ప్రకారం.. కాంటాలు, తూకం రాళ్లను రెండేళ్లకోసారి, ఎలక్ట్రానిక్ కాంటాలను ఏడాదికోసారి తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేసి స్టాంపింగ్ చేయాలి. తక్కువ తూకం వేసేవారికి జరిమానా విధించాలి. అయితే ఇదంతా మొక్కుబడిగా తయారైందని వినియోగదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ మోసాలపై అధికారుల వివరణకోసం ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

'వందే భారత్'కు సీసీ నిఘా

ఆ రైళ్లకు అదనంగా సీసీ టీవీ కెమెరాలు అమర్చాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: వందేభారత్ రైళ్లకు అదనంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం వాటికి ముందు, వెనక జత సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి. కానీ రైళ్లపై వరుసగా జరుగుతున్న రాళ్ల దాడులను నియంత్రించేందుకు అదనంగా మరో నాలుగు సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. దీంతో ఏ ప్రాంతంలో రాళ్ల దాడి జరిగినా, నిందితుల దృశ్యాలను అవి చిత్రిస్తాయి. దీంతో వారిని పట్టుకోవటం సులువవుతుందని అధికారులు భావిస్తున్నారు. తొలి రైలుపై ఇప్పటికే అరడజను వరకు రాళ్ల దాడులు జరిగాయి. ప్రతిసారీ అద్దాలు ధ్వంసమవుతున్నాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిన ఈ రైళ్లకు, విశాలమైన అద్దాల కిటికీలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తున్నాయి. ఆకతాయిలు ఆ అద్దాలు లక్ష్యంగా రాళ్లతో దాడులకు తెగబడుతుండటం... మళ్లీ కొత్త అద్దాలు బిగించటం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఎలాగైనా ఆ దాడులను నియంత్రించాలని నిర్ణయించారు. కాగా, గత జనవరి నుంచి ఇప్పటి వరకు రైళ్ల మీద రాళ్ల దాడి చేసిన 39 మంది ఆకతాయిలను గుర్తించిన రైల్వే పోలీసులు వారిని అరెస్టు చేసి జైలుకు పంపారు. కొన్ని ప్రాంతాల్లో రైళ్లపై దాడులు చేసిన వారిలో ఆరేళ్ల నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న వారూ ఉన్నారు.

డిగ్రీ సీట్లలో లక్షకుపైగా కోత!

- 2023–24 విద్యా సంవత్సరంలో అమలు
- డిమాండ్ లేని గ్రూపులకు ఉద్వాసన
- కాంబినేషన్ ఉంటేనే అనుమతి
- కాలేజీలే స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచన
- దోస్త్ నోటిఫికేషన్ లోపే కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం డిగ్రీలో లక్షకుపైగా సీట్లను తగ్గించే అవకాశం ఉంది. అన్ని విశ్వవిద్యాలయాలు ఇప్పటికే ఈ దిశగా కసరత్తు మొదలుపెట్టాయి. డిమాండ్ లేని గ్రూపులు తగ్గించుకోవాలని, వీటిపై అనుబంధ గుర్తింపు ఇచ్చేలోపే స్పష్టత ఇవ్వాలని ప్రైవేటు కాలేజీలకు సూచించాయి. డిమాండ్ ఉన్న గ్రూపుల్లో సీట్లు పెంచేందుకు అనుమతించాలని నిర్ణయించాయి. గత ఐదేళ్ల డేటాను పరిశీలించి, జీరో అడ్మిషన్‌లు ఉన్న గ్రూపులు, కాలేజీల జాబితా రూపొందించాలని ఇటీవల జరిగిన వైస్ చాన్స్‌లర్ల సమావేశం తీర్మానించింది. గతేడాది కూడా లక్ష సీట్లను అనధికారికంగా ఫ్రీజ్ చేశారు. వీటిని దోస్త్ (ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలు) వెబ్‌సైట్‌లో కన్పించకుండా చేశారు. ఈసారి కాలేజీల నుంచే సీట్లు తగ్గించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో దాదాపు 1,080 డిగ్రీ కాలేజీలు, 4.68 లక్షల సీట్లున్నాయి. ఐదేళ్లుగా గరిష్టంగా 2.5 లక్షలు సీట్లు కూడా భర్తీ కావడంలేదు. 2022–23లో 2.20 లక్షల సీట్లు అతికష్టం మీద భర్తీ అయ్యాయి. 53 కాలేజీల్లో ఒక్కరు కూడా చేరలేదు. 108 సెక్షన్లలో ఐదుగురికి మించి విద్యార్థులు చేరలేదు. ఇంటర్ ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు 3.20 లక్షలమంది ఉంటున్నారు. వారిలో 75 వేల మంది ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు. కొంతమంది ఇతర కోర్సుల వైపు వెళ్తున్నారు. దాదాపు 2 లక్షల మంది మాత్రమే డిగ్రీలో చేరుతున్నారు. దీంతో 2.5 లక్షల సీట్లు మిగిలిపోతున్నాయి.



మారితేనే మంచిది..

డిగ్రీలో మార్పులకు ఉన్నత విద్యామండలి శ్రీకారం చుట్టింది. సంప్రదాయ గ్రూపులు కాకుండా, విద్యార్థి నచ్చిన గ్రూపులో చేరేందుకు మార్పులు చేస్తోంది. బీఏలోనే 68 రకాల గ్రూపులొచ్చాయి. బీఎస్సీలో 73 రకాలు, బీకాంలో 13 రకాల కాంబినేషన్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా బీబీఎం, బీబీఏ, బీసీఏ, బ్యాచిలర్ ఆఫ్ సోషల్ వర్క్, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ (బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, హాస్పిటాలిటీ టూరిజం పరిపాలన) వంటి గ్రూపులు విస్తరించాయి. బీకాంలో మారిన ట్రెండ్‌కు అనుగుణంగా అప్లికేషన్ గ్రూపులు తీసుకొచ్చారు. బీఎస్సీ గణితం, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్ వంటి కాంబినేషన్ గ్రూపులు మార్కెట్ అవసరాలు తీర్చేలా ఉన్నాయి. బీఎస్సీ అభ్యర్థి అడ్మినిస్ట్రేషన్‌ను ఒక సబ్జెక్టుగా తీసుకునే వీలుంది. హైదరాబాద్‌లోని ప్రైవేటు కాలేజీలు కొన్ని కొత్త గ్రూపులతో డిగ్రీలు అందిస్తున్నాయి. ఇక మీదట రాష్ట్రంలోని అన్ని కాలేజీలు మార్పునకు సమాయత్తం చేయాలన్నదే రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయమని అధికారులు చెబుతున్నారు. 70 కాలేజీల్లో బీఏలో కనీసం 15 శాతం కూడా చేరడం లేదు. ఇలాంటి కాలేజీలు మార్కెట్‌లో ఉపాధి లభించే కోర్సుల మేళవింపుతో వెళితే సీట్లలో కోత పెట్టబోమని అధికారులు అంటున్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ఇంటర్ ఫలితాల వెల్లడి తర్వాత మొదలవుతుందని, ఈలోగా అనుబంధ గుర్తింపు పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. దీనికన్నా ముందు అవసరం లేని సీట్లు తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

మార్పు సహజం

డిమాండ్ లేని కోర్సులు తగ్గించుకోవాలని కొన్నేళ్లుగా ప్రైవేటు కాలేజీలకు చెబుతున్నాం. విద్యార్థులు కోరుకునే గ్రూపులు, కొత్తగా వస్తున్న గ్రూపులను అందుబాటులోకి తేవాలని చెప్పాం. వచ్చే దోస్త్‌లో దీన్ని కచ్చితంగా అమలు చేయాలని భావిస్తున్నాం. ఈ దిశగా కాలేజీలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ బాధ్యతను యూనివర్సిటీలకు అప్పగించాం.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్

గత ఆరేళ్లుగా డిగ్రీ సీట్ల భర్తీ ఇలా.. (మొత్తం సీట్లు 4.68 లక్షలు)

సంవత్సరం	బాలురు	బాలికలు	మొత్తం భర్తీ
2017-18	90,696	1,10,110	2,00,806
2018-19	94,483	1,07,383	2,01,866
2019-20	94,633	1,07,709	2,02,342
2020-21	1,14,408	1,08,212	2,22,620
2021-22	1,29,245	1,25,887	2,55,132
2022-23	1,02,050	1,10,761	2,12,811

బ్యాంకు ఖాతాదారుల డేటా చోరీ

2 ఐటీ సంస్థల నుంచే..!



- ఎస్‌బీఐ, బీఓబీ కస్టమర్ల వివరాలు తస్కరించిన ఇద్దరు ఉద్యోగులు
- నిందితుల విచారణలో గుర్తించిన సైబరాబాద్ పోలీసులు
- మ్యాట్రిక్స్, టెక్‌మహీంద్ర సీఐఓలకు నోటీసులు జారీ

సాక్షి, హైదరాబాద్: గోప్యంగా ఉండాల్సిన బ్యాంకు ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం రెండు ఐటీ కంపెనీల నుంచే చోరీకి గురైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఎస్‌బీఐ ఖాతాదారుల వివరాలను మ్యాట్రిక్స్ సంస్థ నుంచి, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కస్టమర్ల డేటాను టెక్ మహీంద్రా సంస్థ నుంచి అందులో పనిచేసే సిబ్బందే కొట్టేసినట్లు సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. దేశవ్యాప్తంగా ఆయా బ్యాంకుల ఖాతాదారుల వివరాలను తస్కరించి సైబర్ మోసాలకు పాల్పడుతున్న తొమ్మిది మంది నిందితులను సైబరాబాద్ పోలీసులు తాజాగా అరెస్టు చేయడం తెలిసిందే. పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది.

గంట ముందే ఆఫీసుకొచ్చి...

బీఓబీ కార్డుల యాక్టివేషన్, కస్టమర్ల సమస్యల పరిష్కారం వంటి సేవలను నోయిడాలోని టెక్ మహీంద్రా కంపెనీ నిర్వహించేది. ఈ సంస్థలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న వీరేంద్ర సింగ్ బ్యాంకు ఖాతాదారుల వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించేవాడు. బహిరంగ మార్కెట్‌లో ఒక్క కార్డుదారుని వివరాలను రూ.10–20లకు విక్రయించేవాడు. ఆఫీసు పని గంటల కంటే ముందే కార్యాలయానికి వచ్చి ఖాతాదారుల డేటాను తన వ్యక్తిగత మెయిల్స్‌కు, వాట్సాప్‌కు పంపించుకొనేవాడని పోలీసుల విచారణలో నిందితుడు వెల్లడించినట్లు తెలిసింది. అలాగే ఎస్‌బీఐ డెబిట్, క్రెడిట్ కార్డుల యాక్టివేషన్, ఇతరత్రా సేవలను హరియాణాలోని మ్యాట్రిక్స్ కంపెనీ నిర్వహించేది. ఇందులో పనిచేసే ప్రదీప్ వాలియా ఆయా ఖాతాదారుల వివరాలను తస్కరించి విక్రయించేవాడని సమాచారం.

కొట్టేసిన సొమ్ము కోసం నకిలీ ఖాతాలు..

కార్డుదారుల డేటాను ప్రధాన నిందితుడు ఖఫిల్ అహ్మద్ కొనుగోలు చేసేవాడు. ఢిల్లీలో నకిలీ కాల్ సెంటర్, బ్యాంకు ఖాతాలు, సిమ్ కార్డులను ఏర్పాటు చేసి టెలికాలర్లను నియమించుకున్నాడు. జనాలను మోసం చేసిన సొమ్మును నోబ్రోకర్.కామ్, హౌసింగ్.కామ్, పేటీఎం, మ్యాజిక్‌బ్రిక్స్.కామ్ వంటి మాధ్యమాల ద్వారా నకిలీ బ్యాంకు ఖాతాలకు మళ్లించేవాడని పోలీసులు గుర్తించారు.

కంపెనీల సీఐఓలకు నోటీసులు..

ఐటీ చట్టంలో ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని పర్సనల్ ఐడెంటిటీఫైయింగ్ ఇన్ఫర్మేషన్ (పీఐఐ), ప్రభుత్వరంగ సంస్థల సమాచారాన్ని సెన్సిటివ్ పర్సనల్ డేటా ఇన్ఫర్మేషన్ (ఎస్‌పీడీఐ) అని రెండు విభాగాలుంటాయి. ఎస్‌పీడీఐను నిర్వహించే కార్పొరేట్ కంపెనీలకు కేంద్రం కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. సున్నితమైన సమాచార రక్షణ, దుర్వినియోగాన్ని నిరోధించే బాధ్యత కంపెనీలదేనని స్పష్టం చేసింది. అయితే ఈ కేసులో టెక్ మహీంద్రా, మ్యాట్రిక్స్ సంస్థలు నిబంధనలను ఉల్లంఘించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఐటీ చట్టంలోని సెక్షన్ 72ఏ కింద కేసులు నమోదు చేసి విచారించాలని నిర్ణయించినట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ఈ మేరకు ఆయా సంస్థల చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (సీఐఓ)లకు నోటీసులు జారీ చేశారు.

డిఫాల్ట్ మిల్లర్లకు.. ధాన్యం బంద్

కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను గడువులోగా ఇవ్వని మిల్లులపై చర్యలు

- అలాంటి 300 మిల్లులను గుర్తించిన పౌర సరఫరాల సంస్థ
- ఇకపై ఆరు నెలల్లో సీఎంఆర్ పూర్తయ్యేలా మిల్లులకు ధాన్యం కోటా



సాక్షి, హైదరాబాద్: రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యాన్ని (కస్టమ్ మిల్లింగ్ రైస్ –సీఎంఆర్) ఎఫ్‌సీఐకి అప్పగించకుండా సతాయించే మిల్లులపై కొరడా ఝులిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆరు నెలల్లోగా ధాన్యం మిల్లింగ్ చేసి బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉన్నా.. కొందరు మిల్లర్లు ఏడాదిన్నర దాకా జాప్యం చేస్తున్నారు. అప్పటికీ కొన్ని మిల్లుల నుంచి సీఎంఆర్ బియ్యం పెండింగ్‌లోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో సకాలంలో బియ్యం ఇవ్వకుండా పౌరసరఫరాల సంస్థకు నష్టం కలిగిస్తున్న మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే నెల మూడో వారం నుంచి మొదలయ్యే యాసంగి సీజన్ నుంచే దీనిని అమలు చేయనుంది. సీఎంఆర్‌లో జాప్యం చేస్తున్న 300కుపైగా మిల్లులను డిఫాల్ట్ మిల్లులుగా అధికారులు ఇప్పటికే గుర్తించి, జాబితా సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ మిల్లులకు ధాన్యం కేటాయింపులను పూర్తిగా నిలిపేసి.. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు మంత్రి గంగుల కమలాకర్ ద్వారా సీఎంకు ప్రతిపాదనలు అందజేసినట్టు సమాచారం.

ఆరునెలల్లోగా ఇవ్వాల్సి ఉన్నా..

వచ్చేనెల నుంచి యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు చేరాక రైతుల ఖాతాలో డబ్బులు జమవుతాయి. మిల్లర్లు ఆ ధాన్యాన్ని తీసుకున్నాక ఆరు నెలల్లోగా మరాడించి బియ్యాన్ని పౌర సరఫరాల సంస్థ ద్వారా ఎఫ్‌సీఐకి అప్పగించాలి. కానీ మిల్లర్ల నుంచి తగిన సమయంలో సీఎంఆర్ రాకపోవడంతో.. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐను గడువు పెంచాలని కోరడం ఏటా జరిగే తంతుగా మారింది. 2019–20 యాసంగి సీజన్‌కు సంబంధించి 118 మిల్లులు ఇప్పటివరకు సీఎంఆర్ ఇవ్వలేదు. మూడేళ్లుగా పెనాల్టీతో గడువు పెంచుతున్నా ఇప్పటికీ సీఎంఆర్ పెండింగ్‌లోనే ఉండటం గమనార్హం. గడువు ముగిసిన తరువాత ఎఫ్‌సీఐ బియ్యం తీసుకోకపోతే వాటిని రాష్ట్ర అవసరాలకు మళ్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేగాకుండా సీఎంఆర్ ఆలస్యంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతోంది. దీనితో ఇకపై మిల్లర్ల ఆగడాలను ఉపేక్షించొద్దని, ధాన్యం కేటాయింపుల్లో కోత విధించాలని.. ఆరు నెలల్లో సీఎంఆర్ పూర్తి చేసేంత కెపాసిటీలోనే కేటాయింపులు జరపాలని నిర్ణయించినట్టు తెలిసింది. మిల్లర్లకు కేటాయించగా మిగిలే ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారానే మిడిల్ పాయింట్ స్టోరేజీ గోడౌన్‌లకు తరలించి.. ప్రైవేటు వ్యక్తులకు విక్రయించాలని కూడా యోచిస్తోంది.

సీఎంఆర్‌లో లేని మిల్లులకు ధాన్యం

ఇప్పటివరకు సీఎంఆర్‌తో సంబంధం లేకుండా ప్రైవేటుగా ధాన్యం కొనుగోలు చేసి, బియ్యంగా మార్చి అమ్ముకునే మిల్లులను ఈసారి సీఎంఆర్ పరిధిలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. మిర్యాలగూడ, నిజామాబాద్, నల్లగొండ వంటి కొన్ని ప్రాంతాల్లో 100కుపైగా మిల్లులు పౌరసరఫరాల శాఖ, సీఎంఆర్‌తో సంబంధం లేకుండా పనిచేస్తున్నాయి. వాటిని గుర్తించి సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.

గోదాముల స్థలాలు సిద్ధం

పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాల వారీగా మిడిల్ పాయింట్ గోదాములను ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాలను ఇప్పటికే గుర్తించారు. మిల్లర్లకు కేటాయించగా మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వమే మిడిల్ పాయింట్ గోదాముల్లో నిల్వచేసి, ప్రైవేటుగా వేలం వేయడం ద్వారా మిల్లింగ్, సీఎంఆర్‌తో సంబంధం లేకుండా త్వరగా సొమ్ము రికవరీ కానుంది. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్ల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టే బాధతోపాటు 18 నెలల పాటు సీఎంఆర్ ఇవ్వకపోవడంతో ఎఫ్‌సీఐ నుంచి నిధులు రాక ఇబ్బందిపడే పరిస్థితి తప్పుతుందని ప్రభుత్వం యోచిస్తోంది.

కొనుగోళ్ల బాధ్యతలు కలెక్టర్లకు..

రాష్ట్రంలో కొన్ని సీజన్లుగా ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ ప్రక్రియ అదనపు కలెక్టర్ల నేతృత్వంలో జరుగుతోంది. కొన్ని జిల్లాల్లో అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల సంస్థ అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నట్టు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో వచ్చే యాసంగి సీజన్‌లో కొనుగోలు ప్రక్రియ పూర్తిగా కలెక్టర్ల నేతృత్వంలో జరపాలని నిర్ణయించారు. దీనిపై ఏప్రిల్ 10న మంత్రుల సమావేశంలో నిర్ణయాలు తీసుకోనున్నారు.

డేటా లీకులో మనీ లాండరింగ్!

రంగంలోకి దిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

- సైబరాబాద్ పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు
- ఏడుగురు నిందితులపై మనీ లాండరింగ్ కేసులు నమోదు



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన 16.8 కోట్ల మంది డేటా లీక్ వ్యవహారంలో మనీ లాండరింగ్ నిగ్గు తేల్చేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో నిందితులు కీలకమైన డేటాను బహిరంగ మార్కెట్లో విక్రయించడం ద్వారా ఆస్తులు కూడబెట్టినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే అరెస్టు అయిన నిందితులు నితీశ్ భూషణ్ కుమార్, పూజా కుమారి, సుశీల్ తోమర్, అతుల్ ప్రతాప్ సింగ్, ముస్కాన్ హసన్, సందీప్ పాల్, జియా ఉర్ రెహ్మాన్‌లపై మనీ లాండరింగ్ చట్టం కింద కేసులు నమోదు చేశారు. వీరి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు వీలుగా ఈ ఏడుగురిని అదుపులోకి తీసుకొని వేర్వేరుగా విచారిస్తున్నారు.

ఉత్తరాది రాష్ట్రాల్లోనే కార్యకలాపాలు

ప్రజల వ్యక్తిగత సమాచారంతో పాటు రక్షణ శాఖ, టెలికం, విద్యుత్, ఇంధనం వంటి సున్నితమైన ప్రభుత్వ సంస్థల కీలక సమాచారాన్ని ఈ అంతర్రాష్ట్ర నిందితులు తస్కరించారు. ఈ డేటాను జస్ట్ డయల్, డేటా మార్ట్ ఇన్ఫోటెక్, గ్లోబల్ డేటా ఆర్ట్స్, ఎంఎస్ డిజిటల్ గ్రో, ఇన్‌స్పైరీ డిజిటల్ మాధ్యమాల ద్వారా విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా కోల్‌కతా, అలాగే ఢిల్లీ సహా పలు ఉత్తరాది రాష్ట్రాల్లో డేటా విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. విక్రయానికి పెట్టిన డేటాలో నీట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు, గృహిణులు, వాట్సాప్, ఫేస్‌బుక్ యూజర్ల సమాచారం మాత్రమే కాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, డీమ్యాట్ ఖాతాదారులు, హైనెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్ఎన్ఐ) వంటి 140 కేటగిరీలకు చెందిన వారి డేటా ఉండటం విశేషం. ఈ డేటాలో పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలతో పాటు బ్యాంకు ఖాతాల నంబర్లు, సీవీవీ, పిన్, ఆధార్, పాన్ కార్డు నంబర్లు, రుణాలు, ఇతరత్రా వ్యక్తిగత సమాచారం కూడా ఉండటంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డేటాలో రక్షణ శాఖకు చెందిన ఉద్యోగుల పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లతో పాటు ర్యాంకులు, ఈ–మెయిల్ ఐడీలు, ప్రస్తుత పోస్టింగ్ వంటి కీలకమైన సమాచారం కూడా దాగి ఉండటం సంచలనం సృష్టించింది. డేటా లీకు కేసును ఈడీకి బదిలీ చేయలేదని సైబరాబాద్ కమిషనరేట్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ కేసు విషయమై ఈడీ అధికారులు తమతో సమావేశం కాలేదన్నారు.

డిమాండ్ ఫుల్.. వ్యాక్సిన్ నిల్

1.63 కోట్ల బూస్టర్ డోసులు పెండింగ్

- అందుబాటులో ఉన్నది కేవలం 2 వేలే
- చేతులెత్తేస్తున్న రాష్ట్ర వైద్య యంత్రాంగం

సాక్షి, హైదరాబాద్: దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నాయని కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేస్తోంది. వైరస్ నియంత్రణకు పరీక్షలు విరివిగా నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. ప్రజలు కూడా వ్యాక్సిన్ తప్పనిసరిగా వేసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. కానీ రాష్ట్రంలో కరోనా వ్యాక్సిన్ డోసులు మాత్రం అందుబాటులో లేవు. బూస్టర్ (ప్రికాషన్) డోసు వేసుకోవాల్సిన వారే కోటిన్నర మందికి పైగా ఉండగా, వ్యాక్సిన్లు కేవలం రెండువేల లోపే అందుబాటులో ఉన్నాయి. కరోనా టీకాలు వేసుకునేందుకు ఏ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా డోసులు లేవని అధికారులు చెబుతున్నారు. కేంద్రాన్ని అడిగామని అధికారులు చెబుతున్నారే కానీ టీకాలు తెప్పించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి.

1.63 కోట్ల బూస్టర్ డోసులు పెండింగ్...

రాష్ట్రంలో 7.75 కోట్ల వ్యాక్సిన్ డోసులు వేశారు. మొదటి, రెండు, బూస్టర్ డోసులు కలిపి ప్రభుత్వమే 7.30 కోట్లు డోసులు అందించింది. అందులో మొదటి డోసు 3.24 కోట్ల మందికి వేయగా, 3.15 కోట్ల మందికి రెండో డోసు వేశారు. అందులోనూ కేవలం 1.35 కోట్ల మంది మాత్రమే ప్రికాషన్ డోసు వేయించుకున్నారు. ఇంకా 1.63 కోట్ల మంది బూస్టర్ డోసు వేయించుకోవాల్సి ఉంది. వారందరికీ ప్రికాషన్ డోసు పెండింగ్‌లో ఉంది. మొదటి డోసు వేసుకోవాల్సిన వారు 2,469 మాత్రమే ఉండగా, రెండో డోసు వేసుకోవాల్సిన వారు 8.88 లక్షల మంది ఉన్నారు. బూస్టర్ డోసు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. వారందరికీ కరోనా వ్యాక్సిన్ వేయాలంటే 1.63 కోట్ల డోసులు అవసరం. కానీ రాష్ట్రంలో ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ వద్ద 1,970 వ్యాక్సిన్లు మాత్రమే ఉన్నాయని వైద్య, ఆరోగ్యశాఖ నివేదిక తెలిపింది.



చేతులెత్తేస్తున్న యంత్రాంగం...


కాగా, వ్యాక్సిన్ కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు అనేకమంది వెళ్తున్నా టీకాలు లేవన్న సమాధానమే వస్తుంది. ఈ విషయంలో అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఒకవైపు కరోనాపై జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాక్సిన్ వేసుకోవాలని చెబుతున్న అధికారులు, టీకాలు అందుబాటులో ఉంచకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కోటిన్నరకు పైగా డోసులు డిమాండ్ ఉండగా, కేవలం రెండు వేల లోపే స్టాకు ఉంచడం నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెబుతున్నారు. కరోనాను నియంత్రించడంలో వ్యాక్సిన్ కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే.

లక్ష ర్యాంకు దాటినా.. పీజీ మెడికల్ సీటు

- గతేడాది 1.09 లక్షల ర్యాంకుకు సీటు
- ఈసారి కట్ ఆఫ్ పెరగడంతో మరింతగా పెరిగే అవకాశం
- ఈ ఏడాది మరో 40 కొత్త పీజీ సీట్ల పెరుగుదల
- కాళోజీ ఆరోగ్య వర్సిటీ అధికారుల విశ్లేషణ

సాక్షి, హైదరాబాద్: లక్ష ర్యాంకు దాటిన వారికి కూడా రాష్ట్రంలో పీజీ మెడికల్ కోర్సుల్లో సీట్లు సులువుగానే లభించనున్నాయి. గతేడాది కూడా లక్షకు పైగా ర్యాంకు వచ్చిన విద్యార్థులు పీజీ మెడికల్‌లో సీట్లు పొందారు. గతేడాది కంటే ఈసారి నీట్ పీజీ కటాఫ్ మార్కులు పెరగడంతో మరింతగా సీట్లు పొందే అవకాశం వచ్చింది. ఇటీవల పీజీ మెడికల్ నీట్ ఫలితాలు వెలువడిన సంగతి విదితమే.

- 2022–23లో నీట్ పీజీ మొత్తం మార్కులు 800 కాగా, జనరల్/ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 275 మార్కులు కటాఫ్‌గా నిలిచాయి. జనరల్ దివ్యాంగుల్లో 260 కటాఫ్, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో 245 కటాఫ్‌గా ఉంది. కాగా, ఈసారి జనరల్/ ఈడబ్ల్యూఎస్ లో కటాఫ్ మార్క్ 291, జనరల్ దివ్యాంగుల్లో 274, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీలో 257 కటాఫ్‌గా నిర్ణయించారు. దీంతో గతేడాది కంటే ఈసారి ర్యాంకు ఎక్కువ వచ్చిన వారికి కూడా సీట్లు వచ్చే అవకాశం ఉంది. అంతేగాక గతేడాది కంటే ఈసారి దేశంలోనూ, రాష్ట్రంలోనూ పీజీ మెడికల్ సీట్ల సంఖ్య పెరిగింది.
- దేశవ్యాప్తంగా 2023–24లో 45,471 పీజీ మెడికల్, 4,997 డీఎన్‌బీ సీట్లున్నాయి. తెలంగాణలో 2,501 పీజీ మెడికల్ సీట్లు ఉన్నాయి. ఈసారి మరో 40 పీజీ సీట్లు పెరుగుతాయని కాళోజీ వర్గాలు వెల్లడించాయి.



- 2022–23లో కొన్ని కాలేజీల్లో ర్యాంకులు, సీట్లు ఇలా
- ఆదిలాబాద్ రిమ్స్‌లో నీట్‌లో 1,09,138 ర్యాంకు వచ్చిన ఎస్సీ విద్యార్థినికి ఎండీ ఫార్మకాలజీలో సీటు వచ్చింది.
- 1,08,083 ర్యాంకు వచ్చిన ఎస్సీ విద్యార్థినికి నిమ్స్‌లో బయో కెమిస్ట్రీలో సీటు వచ్చింది.
- 1,00,622 ర్యాంకు వచ్చిన బీసీ డీ విద్యార్థికి ఉస్మానియాలో ఎండీ ఫిజియాలజీలో సీటు వచ్చింది.
- 1,00,055 ర్యాంకు సాధించిన బీసీ బీ అభ్యర్థినికి ఉస్మానియాలో ఎండీ ఫోరెన్సిక్ మెడిసిన్‌లో సీటు వచ్చింది.
- 1,07,714 ర్యాంకు వచ్చిన ఎస్సీ విద్యార్థినికి మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫార్మకాలజీలో సీటు వచ్చింది.

నాన్ క్లినికల్ పీజీ మెడికల్ సీట్లపై నీలినీడలు

ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు మెడికల్ పీజీ చేయాలని ఉవ్విళ్లూరుతుంటారు. తద్వారా స్పెషలిస్టు వైద్యులుగా తమ కెరీర్‌ను మలుచుకుంటారు. అందువల్ల ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో క్లినికల్ విభాగంలోని సీట్లలో రూ.కోట్లు ఖర్చు చేసి చేరుతుంటారు. ఒక్క సీటు కూడా మిగలదు. కానీ నాన్ క్లినికల్ పీజీ సీట్లను పట్టించుకునే నాథుడే లేడు. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఉండే కన్వీనర్ కోటా సీట్లలోనూ విద్యార్థులు చేరడం లేదంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. లక్ష ర్యాంకు సాధించిన వారికి నాన్ మెడికల్ సీట్లలోనే అవకాశాలున్నాయి. అయితే చాలామంది అనాసక్తి చూపడంతో అవి నిండడం లేదు. దేశ వ్యాప్తంగా 2022–23 వైద్య విద్యా సంవత్సరంలో 1,311 నాన్ మెడికల్ సీట్లు మిగిలిపోయాయని కేంద్రం ఇటీవల వెల్లడించింది. అందులో తెలంగాణలో దాదాపు 150 వరకు నాన్ మెడికల్ సీట్లు మిగిలినట్లు అంచనా వేశారు.

క్లినికల్ సీట్లపైనే అందరి దృష్టి

అనాటమీ, ఫిజియాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పెథాలజీ, మైక్రో బయాలజీ, ఎస్పీఎం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ వంటివి నాన్ క్లినికల్ కోర్సులు. ఈ కోర్సులు చేసినవారికి ప్రధానంగా మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీగా చేయడానికి వీలుంటుంది. ఫోరెన్సిక్ మెడిసిన్ వంటి వాటికి ఇతరత్రా అవకాశాలుంటాయి. కానీ క్లినికల్ కోర్సుల మాదిరి నాన్ క్లినికల్ సబ్జెక్టులకు డిమాండ్ ఉండదు. కొన్నేళ్లుగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఈ కోర్సులు చేసినవాళ్లు ఖాళీగా ఉంటున్నారు. ఇటీవల ఖాళీల భర్తీ జరుగుతున్నా, వైద్య విద్యార్థులు క్లినికల్ సీట్ల పైనే దృష్టిసారిస్తున్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 31-3-2023

ఫ్యాషన్



● ఇటీవల జరిగిన లాక్మే ఫ్యాషన్ వీక్‌లో ఖాదీ కలనేత డిజైన్స్

కలర్స్, కట్స్, ప్రింట్లు, డిజైన్లు
ఫ్యాషన్ ప్రపంచంలో కొత్తదనాన్ని తీసుకురావడానికి
డిజైనర్లు ఎప్పుడూ ప్రయత్నిస్తుంటారు.
ప్రాంతీయ డిజైన్ల నుంచి
అంతర్జాతీయ బ్రాండ్స్ వరకు
రీసెంట్ లుక్స్ కోసం
శోధన ఉంటూనే ఉంటుంది.
జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద
ఇటీవల జరుగుతున్న ఫ్యాషన్ వీక్స్
వేటిని పరిచయం చేస్తుందో తెలుసుకుందాం.

సౌకర్యమే స్టైల్



● లండన్ డిజైనర్ స్టయిన్ గోయా సృష్టి



● మిలన్ ఫ్యాషన్ వీక్‌లో ఇక్కత ర్యాప్ డ్రెస్





● సౌకర్యం... మదర్ – డాటర్ సమ్మర్ కలెక్షన్

ఆర్గానిక్ ఫ్యాబ్రిక్‌కే అగ్రస్థానం



దేశీయ, అంతర్జాతీయ డిజైన్స్ చూస్తే ఫ్యాషన్ రంగంలో ఎప్పుడైనా బ్రైట్ కలర్స్, కొత్త ప్రింట్స్, కొత్త కట్స్‌కి అధిక ప్రాధాన్యమిస్తారు. అయితే, ఏ వయసు వాళ్లు వాటిని ఎలా ధరిస్తున్నారు అనేది కూడా ముఖ్యమే. ఇప్పుడు ఫ్యాషన్ రంగాన్ని మాత్రం కరోనా ముందు–కరోనా తర్వాత అని విభజించి చూడచ్చు. ప్రజల ధోరణిలో కూడా మార్పు వచ్చింది. ఇప్పుడు సౌకర్యంగా దుస్తులు ధరించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్గానిక్ ఫ్యాబ్రిక్స్, కంఫర్ట్ డ్రెస్సింగ్, బ్రైట్ కలర్స్... ఇవి ప్రపంచం మొత్తం కరోనా ఫ్రీ టైమ్‌లో తీసుకున్న నిర్ణయాలు అనేది దేశీయ, అంతర్జాతీయ ఫ్యాషన్ వీక్‌ల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా రసాయనాలు లేని సస్టేయినబుల్ ఫ్యాబ్రిక్‌కే అగ్రస్థానం. పార్టీలకు కూడా ఆర్గానిక్ ఫ్యాబ్రిక్‌నే ఇష్టపడుతున్నారు. ఇప్పుడు ఏ పెద్ద బ్రాండ్ తీసుకున్నా ఆర్గానిక్ ఫ్యాబ్రిక్ డిజైన్స్ విరివిగా వచ్చేశాయి. కట్స్, ప్రింట్లు, కలర్ కాంబినేషన్స్ కూడా అలాగే ఎంచుకుంటున్నారు. దీంతో మేం కూడా సౌకర్యవంతమైన డిజైన్స్‌కే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నాం.

– హేమంత్ సిరి, ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్

వారసత్వ డిజైన్లు

ఆర్గానిక్ ఫ్యాబ్రిక్, సౌకర్యవంతమైన డిజైనింగ్ తర్వాత స్థానిక హస్తకళ డిజైన్స్‌కి అవకాశాలు బాగా పెరిగాయి. సంప్రదాయ కళలను బాగా ఇష్టపడుతున్నారు. దీంతో మరుగున పడిపోయిన వారసత్వ కళలు తిరిగి జీవం పోసుకుంటున్నాయి. జాతీయ, అంతర్జాతీయ డిజైనర్లు కూడా తమ స్థానిక హస్తకళల డిజైన్స్‌ని విస్తృతంగా మార్కెట్లోకి తీసుకువస్తున్నారు.

మనదైన ప్రభావం

ఫ్యాషన్ ప్రపంచంపై భారతదేశం ప్రభావం గురించి ఆలోచించినప్పుడు రితూకుమార్, సబ్యసాచి, మనీష్ మల్హోత్రా.. వంటి ప్రఖ్యాత డిజైనర్ల డిజైన్లు, తలపాగాలు కనిపిస్తుంటాయి. అలాగే, గ్లోబల్ టెక్స్‌టైల్ గురించి చూసినప్పుడు భారతదేశంలోని కుటుంబాలలో తల్లులు, బామ్మలు ధరించే చీరల థీమ్‌ను తమ డిజైన్స్‌లో తీసుకుంటున్నారు. ఆర్గానిక్, సస్టెయినబుల్ ఫ్యాబ్రిక్‌కు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. ఇటీవల జరిగిన మిలన్, ప్యారిస్, మన లాక్మే ఫ్యాషన్ వీక్‌లను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. పదిహేడవ శతాబ్దం నుండి నేటి వరకు పాశ్చాత్య ఫ్యాషన్ ట్రెండ్‌పై భారతదేశ ప్రభావం ఉందని తెలుస్తోంది. అలాగే, అంతర్జాతీయ డిజైనర్ల నుంచి మనవాళ్లు స్ఫూర్తి పొందే విషయాల్లో ఫ్యాబ్రిక్స్ ఎంపికలోనూ, సంప్రదాయ డిజైన్స్‌లోనూ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనేది వాస్తవం.

ఇన్నోవేటర్

వారి గౌరవం కోసం

లేచి బాత్‌రూమ్‌కు సెకన్‌లో
చేరుకోగలిగే సాధారణ మనుషులకు...
బాత్‌రూమ్‌కు చేరడం పెద్ద అవస్థగా
ఉండే దివ్యాంగుల బాధ అర్థం కాదు.
కాలకృత్యాల కోసం మరొకరిపై ఆధారపడటం
దివ్యాంగులను తీవ్ర ఇబ్బంది పెట్టే ప్రధానాంశం.
అందుకే కోయంబత్తూరుకు చెందిన శ్రుతి
సెల్ఫ్ క్లీనింగ్ బ్యాగ్స్ ఉన్న
వీల్ చైర్‌ను ఆవిష్కరించింది.



● శ్రుతి



● శ్రుతి ఆవిష్కరించిన వీల్ ఛైర్

‘ఈ వీల్‌చైర్ కొన్న ఒక దివ్యాంగ పెద్దాయన నాకు కాల్ చేసి నా బెంగ తీరిందమ్మ. ఇక నాకు ఇష్టమైనది తినొచ్చు అన్నాడు సంతోషంగా’ అంది శ్రుతి బాబు.

వీల్ చైర్‌కూ ఇష్టమైనది తినడానికీ ఏమిటి సంబంధం అనే సందేహం రావచ్చు. శ్రుతికి కూడా వచ్చింది. ‘అదేంటి అని అడిగాను. అంతే కదమ్మా. ఇంతకు ముందైతే ఏం తింటే ఎప్పుడు టాయిలెట్ వస్తుందోనని భయపడేవాణ్ణి. తగ్గించి తినేవాణ్ణి. ఈ కుర్చీ వల్ల ఎన్ని సార్లయినా తినొచ్చు... ఎన్ని సార్లు వచ్చినా ఇబ్బంది పడకుండా ఉండొచ్చు అన్నాడతను’ అంటుంది శ్రుతి.

శ్రుతి తను తయారు చేసిన వీల్‌చైర్‌కు ‘సహాయత’ అనే పేరు పెట్టింది. టాయిలెట్ పాన్ ఉన్న వీల్‌చైర్లు ఇప్పటికే మార్కెట్‌లో ఉన్నాయి. అయితే వాళ్లు దానిని ఉపయోగించాక లేస్తే తప్ప ఆ పాన్ బయటకు తీసి క్లీన్ చేయడానికి లేదు. శ్రుతి తయారు చేసిన వీల్‌చైర్ అలా కాదు. కూర్చున్నవారు కూర్చున్నట్టు ఉండగానే మల/మూత్ర విసర్జన చేయొచ్చు. బటన్ నొక్కితే కుర్చీకే ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి నీళ్లు తీసుకున్న స్ప్రేయర్ క్లీన్ చేస్తుంది. లేచే అవసరం లేకుండానే కుర్చీ వెనుక నుంచి బౌల్‌ను తొలగించి శుభ్రం చేయవచ్చు. ఆటోమేటిక్ క్లీనింగ్ కోసం బ్యాటరీ బటన్ యూజ్ చేయాలి. ఈ బ్యాటరీ ఒక సారి చార్జ్ చేస్తే నెల రోజులు పని చేస్తుంది. అంతే కాదు ఈ వీల్‌చైర్ స్ట్రెచర్‌లా కూడా పని చేస్తుంది.

‘అందుకే నా ప్రాడెక్ట్ షార్క్‌ట్యాంక్ సీజన్2లో కోటి రూపాయల డీల్ గెలుచుకుంది. అప్పటి నుంచి విపరీతంగా ఆర్డర్లు వస్తున్నాయి’ అంటుంది శ్రుతి.

కోయంబత్తూరుకు చెందిన శ్రుతి బాబు బయోమెడికల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ఇంజనీరింగ్ చేసింది. తండ్రి కెకె బాబు మెకానికల్ ఇంజనీర్. బి.టెక్ అయ్యాక ‘బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్’ (బి.ఐ.ఆర్.ఏ.సి) ఫెలోషిప్ పొందిన శ్రుతి అందులో భాగంగా కోయంబత్తూరులోని గంగా హాస్పిటల్‌కు వెళ్లినప్పుడు ఒక దృశ్యం కదిలించింది.

‘ఒక పెరాలిసిస్ పేషెంట్‌ను అతని ఇద్దరి కూతుళ్లు బాత్‌రూమ్‌కు తీసుకెళ్లడానికి అవస్థ పడుతున్నారు. చేర్చడం ఒక ఇబ్బంది అయితే వాడాక అతన్ని శుభ్రం చేయడం ఇంకో ఇబ్బంది. అతను ఏడుస్తూ ఇలా నా కూతుళ్ల మీద ఆధారపడటం కంటే చచ్చిపోవడం మేలు అన్నాడు. ఆ మాటలు నా మీద ముద్ర వేశాయి. వృద్ధులు, దివ్యాంగులు, యాక్సిడెంట్లకు గురైన వారు, ఆపరేషన్లు చేయించుకున్నవారు, జబ్బుపడి కోలుకుంటున్నవాళ్లు కదల్లేక, బాత్‌రూమ్‌కు తమకు తాము వెళ్లే శక్తి లేక, సొంతగా శుభ్రం చేసుకునేందుకు అవయవాల సాయం లేక ఇబ్బంది పడుతుంటారు. వారు వీల్‌చైర్‌లో ఉన్న చోట ఉండగానే టాయిలెట్ అవసరాలు తీర్చుకునేలా వీల్ చైర్ తయారు చేయాలని నిశ్చయించుకున్నాను’ అంది శ్రుతి.

తండ్రితో కలిసి ఆమె తన ప్రయత్నాలు మొదలెట్టింది. ‘మొత్తం 118 సార్లు ప్రయత్నం చేశాం. ఐదు ప్రొటోటైప్‌లు తయారు చేశాం. రోగుల మీద ప్రయోగించాక చివరకు సంతృప్తికరమైన మోడల్‌కు వచ్చాం’ అంటుంది శ్రుతి బాబు.

నంజుకు తిందాం

వంటిల్లు

ఎండలు మండిపోతున్నాయి.
అందుకే... ఎండబెట్టి వండుకునే వడియాలను చేద్దాం.
ఇంతకీ ఇవి అర్కపక్వాలా? అగ్నిపక్వాలా?
ఎండలో ఎండుతాయి... మంటకు పొంగుతాయి.
వంటకాలకు తోడయ్యి... జిహ్వను సంతోషపరుస్తాయి.
సంతృప్తికరమైన భోజనానికి మినిమమ్ గ్యారంటీనిస్తాయి.





ఆవిరి వడియాలు

కావలసినవి: బియ్యం– అరకేజీ ; పచ్చిమిర్చి – 8 ; జీలకర్ర– 2 టీ స్పూన్‌లు ; అల్లం తరుగు– 2 టేబుల్ స్పూన్‌లు ; ఉప్పు – టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి ; ఇంగువ– చిటికెడు (ఇష్టమైతేనే) ; నూనె – టేబుల్ స్పూన్.

తయారీ: ● బియ్యాన్ని కడిగి నాలుగు గంటల సేపు నానబెట్టాలి. ఆ తరవాత తగినంత నీటిని వేస్తూ మెత్తగా దోశల పిండిలా రుబ్బాలి. రుబ్బేటప్పుడు పచ్చిమిర్చి, అల్లం, జీలకర్ర, ఇంగువ, ఉప్పు వేయాలి. ● రెండు లీటర్ల నీరు పట్టే పాత్ర తీసుకుని అందులో ఒకటిన్నర లీటరు నీటిని పోసి మరిగించాలి. పాత్ర మీద కచ్చితంగా అమరే ప్లేట్ పెట్టాలి. ఆ ప్లేట్ పైన రెండు చుక్కల నూనె రాయాలి. ముందుగా రుబ్బి సిద్ధంగా ఉంచిన పిండిని చిన్న గరిటెతో తీసుకుని ప్లేట్ మీద వేయాలి. వెంటనే మరొక ప్లేట్‌ని మూతగా పెట్టాలి. పిండిలో తేమ ఆరిపోతుంది. ఇప్పుడు స్పూన్ లేదా అట్లకాడ సాయంతో ప్లేట్ నుంచి వేరు చేయాలి. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి. పాత్రలో నీరు అయిపోతే మళ్లీ పోసుకోవాలి. అలాగే ప్లేట్ నుంచి వేరు చేసిన వడియాలను పొడి వస్త్రం లేదా పాలిథిన్ షీట్ మీద వేసి ఐదారు గంటల సేపు ఎండబెట్టాలి. ఇవి ఏడాది వరకు నిల్వ ఉంటాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు వేయించుకోవడమే.



టొమాటో జొన్న అప్పడాలు

కావలసినవి: టొమాటోలు –పావు కేజీ ; జొన్న పిండి– అర కేజీ ; పచ్చిమిర్చి –10 ; వెల్లుల్లి రేకలు– పది ; జీలకర్ర– టేబుల్ స్పూన్ ; ఉప్పు– టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి ; నూనె – టేబుల్ స్పూన్.

తయారీ: ● టొమాటోలు, వెల్లుల్లి, పచ్చిమిర్చి, జీలకర్ర కలిపి మిక్సీ జార్‌లో గ్రైండ్ చేయాలి. ● వెడల్పాటి పాత్రలో అర టీ స్పూన్ నూనె వేసి ఆ తర్వాత అర లీటరు నీటిని పోసి మరిగించి అందులో ఉప్పు, జొన్నపిండి, టొమాటో పేస్ట్ వేసి కలిపితే అప్పడాల పిండి రెడీ. చపాతీల పిండిలా ముద్దగా ఉండాలి. ● చపాతీల పీట మీద పాలిథిన్ షీట్ పరిచి రెండు చుక్కల నూనె రాయాలి. ఇప్పుడు అప్పడాల పిండిని చిన్న గోళీలుగా చేసి ఒక్కొక్క గోళీని పాలిథిన్ షీట్ మీద వేసి వేళ్లతో వత్తాలి. ఇలా వత్తిన అప్పడాన్ని ఎండలో పలుచటి వస్త్రం మీద వేసి ఎండబెట్టాలి. పిండినంతటినీ ఇలాగే చేసుకోవాలి. ఒకవైపు ఎండిన తర్వాత తిరగేసి రెండో వైపు కూడా బాగా ఎండనివ్వాలి. బాణలిలో అప్పడం మునిగేటట్లు నూనె పోసి మరిగించి ఒక్కొక్క అప్పడాన్ని వేయించాలి. ● వీటిని వడియాల్లాగ డబ్బాలో నేరుగా పోస్తే అప్పడాలు విరిగిపోతాయి. కాబట్టి ఎండిన తర్వాత చక్కగా అమర్చి డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఏడాదిపాటు నిల్వ ఉంటాయి. అప్పడాలు మెత్తబడకుండా ఉండాలంటే నిల్వ చేసిన డబ్బాలో అడుగున గుప్పెడు మినప్పప్పు వేయాలి.



మినప వడియాలు

కావలసినవి: మినప్పప్పు – అర కేజీ ; పచ్చి మిర్చి – 7 లేదా 8 ; జీలకర్ర– టీ స్పూన్ ; అల్లం– రెండు అంగుళాల ముక్క ; ఉప్పు – టేబుల్ స్పూన్.

తయారీ: ● మినప్పప్పు కడిగి మునిగేలా నీటిని పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే గ్రైండర్‌లో మెత్తగా రుబ్బాలి. మినప్పప్పు మెదిగేటప్పుడు అందులో ఉప్పు, అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర వేయాలి. మొత్తం మెత్తగా మెదిగిన తరవాత ఒక గిన్నెలోకి తీసుకుని కలిపితే వడియాల పిండి రెడీ. ● తడి వస్త్రాన్ని లేదా పాలిథిన్ షీట్‌ని ఎండలో పరిచి దాని మీద వడియాలు పెట్టుకోవాలి. ఒక గిన్నెలో నీటిని తీసుకుని అందులో స్పూన్‌ని ముంచి అప్పుడు పిండి తీసుకుంటే పిండి సులువుగా జారుతుంది. చేత్తో పెట్టాలన్నా అంతే... వేళ్లను తడుపుకుంటూ పెట్టాలి. రెండు రోజుల పాటు ఎండనివ్వాలి. మూడవ రోజు వలిచి మళ్లీ ఎండబెట్టాలి. అప్పుడు గలగలలాడుతాయి. ఏడాది పాటు నిల్వ ఉంటాయి. నూనె వేడి చేసి పచ్చి వడియాలను నూనెలో వేసి రెండు వైపులా దోరగా వేగిన తరవాత తీసేయాలి. ఈ వడియాలను పెద్ద మంట మీద వేయించరాదు. మీడియం ఫ్లేమ్‌లో వేయిస్తే చక్కగా వేగి కరకరలాడుతాయి.



రవ్వ-కొత్తిమీర వడియాలు

కావలసినవి: బొంబాయి రవ్వ (ఉప్మారవ్వ)– పావు కేజీ ; కొత్తిమీర తరుగు – వందగ్రాములు ; ఎండు మిర్చి – 2 (పలుకుగా పొడి చేయాలి) ; ఉప్పు – టీ స్పూన్ ; జీలకర్ర– టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; నూనె – టీ స్పూన్ ; నీరు – 6 కప్పులు.

తయారీ: ● మందపాటి బాణలిలో రవ్వ, మిరప్పొడి, ఉప్పు, జీలకర్ర, ఇంగువ, నూనె, నీరు పోసి గరిటెతో కలుపుతూ మరిగించాలి. మిశ్రమం దగ్గరగా అయిన తర్వాత కొత్తిమీర తరుగు వేసి కలపాలి. కొత్తిమీర పచ్చిదనం పోయే వరకు ఉడికించి స్టవ్ ఆపేయాలి. ● వేడి తగ్గిన తర్వాత పాలిథిన్ పేపర్ లేదా తడి నూలు వస్త్రం మీద ఈ మిశ్రమాన్ని ఒక్కో గరిటె వేసి దోసెలాగ పలుచగా చేయాలి. ఇవి ఒక్క రోజులోనే ఎండిపోతాయి. ఎండలో పెట్టడం కుదరకపోతే గదిలో కూడా పెట్టుకోవచ్చు. పలుచగా ఉంటాయి. కాబట్టి వాతావరణంలో వేడికే ఆరిపోతాయి. నెల రోజుల పాటు తాజాగా ఉంటాయి.

వైరల్



సైరా స్పైడర్‌మ్యాన్ దోశ

ఇన్‌స్టాగ్రామ్ వీడియో క్లిప్‌లో కనిపించిన ఆ మహిళ పేరేమిటో తెలియదుగానీ ఆమె చేసిన స్పైడర్‌మ్యాన్ దోశ వైరల్ అయింది. చెన్నైలోని అన్నానగర్‌లోని తన హోటల్‌లో నూనె, గుడ్లు, మసాల... మొదలైనవాటిని ఉపయోగించి ఆమె స్పీడ్‌స్పీడ్‌గా స్పైడర్‌మ్యాన్ దోశ వేస్తున్న దృశ్యం నెటిజనులను తెగ ఆకట్టుకోవడమే కాదు నోట్లో నీళ్లూరించేలా చేసింది. కొందరు దీనికి ‘శాండ్‌విచ్ దోశ’ అని కూడా పేరు పెట్టుకున్నారు. రెండు నెలల క్రితం పోస్ట్ అయిన ఈ వీడియోక్లిప్ తాజాగా 16.2 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

ఇంటిప్

అల్లం పేస్ట్.. ఆవ నూనె...


సాధారణంగా అల్లం పేస్ట్‌ను ఎప్పటికప్పుడు తాజాగా చేయడంతో పాటు కొంత స్టోర్ చేసి కూడా పెట్టుకుంటూ ఉంటాం. ఇది పాడవకుండా ఉండేందుకు అందులో చెంచా ఆవ నూనె వేయాలి. ఇలా చేయడం వల్ల అల్లం పేస్ట్ పాడవకుండా ఎక్కువ కాలం తాజాగా ఉంటుంది.



● ఇంగ్లిష్ ఇడియమ్స్

బాటెన్ డౌన్ ది హ్యాచెస్

ఎదురయ్యే సమస్య, రాబోయే కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రిపేర్‌గా ఉండమని చెప్పే సందర్భంలో వాడే ఇడియమ్ బాటెన్ డౌన్ ది హ్యాచెస్.



ఉదా: ఆఫ్టర్ మంత్స్ ఆఫ్ ఫీయర్ ఎబౌట్ ది ఎకానమీ కన్స్యూమర్స్ ఆర్ రెడీ టూ బాటెన్ డౌన్ ది హ్యాచెస్

మూలాల్లోకి వెళితే... వన్స్ అపాన్ ఏ టైమ్ సముద్ర నావికులు ఈ మాటను ఉపయోగించేవారు.

'హ్యాచెస్' అనేది నావకు సంబంధించిన ఓపెనింగ్ డెక్ స్పేస్. వాతావరణం సరిగ్గా లేనప్పుడు చెక్కపలకలతో ఓపెన్ డెక్‌ను మూసివేసేవారు. దీన్ని 'బాటింగ్ డౌన్' అంటారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు హ్యాచెస్‌ను మూసివేయాల్సిందిగా సిబ్బందిని కెప్టెన్ ఆదేశించేవాడు. తరువాత కాలంలో ఈ ఎక్స్‌ప్రెషన్ సముద్రం దాటి రోజు వారి జీవితంలోకి కూడా వచ్చింది.

● టెక్.. టాక్

హువావే పాడ్ 11 (2023)



సైజ్: 11-అంగుళాలు రిజల్యూషన్: 2560×1600 పిక్సెల్స్; బరువు: 480 గ్రా. బ్యాటరీ: 7,250 ఎంఏహెచ్
ర్యామ్: 8జీబి ఇంటర్నల్ మెమోరీ: 128జీబి
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
కలర్స్: బ్లాక్, ఐలాండ్ బ్లూ, క్రిస్టల్ వైట్, పర్పుల్

షియోమి టీవీ స్టిక్



లేటెస్ట్ ఎంట్రీ లెవెల్ 4కే మీడియా స్ట్రీమింగ్ డివైజ్ షియోమి టీవీ స్టిక్. ఈ కొత్త మోడల్ పాపులర్ ఆడియో, వీడియోలను సపోర్ట్ చేస్తుంది ● **లెంత్:** 106.8ఎంఎం ● **విడ్త్:** 29.4 ఎంఎం ● **బరువు:** 42.8 గ్రా. ● **కలర్:** బ్లాక్ ● 2జీబి ర్యామ్ అండ్ 8జీబి స్టోరేజ్

ఆర్క్ బ్రౌజర్



క్రోమియం బేస్డ్ కొత్త బ్రౌజర్ ఆర్క్. దీనిలోని కమాండ్ బార్ ఫీచర్‌తో బ్రౌజ్ సెట్టింగ్స్‌లో వేగంగా మార్పులు చేసుకోవచ్చు. ఇక 'స్ప్లిట్ వ్యూ' అనేది ఆర్క్ స్పెషల్ ఫీచర్. ఒకేసారి మల్టీపుల్ టాస్క్‌లకు ఉపయోగపడుతుంది. 'ఇట్స్ అవర్ విండో టు ఎవ్రీథింగ్ ఆన్ ది ఇంటర్నెట్' అంటూ 'ఆర్క్'ను తీసుకువచ్చింది న్యూయార్క్‌కు చెందిన 'ది బ్రౌజర్' కంపెనీ. కొలాబరేటివ్ ఫీచర్స్, పవర్‌ఫుల్ ఫంక్షనాలిటీ తన ప్రత్యేకతగా చెబుతోంది ది బ్రౌజర్.

ఇన్‌స్టా 360

పాపులర్ కెమెరా కంపెనీ ఇన్‌స్టా 360 ఏఐ-ట్రాకింగ్ స్మార్ట్‌ఫోన్ స్టెబిలైజర్ గురించి ప్రకటించింది. కంటెంట్ క్రియేటర్‌లకు బాగా ఉపయోగపడే పరికరం ఇది. షేక్-ఫ్రీ షాట్స్ దీని ప్రత్యేకత. గెశ్చర్ కంట్రోల్, ట్రాకింగ్ రికవరీ, డీప్ ట్రాక్... మొదలైన ఫీచర్‌లు ఉన్నాయి. **బరువు:** 130-300 గ్రా. బ్లూటూత్ 5.0 కనెక్టివిటీ **బ్యాటరీ:** 2,900 ఎంఏహెచ్



విజయం సాధించడంలో ఎంత కిక్ ఉందో.... ఇతరులను విజయం సాధించేలా చేయడంలో అంత కంటే ఎక్కువ కిక్ ఉంది! ఎడ్యుకేషన్ స్టార్టప్ 'ప్రిప్‌ఇన్‌స్టా'తో ఆశయ్ మిశ్రా, కౌశిక్, మనీష్ అగర్వాల్‌లు విజయం సాధించడమే కాదు యువత తమ కలలు సాకారం చేసుకోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు...


విజయ త్రయం: కౌశిక్, మనీష్ అగర్వాల్, ఆశయ్ మిశ్రా

గెలుపు గ్రామర్

కౌశిక్, ఆశయ్ మిశ్రా, మనీష్ అగర్వాల్‌లు వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వివిటీ యూనివర్శిటీ, తమిళనాడు)లో కలిసి చదువుకున్నారు. చదువు పూర్తయిన తరువాత బెంగళూరులో వేరు వేరు కంపెనీలలో ఉద్యోగాలు చేసేవారు.

'చాలామంది స్టూడెంట్స్‌లో ప్రతిభ ఉన్నా తమ ఉద్యోగ లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. దీనికి కారణం వారిలో సాంకేతిక నైపుణ్యం లేకపోవడంతో పాటు కోరుకున్న ఉద్యోగాన్ని సాధించడంలో అనుసరించాల్సిన వ్యూహంపై అవగాహన లేకపోవడం...' ఇలాంటి ఆలోచనలను రెగ్యులర్‌గా బ్లాగ్‌లో రాసేవాడు గూగుల్ కంపెనీలో పనిచేస్తున్న కౌశిక్.

తన బ్లాగ్ ఎంత హిట్ అయిందంటే సంవత్సరం తిరిగేసరికల్లా నెలకు లక్ష వ్యూలు వచ్చేవి.

ఆ టైమ్‌లోనే కౌశిక్‌కు 'ఫ్లిప్‌కార్ట్' నుంచి మంచి ఉద్యోగ అవకాశం వచ్చింది. అయితే దాన్ని కాదనుకొని ఇద్దరు మిత్రులతో మాట్లాడాడు.

అలా ఈ ముగ్గురి మేధో మథనం నుంచి పుట్టిందే... ప్రిప్‌ఇన్‌స్టా.

ప్రిప్‌ఇన్‌స్టా(ప్రిపేర్ ఫర్ ప్లేస్‌మెంట్స్ ఇన్‌స్టంట్లీ) అనేది వోటీటీ ఫార్మట్ ప్లాట్‌ఫామ్. యూజర్‌లు డబ్బులు చెల్లించి ఫిక్స్‌డ్ టైమ్‌లో(నెలలు లేదా సంవత్సరాలు) 200 కోర్సులతో యాక్సెస్ కావచ్చు. అప్‌స్కిలింగ్ సబ్జెక్ట్‌లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్ (లాజిక్, వెర్బల్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్)...మొదలైనవి ఆ కోర్సులలో ఉంటాయి.

> ఎన్నో ప్లాట్‌ఫామ్స్‌లో ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అయితే గ్రామీణ, చిన్న పట్టణాలకు చెందిన వారు ఆ ఖర్చును భరించే స్థితిలో లేరు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అందుబాటు ధరల్లో ఉండేలా ప్రిప్‌ఇన్‌స్టా తీసుకువచ్చాం.
> - ఆశయ్ మిశ్రా

'ఎన్నో ప్లాట్‌ఫామ్స్‌లో ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అయితే గ్రామీణ, చిన్న పట్టణాలకు చెందిన వారు ఆ ఖర్చును భరించే స్థితిలో లేరు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అందుబాటు ధరల్లో ఉండేలా ప్రిప్‌ఇన్‌స్టా తీసుకువచ్చాం. యూత్ తమ డ్రీమ్ జాబ్స్‌ను గెలుచుకునేలా చేయడంలో మా ప్లాట్‌ఫామ్ విజయం సాధించింది' అంటున్నాడు కో-ఫౌండర్ ఆశయ్ మిశ్రా.

నోయిడా(ఉత్తర్‌ప్రదేశ్), బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఈ ప్లాట్‌ఫామ్ యాభైకి పైగా కాలేజీలతో కలిసిపని చేస్తుంది. రాబోయే కాలంలో మూడు వందల కాలేజీలతో కలిసి పనిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

'మాది సెల్ఫ్-పేస్‌డ్ ప్లాట్‌ఫామ్. స్టూడెంట్స్ తమకు అనుకూలమైన టైమ్, షెడ్యూల్‌లో చదువుకోవచ్చు. బీ2సీ (బిజినెస్-టు-కన్స్యూమర్) మోడల్‌లో ఈ ప్లాట్‌ఫామ్‌కు 2.25 లక్షల పెయిడ్ యాక్టివ్ సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.

కోవిడ్ కల్లోల కాలంలో మాత్రం ఈ స్టార్టప్ తలకిందులయ్యే పరిస్థితి వచ్చింది. ఆదాయం సగానికి సగం పడిపోయింది. పేరున్న ఎడ్‌టెక్ కంపెనీలు కూడా మూతపడుతున్నాయి. 'నిరాశ' మెల్లిగా దారి చేసుకొని దగ్గరికి వచ్చే ప్రయత్నం చేస్తోంది. అయితే ఆ సమయంలో గట్టిగా నిలబడ్డారు ముగ్గురు మిత్రులు. కంపెనీని రీవ్యాంప్ చేశారు. ఉద్యోగుల సంఖ్యను పెంచారు.

'ఇక కనిపించదు' అనుకున్న కంపెనీ లేచి నిలబడి కాలర్ ఎగరేసింది!

25 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ స్టార్టప్ తన విస్తరణలో భాగంగా వెంచర్ క్యాపిటల్, ఏంజెల్ ఇన్వెస్టర్‌లతో చర్చలు జరుపుతోంది.

రిస్క్ అనిపించే చోట 'ప్లాన్ బీ'ను దృష్టిలో పెట్టుకోవడం మామూలే. అయితే 'ప్లాన్ ఏ' పకడ్బందీగా ఉంటే 'బీ'తో ఏంపని? అని ఈ ముగ్గురు అనుకున్నారు. వారి నమ్మకం నిజమైంది!

అవును... ఇది నిజమే!

● శునకాలు సైతం సంగీతానికి దాసోహం అంటాయి అంటున్నారు పరిశోధకులు. సంగీతం వాటి భావోద్వేగాల మీదే కాదు ప్రవర్తన విషయంలోనూ ప్రభావం చూపుతుందని చెబుతుంది 'యూనివర్శిటీ ఆఫ్ గ్లాస్గో' పరిశోధన పత్రం. సాఫ్ట్‌రాక్ వింటున్న సమయంలో వాటిలో పాజిటివ్ బిహేవియర్‌కు సంబంధించిన మార్పులు చోటు చేసుకున్నట్లు పరిశోధకులు తెలియజేస్తున్నారు.



ఇక శాస్త్రీయ సంగీతం వింటున్నప్పుడు చాలా రిలాక్స్‌డ్‌గా కనిపించేవి.

ఏమీ తోచక ఊరకే అరిచే శునకాలు సైతం సంగీతం వినబడగానే చప్పున కూర్చొని శ్రద్ధగా వినడాన్ని పరిశోధకులు గమనించారు!

● కెనడాకు చెందిన కోరి బ్రాండెన్ లాంగెస్ట్ వీడియోగేమ్ మారథాన్‌తో ప్రపంచ రికార్డ్ సృష్టించాడు. 'కాల్ ఆఫ్ డ్యూటీ: వార్‌జోన్' అనే వీడియో గేమ్‌ను 145 గంటల పాటు ఆడి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎంటరయ్యాడు. గతంలో కాలిఫోర్నియాకు చెందిన కెరీ 138 గంటల 34 నిమిషాలు ఆడి రికార్డ్ సృష్టించింది. ఈ రికార్డ్‌ను కోరి బ్రాండెన్ బ్రేక్ చేశాడు.

● గేమింగ్

అంతరిక్ష యుద్ధం

అంతరిక్షం అనేది అంతులేని రహస్యాల వేదిక. ఆ వేదికపై సాహస కవాతు చేయాలని ఉందా? ఏమీ తెలియని ప్రపంచంలో తెలిసిన ఆయుధాలతో యుద్ధం చేయాలని ఉందా? అయితే 'ఎవర్ స్పేస్-2'లోకి పదండి. రకరకాల మలుపులతో ప్లేయర్‌ను ఉక్కిరిబిక్కిరి చేసి అంతలోనే ఉత్సాహం నింపే గేమ్ ఇది.



స్పేస్ కంబాట్ గేమ్ 'ఎవర్ స్పేస్-2' ఏప్రిల్ 6 విడుదల అవుతుంది. రోగ్ లైక్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ త్రీడీ స్పేస్ షూటర్‌ని జర్మన్ స్టూడియో రాక్‌ఫిష్ నిర్మించింది. 2017లో గ్రేటర్ విజువల్స్‌తో ఆకట్టుకున్న 'ఎవర్ స్పేస్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ గేమ్‌పై ఎన్నో అంచనాలు ఉన్నాయి.

ఇంజిన్: అన్ రియల్ ఇంజిన్ 4
మోడ్స్: సింగిల్ ప్లేయర్
ప్లాట్‌ఫామ్: మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్‌బాక్స్, ప్లేస్టేషన్ 4, నిన్‌టెండో స్విచ్, గూగుల్ స్టాడియా, అమెజాన్ లూనా

రెడ్ లైట్

తాత చనిపోయిన దుఃఖం నుంచి భయటపడడానికి లక్నో (ఉత్తర్‌ప్రదేశ్)కు చెందిన ఖుషీకి చాలా కాలమే పట్టింది. ఒక రాత్రిపూట సైకిల్ తొక్కుతూ వెళుతున్న తాతయ్య యాక్సిడెంట్‌లో చనిపోయాడు. ఆ సైకిల్ వెనుక వెలిగే రెడ్‌లైట్ ఉండి ఉంటే ప్రమాదం జరగకపోయేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని తమ కుటుంబానికి జరిగిన విషాదం మరే కుటుంబానికి జరగకుండా సైకిలిస్ట్‌లకు ఉచితంగా పదిహేను వందలకు పైగా రెడ్‌లైట్లు పంపిణీ చేసింది ఖుషీ.

'దయచేసి మీ సైకిల్‌కు రెడ్‌లైట్ అమర్చుకోండి' అని రాసి ఉన్న ప్లకార్డుతో రాత్రివేళ రోడ్డు పక్కన నిల్చుంటుంది. ఎవరైనా సైకిలిస్ట్ రెడ్‌లైట్ లేకుండా వెళుతుంటే ఆపి నాలుగు మంచి మాటలు చెప్పడమే కాదు తానే స్వయంగా సైకిల్ వెనకాల రెడ్‌లైట్ బిగిస్తుంది.

ఖుషీ వీడియో క్లిప్‌ను ఐఏఎస్ అధికారి అవనీష్ శరణ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తే వైరల్ అయింది. 2.5 లక్షల వ్యూస్ వచ్చాయి.



సినిమా

మంత్రం కన్నా గొప్పది నీ నామం


● ఆదిపురుష్ పోస్టర్

ప్రభాస్ హీరోగా నటించిన మైథలాజికల్ ఫిల్మ్ 'ఆదిపురుష్'. రామాయణం ఇతీహాసం నేపథ్యంలో ఓం రౌత్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. ఇందులో రాముడి పాత్రలో ప్రభాస్, సీతగా కృతీసనన్, లక్ష్మణుడిగా సన్నీసింగ్, హనుమంతుని పాత్రలో దేవదత్తా, రావణుడి పాత్రలో సైఫ్ అలీఖాన్ నటించారు. వంశీ, ప్రమోద్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్ నిర్మించారు. గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకుని 'మంత్రం కన్నా గొప్పది నీ నామం జై శ్రీరామ్' అంటూ 'ఆదిపురుష్' నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రం జూన్ 16న విడుదలకానుంది.

ఇటలీలో సలార్..

ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సలార్'. శ్రుతీహాసన్ హీరోయిన్. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇటలీలోని మాంటేరాలో జరుగుతోంది. 'జేమ్స్‌బాండ్' సిరీస్‌లోని 25వ చిత్రం 'నో టైమ్ టు డై' షూటింగ్ జరిగిన లొకేషన్స్‌లోనే 'సలార్' చిత్రీకరణ జరుగుతోందని తెలిసింది. ప్రభాస్‌పై ప్రధాన సన్నివేశాలతో పాటుగా, భారీ యాక్షన్ సీక్వెన్స్ కూడా చిత్రీకరిస్తున్నారు యూనిట్. ఇటలీ షెడ్యూల్ పూర్తయిన తర్వాత బుడాపెస్ట్‌లో షూటింగ్ ప్లాన్ చేసింది యూనిట్. జగపతిబాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న 'సలార్' చిత్రం సెప్టెంబరు 28న రిలీజ్ కానుంది.

మధురం విజయం సాధించాలి - విశ్వక్ సేన్


● ఉదయ్, విశ్వక్ సేన్, రాజేష్

''మధురం' మూవీ పోస్టర్ చాలా బాగుంది. ఈ సినిమా చూడాలని నేను కూడా ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి. హీరో ఉదయ్, నిర్మాత బంగార్రాజు, డైరెక్టర్ రాజేష్‌కి ఆల్ ది బెస్ట్'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. ఉదయ్, వైష్ణవి జంటగా రాజేష్ చికిలే దర్శకత్వం వహించిన చిత్రం 'మధురం'. శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై బంగార్రాజు నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విశ్వక్ సేన్ విడుదల చేశారు. బంగార్రాజు మాట్లాడుతూ-''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం 'మధురం'. ఫస్ట్ లుక్ లాంచ్ చేసిన విశ్వక్ సేన్‌గారికి రుణపడి ఉంటాం'' అన్నారు. ''అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది'' అన్నారు రాజేష్ చికిలే, ఉదయ్. ఈ చిత్రానికి కెమెరా: మనోహర్ కొల్లి, సంగీతం: వెంకీ వీణ, సహ నిర్మాత: ప్రదీప్ కుమార్ సుప్రాణి.

ఓటీటీకి గ్రీన్‌సిగ్నల్

హీరోయిన్ వాణీకపూర్ డిజిటల్ ఎంట్రీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. 'మర్దానీ 2' ఫేమ్ దర్శకుడు గోపీ పుత్రన్, మానవ్ రావత్ కలిసి దర్శకత్వం వహించనున్న వెబ్‌సిరీస్ 'మండల మర్డర్స్'. ఇందులో వాణీకపూర్, వైభవ్ రాజ్ గుప్తా లీడ్ రోల్స్ చేస్తున్నారు. కాగా వాణీ కపూర్‌కు ఇదే తొలి ఓటీటీ ప్రాజెక్ట్. ''యశ్‌రాజ్‌ఫిల్మ్ ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న క్రైమ్‌థ్రిల్లర్ వెబ్‌సిరీస్ ఇది. నా తొలి ఓటీటీ ప్రాజెక్ట్ 'మండల మర్డర్స్' కావడం సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు వాణీకపూర్. కాగా ఈ వెబ్‌సిరీస్ తొలి షెడ్యూల్ త్వరలో మధ్యప్రదేశ్‌లో ప్రారంభం కానుంది.


● వాణీ కపూర్

ఆ ఇద్దరూ నేనే!


● గోపీచంద్, జగపతిబాబు

'లక్ష్యం, లౌక్యం' వంటి హిట్ సినిమాల తర్వాత హీరో గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న హ్యాట్రిక్ ఫిల్మ్ 'రామబాణం'. డింపుల్ హయతి హీరోయిన్‌గా, జగపతి బాబు, కుష్బూ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా 'రామబాణం' నుంచి ఓ పోస్టర్‌ను, వీడియోను రిలీజ్ చేశారు. పంచె కట్టు, బొట్టుతో గోపీచంద్, జగపతి బాబు నడిచి వస్తున్న పోస్టర్ బాగుంది. 'ఆ రాముడుకి లక్ష్మణుడు, హనుమంతుడు అని ఇద్దరు ఉంటారు. ఈ రాముడికి ఆ ఇద్దరూ నేనే' అనే వీడియో ఆకట్టుకుంటోంది. ''క్లాస్, మాస్ అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా శ్రీవాస్ ఈ చిత్రాన్ని తీస్తున్నారు. విక్కీ అనే పవర్ ఫుల్ పాత్రలో గోపీచంద్ సరికొత్తగా కనిపిస్తారు. 'రామబాణం' త్వరలోనే థియేటర్లలోకి దూసుకొస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె.మేయర్, కెమెరా: వెట్రి పళని స్వామి.

పొన్నియిన్ సెల్వన్ తీయాలంటే ధైర్యం కావాలి - కమల్ హాసన్


● మణిరత్నం, కమల్ హాసన్

''పొన్నియిన్ సెల్వన్' చిత్రాన్ని తీయాలంటే ధైర్యం కావాలి.. అది డైరెక్టర్ మణిరత్నం, నిర్మాత సుభాస్కరన్‌గార్లకు ఉంది. అందుకే ఈ చిత్రం అద్భుతంగా తెరకెక్కింది'' అని ప్రముఖ నటుడు కమల్ హాసన్ అన్నారు. ఐశ్వర్యా రాయ్, విక్రమ్, 'జయం' రవి, కార్తీ, త్రిష ప్రధాన పాత్రల్లో మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 2'. సుభాస్కరన్, మణిరత్నం నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 28న తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్, ఆడియో విడుదల వేడుకని చెన్నైలో నిర్వహించారు. ఈ మూవీ ఆడియోను కమల్ హాసన్ విడుదల చేసి, మాట్లాడుతూ-''పొన్నియిన్ సెల్వన్' నవల రాసిన కల్కిని చూసి ఇతర రచయితలు అసూయ పడుతున్నట్లుగా, మణిరత్నంగారిని చూసి రచయితలు, దర్శకులు అసూయ పడుతున్నారు.. వారిలో నేనూ ఒకణ్ణి. ఈ మూవీలో నటించే అవకాశం నాకు మిస్ అయ్యింది. తమిళ చిత్ర పరిశ్రమకు ఇది స్వర్ణయుగమే. దీన్ని కాపాడుకోవాలి. 'పొన్నియిన్ సెల్వన్ 2' ఘన విజయం సాధించాలి'' అన్నారు. ఈ వేడుకలో తమిళనాడు రాష్ట్ర మంత్రి దురైమురుగన్, దర్శకుడు భారతీరాజా, నటుడు శింబు, నటి ఐశ్వర్యారాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, రవివర్మన్ కెమెరామేన్‌గా పనిచేశారు.

టీజర్ వినోదాత్మకంగా ఉంది - శేఖర్ కమ్ముల


● శేఖర్ కమ్ముల, సుధాకర్

''నేను తీసిన 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' సినిమాలో నటించిన వారు ప్రస్తుతం మంచి స్థాయిలో ఉన్నారు. సుధాకర్ కూడా బాగా కష్టపడతాడు. తను కోరుకునే స్థాయికి 'నారాయణ అండ్ కో' సినిమా అతన్ని తీసుకెళ్తుందని భావిస్తున్నాను. ఈ మూవీ టీజర్ వినోదాత్మకంగా ఉంది. సినిమా హిట్ సాధించాలి'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. సుధాకర్ కోమాకుల హీరోగా చిన్నా పాపిశెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నారాయణ అండ్ కో'. పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ కోమాకుల నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. ''మిడిల్ క్లాస్, క్రైమ్ కామెడీగా రూపొందిన చిత్రమిది. మంచి కంటెంట్ అందివ్వాలనే ఆలోచనతోనే ఈ సినిమాకు ఓ నిర్మాతగా మారాను'' అన్నారు సుధాకర్ కోమాకుల. ''క్లీన్ కామెడీగా రూపొందిన ఈ మూవీని ఫ్యామిలీతో కలిసి చూడొచ్చు'' అన్నారు చిన్నా పాపిశెట్టి. నటి ఆమని మాట్లాడారు. ఈ సినిమాకు సహ నిర్మాత: శ్రీనివాస్ గొర్రెపూడి, అసోసియేట్ నిర్మాత: శరద్ గుమస్తే, రెడ్ సెడార్ ఎంటర్‌టైన్మెంట్, సంగీతం: సురేష్ బొబ్బిలి, జోస్య భట్ల, నాగవంశీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ రెడ్డి వెన్నపూస.

నిరుద్యోగుల కోసం..


● ఆర్. నారాయణ మూర్తి

ఆర్.నారాయణ మూర్తి ప్రధాన పాత్రలో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ'. స్నేహచిత్ర పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా సెన్సార్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ-''భారతదేశంలోని విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలతో 'యూనివర్సిటీ' తీశాను. ఎలాంటి అవకతవకలు లేకుండా అర్హులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఈ మూవీలో డిమాండ్ చేస్తున్నాం. త్వరలోనే మా సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తా'' అన్నారు.

కేరళలో ఖుషి


● విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటిస్తున్న చిత్రం 'ఖుషి'. శివ నిర్వాణ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా లేటెస్ట్ షెడ్యూల్ కేరళలో ప్రారంభం కానుందని సమాచారం. వారం పాటు సాగే ఈ షెడ్యూల్‌లో విజయ్, సమంతలపై కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట చిత్రయూనిట్. సెప్టెంబరు 1న 'ఖుషి' విడుదల కానుంది.

యాక్షన్ ఎంటర్‌టైనర్


● బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా 'భీమ్లా నాయక్' ఫేమ్ సాగర్ చంద్ర దర్శకత్వంలో ఓ సినిమా(బీబీఎస్ 10 వర్కింగ్ టైటిల్) తెరకెక్కనుంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించనున్న ఈ సినిమా ప్రకటన గురువారం వెల్లడైంది. '' మాస్-యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న చిత్రమిది. ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు పని చేయనున్నారు.. పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

మాస్ ఏజెంట్


● కృష్ణ, నిఖిత

కీర్తి కృష్ణ హీరోగా, నిఖిత, మధుబాల హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఏజెంట్ నరసింహ 117'. లక్ష్మణ్ చప్రాల దర్శకత్వంలో బి.నరసింహా రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ మూవీ రిలీజ్ ట్రైలర్‌ను 'తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' అధ్యక్షుడు బసిరెడ్డి విడుదల చేశారు. ''మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది'' అన్నారు నరసింహారెడ్డి.

సాక్షి బిజినెస్
శుక్రవారం
31-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 346	57,960
నిఫ్టీ ▲ 129	17,081

విదేశీ సూచీలు (తొలి వారంలో రాత్రి 9.30 గంటలకు)		
నాస్‌డాక్	12,007	▲ 81
డోజోన్స్	32,768	▲ 51
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,622	▲ 59
డాక్స్	15,523	▲ 194
షాంఘై	3,261	▲ 21
నికాయ్	27,783	▼ 101

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (24 క్యారెట్)	59,335
బంగారం (22 క్యారెట్)	59,097
వెండి (కిలో)	69,097

11 లక్షల వర్తకులతో మీషో



న్యూఢిల్లీ: ఈ–కామర్స్ కంపెనీ మీషో వేదికపై వర్తకుల సంఖ్య 11 లక్షలు దాటింది. గడిచిన ఏడాదిలో 6 లక్షల పైచిలుకు చిన్న వర్తకులు చేరారని కంపెనీ ప్రకటించింది. ఎనిమిదేళ్లలోనే ఈ మైలురాయికి చేరుకున్నట్టు తెలిపింది. 'విక్రేతల్లో సగం మంది ద్వితీయ శ్రేణి నగరాలు, చిన్న పట్టణాలకు చెందినవారు ఉన్నారు. మొత్తం సెల్లర్స్‌లో 80 శాతం పైచిలుకు మంది ఈ–కామర్స్‌కు కొత్తగా చేరినవారే. మీషో ద్వారానే ఆన్‌లైన్ వ్యాపారంలోకి వీరు అడుగుపెట్టారు. కశ్మీర్‌లోని పుల్వామా, హిమాచల్ ప్రదేశ్ ఉనా, కర్ణాటక నాగమంగళ, మేఘాలయ జోవాయ్, రాజస్తాన్‌లోని మౌంట్ అబు నుంచి సైతం విక్రేతలు నమోదయ్యారు. ఇంటర్నెట్ వాణిజ్యాన్ని మారుమూల ప్రాంతాలకూ చేర్చడం, చిన్న అమ్మకందారులను ఆన్‌లైన్‌లోకి తీసుకురావాలన్న సంస్థ లక్ష్యానికి ఇది నిదర్శనం' అని మీషో వివరించింది. వార్షిక ప్రాతిపదికన 14 కోట్ల మంది కస్టమర్లను సొంతం చేసుకున్నట్టు 2022లో కంపెనీ ప్రకటించింది. విక్రేతల సగటు ఆదాయం మూడింతలు పెరిగిందని తెలిపింది.

చిన్న షేర్లు కుదేల్!

- 2022–23లో స్మాల్‌క్యాప్ సూచీ 6 శాతం డౌన్..
- సెన్సెక్స్, బ్లూచిప్ షేర్లతో పోలిస్తే అధిక పతనం
- అధిక వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం, ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం



న్యూఢిల్లీ: చిన్న షేర్లు చితికిపోయాయి. ఒకపక్క ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి తోడు వడ్డీరేట్లకు రెక్కలు రావడం, అధిక ద్రవ్యోల్బణం సెగ వాటికి బాగానే తగిలింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో స్మాల్‌క్యాప్ సూచీ 1,617 పాయింట్లు (5.73%) దిగజారడం దీనికి నిదర్శనం. ఇదే కాలంలో బీఎస్ఈ సెన్సెక్స్, బ్లూచిప్ షేర్లతో పోలిస్తే చిన్న షేర్ల పతనం భారీగా ఉండటం గమనార్హం.

తీవ్ర ఒడిదుడుకులు...

2022–23 ఏడాది భారత స్టాక్ మార్కెట్లను తీవ్రంగానే కుదిపేసింది. ప్రధానంగా తొలి క్వార్టర్‌లో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రతో దేశీ సూచీలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నాయని.. అయితే, రెండు, మూడు త్రైమాసికాల్లో తిరిగి పుంజుకోగలిగాయని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. అయితే, రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతో పాటు ధరాభారం, అధిక వడ్డీరేట్ల వల్ల చిన్న షేర్లపై ఇన్వెస్టర్ల ఆసక్తి సన్నగిల్లిందని వారు అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఒక్క రోజు మాత్రమే ఉన్న నేపథ్యంలో, గడిచిన ఏడాది కాలాన్ని చూస్తే... మిడ్ క్యాప్ సూచీ 1.12 శాతం (270 పాయింట్లు) మాత్రమే తగ్గగా, సెన్సెక్స్ 1.03 శాతం (608 పాయింట్లు) పడింది. ''ధరల కట్టడే లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులన్నీ వడ్డీరేట్లను జోరుగా పెంచడం మొదలుపెట్టాయి. దీంతో ఇన్వెస్టర్లు రిస్క్ తగ్గించుకోవడంపై దృష్టిపెట్టడంతో మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది'' అని మార్కెట్స్‌మోజో చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సునీల్ దమానియా విశ్లేషించారు. కాగా, 2021–22లో మార్కెట్లు దుమ్మురేపడంతో స్మాల్ క్యాప్ సూచీ ఏకంగా 36.64 శాతం దూసుకెళ్లడం తెలిసిందే. ఇదే బాటలో మిడ్‌క్యాప్స్ 19.45 శాతం సెన్సెక్స్ 18.29 శాతం చొప్పున బలపడ్డాయి. ఏడాది తిరిగేసరికి చిన్న షేర్లు మళ్లీ వేగంగా కరిగిపోవడం గమనార్హం. ప్రధానంగా వడ్డీరేట్ల పెరుగుదలతో చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు వడ్డీభారం పెరగడం వల్ల పెద్ద కంపెనీలతో పోలిస్తే అధిక ప్రభావం కనబడుతోందని దమానీ పేర్కొన్నారు.

చిన్న షేర్లకు దూరం...

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న తరుణంలో ఇన్వెస్టర్లు చిన్న షేర్లను అధిక రిస్క్‌తో కూడినవిగా పరిగణిస్తున్నారని స్వస్తికా ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా చెప్పారు. దీంతో వీటిలో పెట్టుబడులకు వెనుకాడటంతో పాటు తమ సొమ్మును వేగంగా వెనక్కి తీసుకోవడం వల్ల స్మాల్‌క్యాప్ సూచీ మిగతా వాటితో పోలిస్తే ఎక్కువగా పడిందన్నారు. ఫెడ్ భారీగా వడ్డీరేట్లను పెంచడం, ఉక్రెయిన్ యుద్ధం, అధిక ద్రవ్యోల్బణంతో మాంద్యం భయాలు నెలకొన్న కారణంగా గడిచిన ఏడాది కాలం మన మార్కెట్లు గడ్డు పరిస్థితులను చవిచూశాయని మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అర్విందర్ సింగ్ నందా పేర్కొన్నారు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) తిరోగమనం, అదానీ గ్రూప్ స్టాక్స్‌లో ఎడాపెడా అమ్మకాల వంటి అనేక అంశాలు కూడా మన మార్కెట్ ప్రతికూల పనితీరుకు కారణమని నందా అభిప్రాయపడ్డారు.

ఆఫీస్ స్పేస్ లీజింగ్ తగ్గింది



న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి–మార్చిలో ఏడు ప్రధాన నగరాల్లో ఆఫీస్ స్పేస్ నికర లీజింగ్ 76.3 లక్షల చదరపు అడుగులు నమోదైంది. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 34 శాతం తగ్గదల అని రియల్టీ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా నివేదిక తెలిపింది. '2023 జనవరి–మార్చిలో నికర లీజింగ్ ఆరు త్రైమాసికాల్లో కనిష్ట స్థాయికి పడిపోయింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, కొనసాగుతున్న హైబ్రిడ్ పని విధానం కారణంగా కార్పొరేట్ కంపెనీలు విస్తరణపై ఆచితూచి వ్యవహరించడమే ఇందుకు కారణం. రియల్ ఎస్టేట్ ఖర్చులకు తగ్గించుకోవడానికి కంపెనీలు కసరత్తు చేస్తున్నాయి. నికర లీజింగ్ చెన్నై 50 శాతం పడిపోయి 6 లక్షల చదరపు అడుగులు, హైదరాబాద్ 85 శాతం తగ్గి 5.2 లక్షలు, ముంబై 39% క్షీణించి 8.8 లక్షలు, పుణే 44% తగ్గి 12.8 లక్షల చదరపు అడుగులుగా ఉంది. ఢిల్లీ ఎన్‌సీఆర్ 47% దూసుకెళ్లి 19.6 లక్షల చదరపు అడుగులు, బెంగళూరు 14% పెరిగి 19.1 లక్షలు, కోల్‌కతా రెండింతలై 4.6 లక్షల చదరపు అడుగుల నికర లీజింగ్ నమోదైంది. ఈ నగరాల్లో నికర లీజింగ్ 2022 జనవరి–మార్చిలో 1.15 కోట్ల చదరపు అడుగులు ఉంది. సాంకేతిక పరిశ్రమలో మందగమనం ఉన్నప్పటికీ ఆఫీస్ స్పేస్ కోసం డిమాండ్ స్థిరంగా ఉంటుంది. 2022 మాదిరిగా ఈ ఏడాది 3.6–4 కోట్ల చదరపు అడుగులు అంచనా వేస్తున్నాం. మరో త్రైమాసికం తర్వాత ఆఫీస్ డిమాండ్ ఎలా ఉంటుందనే అంశంలో స్పష్టత వస్తుంది' అని జేఎల్ఎల్ వివరించింది.

భారత్ వృద్ధికి సంస్కరణల ఊతం

- ప్రపంచ బ్యాంక్ విశ్లేషణ
- ప్రపంచ ఆర్థిక వృద్ధిపై ఆందోళన
- 2030 నాటికి మూడు దశాబ్దాల కనిష్టానికి పడిపోతుందని అంచనా



న్యూఢిల్లీ: భారత్ ఇప్పటికే అమలు చేస్తున్న ప్రతిష్టాత్మకమైన సంస్కరణల ఎజెండాను మరింత వేగవంతంగా అమలు చేయడం వల్ల దేశ వృద్ధి వేగం మరింత పెరిగే అవకాశం ఉంటుందని ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక పేర్కొంది. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ ఆర్థికాభివృద్ధిపై తీవ్ర ప్రతికూలతకు దారితీసిందని బహుళ జాతి బ్యాంకింగ్ దిగ్గజం స్పష్టం చేసింది. ఆయా పరిస్థితులు ఎకానమీ పురోగతికి సంబంధించి ప్రపంచం ఒక 'దశాబ్దాన్ని' కోల్పోయే పరిస్థితిని సృష్టిస్తున్నాయని హెచ్చరించింది. 2030 నాటికి ప్రపంచ ఆర్థిక పురోగతి మూడు దశాబ్దాల కనిష్టానికి పడిపోయే అవకాశం ఉందని విశ్లేషించింది. 2000–2010 మధ్య ప్రపంచ స్థూల వృద్ధి రేటు దాదాపు 6.5 శాతం ఉంటే, 2020–30 మధ్య కాలానికి ఈ రేటు 2.2 శాతానికి పడిపోవచ్చని తెలిపింది. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల విషయానికొస్తే, ఎకానమీ క్షీణత 2000– 2010 మధ్య సంవత్సరానికి సగటున 6 శాతం ఉంటే, ఈ దశాబ్దంలో మిగిలిన కాలంలో సంవత్సరానికి 4 శాతానికి పడిపోతుందని అభిప్రాయపడింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం– మాంద్యం పరిస్థితులు తలెత్తితే ఈ పతనం మరింత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. 'దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు తిరోగమనం –పోకడలు, అంచనాలు–విధానాల' పేరుతో విడుదలైన నివేదికలోని మరికొన్ని ముఖ్యాంశాలు.

- భారత్ తోటి దేశాల కంటే వేగవంతమైన పురోగతి సాధిస్తున్నప్పటికీ, సంస్కరణ ఎజెండాను ముఖ్యంగా తయారీ, మౌలిక రంగంలో వేగవంతంగా అమలు చేయడం ద్వారా మరింత ప్రయోజనం పొందవచ్చు. ముఖ్యంగా ఫైనాన్షియల్ రంగంలో ఒత్తిడులను తొలగించాల్సి ఉంది. ఈ విభాగంలో సవాళ్లు దేశ పురోగతికి బ్రేకులు వేస్తున్నాయి.
- 2000–10లో భారత్ పెట్టుబడుల సగటు వార్షిక వృద్ధి 10.5 శాతం అయితే, 2011–21లో ఈ రేటు 5.7 శాతానికి పడిపోయింది.
- విద్యుత్, రోడ్డు, రైలు నెట్‌వర్క్, వ్యాపారాలకు ఎదురవుతున్న అవరోధాలు, బ్యాంకింగ్ రంగంలో మొండిబకాయిల వంటి బలహీనతలు వంటి అంశాలు భారత్ ఎకానమీకి అవరోధాలుగా ఉన్నాయి.
- కోవిడ్–19తో ఎదురవుతున్న పరిణామాలు ప్రపంచ దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను తీవ్రంగా దెబ్బతీస్తోంది.
- భౌగోళిక ఉద్రిక్తతలూ ప్రపంచ వృద్ధి తిరోగమనానికి దారితీస్తున్నాయి.
- పెట్టుబడుల్లో వృద్ధి క్షీణిస్తోంది. ప్రపంచ శ్రామిక శక్తి మందకొడిగా పెరుగుతోంది. కరోనావైరస్ మహమ్మారి వల్ల మానవ వనరుల నైపుణ్య కొరత ఎదురవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో వృద్ధి.. జీడీపీ పురోగతికి తగిన విధంగా సరిపోవడం లేదు.

ట్రావెల్ ఆపరేటర్ల లాభాలకు బూస్ట్

రెండు ఆర్థిక సంవత్సరాల్లో 7 శాతం వరకు వృద్ధి: క్రిసిల్ నివేదిక



ముంబై: ప్రయాణాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత, కొత్త ఆర్థిక సంవత్సరాల్లో ట్రావెల్, టూర్ ఆపరేటర్ల నిర్వహణ లాభాలు 6–7 శాతం వృద్ధి చెందనున్నాయి. అలాగే కోవిడ్ పూర్వ స్థాయితో పోలిస్తే 90 శాతం ఆదాయాన్ని రికవర్ చేసుకోనున్నాయి. క్రిసిల్ రేటింగ్స్ ఒక నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. కోవిడ్‌పరమైన ఆంక్షల వల్ల ప్రయాణాలు నిల్చిపోవడంతో రెండేళ్ల పాటు నష్టపోయిన ట్రావెల్, టూర్ ఆపరేటర్ల నిర్వహణ లాభదాయకత .. 2023, 2024 ఆర్థిక సంవత్సరాల్లో 6–7 శాతం మేర పుంజుకోవచ్చని పేర్కొంది. కార్పొరేట్, విహార ప్రయాణాలు మెరుగుపడటంతో ఆదాయాలూ పెరగగలవని క్రిసిల్ తెలిపింది. కోవిడ్ సమయం నుంచి అమలు చేస్తున్న ఆటోమేషన్, వ్యయ నియంత్రణ విధానాలు ఇందుకు దోహదపడగలవని పేర్కొంది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆదాయాలు తిరిగి మహమ్మారి పూర్వ స్థాయిని (2020 ఆర్థిక సంవత్సరం) దాటియొచ్చని తెలిపింది. 2021, 2022 ఆర్థిక సంవత్సరాల్లో ట్రావెల్, టూర్ ఆపరేటింగ్ సంస్థలు వరుసగా 25.8%, 2.7% మేర నిర్వహణ నష్టాలు ప్రకటించాయి. నివేదికలోని మరిన్ని అంశాలు.

- నిర్వహణ పనితీరు, లిక్విడిటీ మెరుగ్గా ఉండటం, నికర రుణ రహితంగా ఉండటం వంటి అంశాలు ఆయా సంస్థలకు సహాయకరంగా ఉండనున్నాయి.
- స్వల్పకాలిక విహార యాత్రలకు.. (ముఖ్యంగా భారత్, ఆసియా ప్రాంతాలకు) ప్రాధాన్యం పెరుగుతోంది. యూరోపియన్ దేశాల వీసాల జారీ పుంజుకోవడంతో రాబోయే వేసవి సెలవుల కోసం బుకింగ్‌లు పెరుగుతున్నాయి. అయితే, విహార యాత్రల కోసం అమెరికాకు వెళ్లే ధోరణులు రికవర్ కావడానికి మరింత సమయం పట్టనుంది.
- అంతర్జాతీయ మందగమనం సుదీర్ఘంగా కొనసాగవచ్చన్న ఆందోళనలు తగ్గుముఖం పడుతుండటంతో రాకపోకలు మెరుగుపడనుండటం.. ఆదాయాల వృద్ధికి తోడ్పడనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

31-3-2023	
విశాఖ	420–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	408–00
విజయవాడ	408–00
రిటైల్ ధర (డజను)	66.00
30-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	390–00
వరంగల్	392–00
రిటైల్ ధర	4.50

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో రిత్విక్ చౌదరీ జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మైసూర్ ఓపెన్ పురుషుల టోర్నీలో డబుల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ తన భాగస్వామి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిక్కీ పునాచాతో కలిసి సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. మైసూర్‌లో గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ రిత్విక్–నిక్కీ ద్వయం 6–3, 7–6 (7/3)తో ఫ్లోరెంట్ బాక్స్ (ఫ్రాన్స్)–నితిన్ కుమార్ సిన్హా (భారత్) జంటపై గెలిచింది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్–నిక్కీ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. పురుషుల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన విష్ణువర్ధన్, రిషబ్ అగర్వాల్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో 'లండన్ ఒలింపియన్' విష్ణువర్ధన్ 3–6, 6–7 (6/8)తో ప్రజ్వల్ దేవ్ (భారత్) చేతిలో, రిషబ్ 1–6, 7–5, 4–6తో ఒర్లోవ్ వ్లాదిస్లావ్ (ఉక్రెయిన్) చేతిలో ఓడిపోయారు.

'పదహారేళ్ల' పండుగ...

నేటి నుంచి ఐపీఎల్ 16వ సీజన్ • మే 28న ఫైనల్ మ్యాచ్

తొలి పోరులో చెన్నైతో గుజరాత్ 'ఢీ' • రాత్రి గం.7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ధోని చెన్నైలో ఆఖరిసారిగా ఆడి ఇక గుడ్‌బై చెబుతాడా? ఎన్నో రికార్డులు అందుకున్నా ఇంకా చెంత చేరని ఐపీఎల్ ట్రోఫీని ఈ సారైనా కోహ్లి టచ్ చేయగలడా? ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన తర్వాత గత ఏడాది అనూహ్యంగా ఆఖరి స్థానానికి పరిమితమైన ముంబైని ఈసారి రోహిత్ ఎంతవరకు తీసుకెళ్లగలడు? వరుసగా రెండో ఏడాది గుజరాత్ సత్తా చాటగలదా? పదిహేనేళ్లు ఆడినా టైటిల్ అందని ద్రాక్షగానే ఉన్న ఉత్తరాది టీమ్‌ల ఢిల్లీ, పంజాబ్ టీమ్‌ల అదృష్టం ఎలా ఉంటుంది? రేసులో మిగిలిన నాలుగు జట్లు హైదరాబాద్, కోల్‌కతా, లక్నో, రాజస్తాన్‌లు ఏమాత్రం పోటీనివ్వగలవు? ఈ అన్నింటికి సమాధానం అందించే ధనాధన్ పండుగకు మళ్లీ రంగం సిద్ధమైంది. వేసవి వినోదంలో ప్రపంచంలోనే అత్యుత్తమ క్రీడా సంబరంగా నిలిచిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్ 16వ సీజన్ వచ్చేసింది. క్రికెట్ అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న లీగ్-2023కి నేడు అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్‌తో తెర లేవనుంది.



ఐపీఎల్ ట్రోఫీతో తొమ్మిది జట్ల కెప్టెన్‌లు

అహ్మదాబాద్: ఐపీఎల్ కొత్త సీజన్‌కు విజిల్ మోగింది. మే 28 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 74 మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి. అన్నింటికి మించి 2019 తర్వాత అన్ని జట్లకూ సొంతగడ్డపై మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తోంది. కరోనా కారణంగా గత మూడు సీజన్ల పాటు వేదికల విషయంలో షరతుల కారణంగా అందరికీ తమ సొంత మైదానాల్లో ఆడే అవకాశం రాలేదు. ఇప్పుడు భారీ స్థాయిలో, స్థానిక అభిమానుల మద్దతుతో పది జట్లూ హంగామాకు సిద్ధమయ్యాయి. మారిన ఆటగాళ్లు, నిబంధనల్లో స్వల్ప మార్పులతో పదహారో సీజన్ లీగ్ కాస్త కొత్తగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. జాతీయ జట్లకు ఆడుతున్న కారణంగా దక్షిణాఫ్రికా, శ్రీలంకలకు చెందిన ఆటగాళ్లు కాస్త ఆలస్యంగా తమ ఐపీఎల్ టీమ్‌లతో చేరతారు. గురువారం అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ట్రోఫీతో అన్ని జట్ల కెప్టెన్‌ల ఫొటో సెషన్ నిర్వహించారు. అస్వస్థత కారణంగా ఈ కార్యక్రమానికి ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ హాజరుకాలేదు.

కొన్ని మార్పులు...

'ఇంపాక్ట్ ప్లేయర్' పేరుతో కొత్త నిబంధనను లీగ్ కౌన్సిల్ తీసుకొచ్చింది. దీని ప్రకారం తాము ముందుగా ప్రకటించిన నలుగురు సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లలో ఒకరిని మ్యాచ్ మధ్యలో 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బరిలోకి దిగవచ్చు. అంటే బ్యాటింగ్ ఒకరు చేసిన తర్వాత అతని స్థానంలో తర్వాతి ఇన్నింగ్స్‌లో మరో బౌలర్‌ను తీసుకునే అవకాశం జట్టుకు ఉంది. అంటే పరిస్థితులను బట్టి ప్లేయర్‌ను మార్చుకునే ఈ సౌకర్యం జట్టుకు అదనపు ప్రయోజనాన్ని ఇస్తుంది. టాస్ తర్వాత తుది జట్టును ప్రకటించడం కూడా తొలిసారి అమలు చేస్తున్నారు. ఇటీవల దక్షిణాఫ్రికా టి20 లీగ్‌లో దీనిని వాడారు. అంటే టాస్ గెలిస్తే ఒక రకమైన టీమ్, టాస్ ఓడితే మరో రకమైన టీమ్‌తో సిద్ధమై కెప్టెన్ టాస్‌కు వెళ్లవచ్చు. అలాగే మహిళల ప్రీమియర్ లీగ్ తరహాలో వైడ్‌లు, నోబాల్స్ కోసం కూడా డీఆర్ఎస్‌ను వాడుకోవచ్చు.

ఫార్మాట్ ఇలా...

లీగ్ దశలో ప్రతీ టీమ్ 14 మ్యాచ్‌లు ఆడుతుంది. అయితే పది జట్లు ఉండటంతో గత ఏడాదిలాగే కాస్త భిన్నమైన ఫార్మాట్‌ను అమలు చేస్తున్నారు. 10 టీమ్‌లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ టీమ్‌లో తమ గ్రూప్‌లోని మిగిలిన నాలుగు జట్లతో ఒక్కో మ్యాచ్ చొప్పున... మరో గ్రూప్‌లోనే ఐదు జట్లతో రెండేసి మ్యాచ్‌లు ఆడుతుంది. గ్రూప్ 'ఎ'లో ముంబై, కోల్‌కతా, రాజస్తాన్, ఢిల్లీ, లక్నో ఉన్నాయి. ఉదాహరణకు ముంబై తమ గ్రూప్‌లోనే కోల్‌కతా, రాజస్తాన్, ఢిల్లీ, లక్నోలతో ఒకేసారి తలపడుతుంది. గ్రూప్ 'బి'లో ఉన్న చెన్నై, బెంగళూరు, గుజరాత్, పంజాబ్, సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్‌లను రెండేసి సార్లు ఎదుర్కొంటుంది. అయితే ఎలా ఆడినా ప్రతీ టీమ్‌కు సొంతగడ్డపై 7 మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తోంది.

డిజిటల్ మీడియా మారింది...

గత సీజన్ వరకు మొబైల్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు చూసేందుకు స్టార్ స్పోర్ట్స్‌కే చెందిన 'హాట్ స్టార్'లో అవకాశం ఉండేది. అయితే ఈసారి మీడియా హక్కులు మారాయి. టీవీ ప్రసారాలు స్టార్ స్పోర్ట్స్‌లోనే వస్తాయి. డిజిటల్ హక్కులు మాత్రం అంబానీకి చెందిన వయాకామ్ 18 గ్రూప్ కొనుక్కుంది. దాంతో ఈసారి మొబైల్‌లో 'జియో సినిమా'లో ఐపీఎల్ మ్యాచ్‌లు చూడవచ్చు.

ప్రారంభోత్సవ వేడుకలు...

ఐపీఎల్‌లో చివరిసారిగా 2018లో ప్రారంభోత్సవ వేడుకలు జరిగాయి. పుల్వామాలో దాడి కారణంగా 2019లో నిర్వాహకులు వేడుకలు రద్దు చేశారు. ఈసారి ఆటతో పాటు తొలిరోజు పాట, నృత్యాల సంబరం కూడా ఉంది. ప్రముఖ గాయకుడు అరిజిత్ సింగ్ పాటతో పాటు కత్రినా కైఫ్, టైగర్ ష్రాఫ్, రష్మిక మంధాన, తమన్నా డ్యాన్స్‌లతో అలరిస్తారు.

బుమ్రా మినహా...

ఈసారి లీగ్‌లో భారత రెగ్యులర్ ఆటగాళ్లతో పాటు అంతర్జాతీయ స్టార్లు బరిలోకి దిగుతున్నారు. స్టోక్స్, జోఫ్రా ఆర్చర్, కాన్వే, రూట్, హ్యారీ బ్రూక్ తదితరులు సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. అయితే గాయంతో అనూహ్యంగా దూరమైన వారిలో బుమ్రా అందరికంటే కీలక ఆటగాడు. అతను లేకుండా ముంబై బరిలోకి దిగుతుండగా, గాయంతో శ్రేయస్ అయ్యర్ కూడా తప్పుకున్నాడు.

క్వార్టర్ ఫైనల్లో సింధు, శ్రీకాంత్

స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ





మాడ్రిడ్: ఈ ఏడాది తొలి టైటిల్ కోసం వేచి చూస్తున్న భారత స్టార్ షట్లర్స్ పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్ సింధు 21–14, 21–16తో ప్రపంచ 38వ ర్యాంకర్ పుత్రి కుసుమ వర్దిని (ఇండోనేసియా)పై 36 నిమిషాల్లో విజయం సాధించింది. ఈ గెలుపుతో గత వారం స్విస్ ఓపెన్‌లో కుసుమ వర్దిని చేతిలో ఎదురైన ఓటమికి సింధు బదులు తీర్చుకుంది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో భారత్‌కే చెందిన అష్మిత చాలిహా 15–21, 15–21తో యో జియా మిన్ (సింగపూర్) చేతిలో ఓడిపోగా... గాయం కారణంగా మాళవిక బన్సోద్ తన ప్రత్యర్థి కరోలినా మారిన్ (స్పెయిన్)కు వాకోవర్ ఇచ్చింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ 21–15, 21–12తో భారత్‌కే చెందిన సాయిప్రణీత్‌పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన కిరణ్ జార్జ్ 17–21, 12–21తో మాగ్నస్ జొహాన్సెన్ (డెన్మార్క్) చేతిలో, ప్రియాన్షు రజావత్ 14–21, 15–21తో తొమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో, సమీర్ వర్మ 15–21, 14–21తో కాంటా సునెయామ (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యారు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–ఆరతి (భారత్) జోడీ 12–21, 13–21తో రుయ్ హిరోకామి–యునా కాటో (జపాన్) ద్వయం చేతిలో... పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఎం.ఆర్.అర్జున్–ధ్రువ్ కపిల (భారత్) జంట 16–21, 20–22తో షున్‌టారో మెజకి–హరుయ నిషిద (జపాన్) జోడీ చేతిలో ఓడిపోయాయి.

సన్‌రైజర్స్ తొలి మ్యాచ్‌కు కెప్టెన్‌గా భువనేశ్వర్



న్యూఢిల్లీ: ఐపీఎల్ టి20 క్రికెట్ టోర్నీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తమ తొలి మ్యాచ్‌ను భారత పేస్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ నాయకత్వంలో ఆడనుంది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కొత్త కెప్టెన్‌గా నియమితుడైన దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మార్క్‌రమ్ ఏప్రిల్ 3న భారత్‌కు రానున్నాడు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 2న హైదరాబాద్‌లో రాజస్తాన్ రాయల్స్‌తో జరిగే తమ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ జట్టుకు భువనేశ్వర్ సారథ్యం వహిస్తాడు. నెదర్లాండ్స్ జట్టుతో మార్చి 31న, ఏప్రిల్ 2న దక్షిణాఫ్రికా రెండు వన్డేలు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల్లో మార్క్‌రమ్ బరిలోకి దిగనున్నాడు. 2013 నుంచి సన్‌రైజర్స్ జట్టుతో ఉన్న 33 ఏళ్ల భువనేశ్వర్ 2019లో ఆరు మ్యాచ్‌ల్లో, 2022లో ఒక మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. భువనేశ్వర్ కెప్టెన్సీలో సన్‌రైజర్స్ రెండింటిలో గెలిచి, ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

అమెరికాను గెలిపించిన సాయితేజ రెడ్డి



విండ్‌హోక్ (నమీబియా): వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ ప్లే ఆఫ్ టోర్నీలో అమెరికా జట్టు రెండో విజయం నమోదు చేసింది. యూఏఈతో గురువారం జరిగిన మ్యాచ్‌లో అమెరికా 5 వికెట్ల తేడాతో నెగ్గింది. భారత సంతతికి చెందిన 18 ఏళ్ల సాయితేజ రెడ్డి ముక్కామల (114 బంతుల్లో 120 నాటౌట్; 12 ఫోర్లు) అజేయ సెంచరీతో అమెరికాను గెలిపించాడు. ముందుగా యూఏఈ 50 ఓవర్లలో 9 వికెట్లకు 279 పరుగులు చేసింది. అనంతరం అమెరికా 49 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి విజయం సాధించింది.

హంపికి తొలి విజయం

న్యూఢిల్లీ: మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తొలి విజయం సాధించింది. ఐదో రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హంపి 59 ఎత్తుల్లో నానా జాగ్నిడ్జె (జార్జియా)పై గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన హారిక 62 ఎత్తుల్లో బిబిసారా (కజకిస్తాన్) చేతిలో ఓడింది.

జనసేన నాయకురాలు వినూతపై కేసు

ఏర్పేడు(తిరుపతి జిల్లా): పోలీసులపై దాడిచేసిన ఘటనలో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినూత, పలువురు జనసైనికులపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి గురువారం తెలిపారు. రోడ్డు సమస్యపై చిందేపల్లి శివాలయంలో నిరాహార దీక్ష చేస్తున్న వినూత, జనసేన కార్యకర్తలను ఆస్పత్రికి తరలించేందుకు బుధవారం పోలీసులు యత్నించడంతో ఆ పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేసినట్లు వివరించారు. ఈ దాడిలో సీఐ ఆరోహణరావు, ఏఎస్‌ఐ శివకుమార్‌కు గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు.

టీడీపీలో బీసీలకు చోటు లేదు

- అనంతపురం జిల్లా ఈడిగ సంఘం అధ్యక్షుడు బొమ్మగాని
- టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 'మూడు దశాబ్దాలుగా టీడీపీ జెండా మోస్తూ అలసిపోయాను. పార్టీకి బీసీలు వెన్నెముక అంటూ చంద్రబాబు చెప్పడమేగానీ చేసింది శూన్యం. టీడీపీలో బీసీలతో చాకిరీ చేయించుకోవడమేగానీ గుర్తింపు ఇవ్వరు..' అని అనంతపురం జిల్లా ఈడిగ సంఘం అధ్యక్షుడు, టీడీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బొమ్మగాని కిరణ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఆయన గురువారం టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను అధ్యక్షుడు చంద్రబాబుకు పంపారు. అనంతరం అనంతపురంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పార్టీలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారికి మాత్రమే గుర్తింపు ఉంటుందని చెప్పారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అహర్నిశలు పనిచేశామని, కానీ తమకు గుర్తింపు ఇవ్వలేదని తెలిపారు. కనీసం పార్టీ అనుబంధ సంఘాల్లోనైనా గుర్తింపు ఇవ్వాలని కోరినా న్యాయం చేయలేదన్నారు. దీన్నిబట్టి చూస్తే టీడీపీలో బీసీలకు ఎలాంటి న్యాయం జరుగుతోందో అంచనా వేయవచ్చని చెప్పారు. బీసీ వర్గాల నేతలు ఎవరైనా చిన్న పదవి కావాలన్నా ప్రభాకర్ చౌదరి, పరిటాల సునీత వంటి వారిని అడుక్కోవాల్సిందే తప్ప.. గుర్తించి పదవులు ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు. త్వరలోనే మరికొంతమంది బీసీ నేతలు పార్టీని వీడే అవకాశం ఉందన్నారు. పార్టీ నాయకుడు లోకేశ్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాదయాత్ర చేస్తున్న తరుణంలోనే బీసీ నేతలు ఒక్కొక్కరు పార్టీని వీడుతుండటం కేడర్‌ను ఇబ్బంది పెడుతున్నట్టు తెలుస్తోంది.



రూ.6 లక్షలు వెచ్చించి.. 8,428 ప్లేట్ల ఇడ్లీ కొన్నాడు!

- దక్షిణాది అల్పాహారంగా ఇడ్లీకే అధిక ప్రాధాన్యం
- దేశవ్యాప్తంగా మసాల దోశ తర్వాత ఇడ్లీ ఆర్డర్లే ఎక్కువ
- 'ఇడ్లీ డే' సందర్భంగా ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ వెల్లడి

స్విగ్గీలో హైదరాబాదీ రికార్డు

భారతీయ అల్పాహార వంటకాలు భిన్నరకాలు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో వైరైటీ నోరూరుస్తుంది. కానీ.. ఇడ్లీ మాత్రం దక్షిణ భారతదేశం మొత్తం రుచికరమైన వంటకంగా అత్యంత ప్రజాదరణ పొందింది. తరతరాలుగా కొత్తకొత్త వంటకాలు వస్తున్నప్పటికీ.. ఇడ్లీ స్థానం మాత్రం నేటికీ పదిలంగానే ఉంటోంది. అందుకేనేమో.. హైదరాబాద్‌కు చెందిన ఓ వినియోగదారుడు ఏడాది కాలంలో ఏకంగా ఇడ్లీలపైనే రూ.6 లక్షలు ఖర్చు చేశారు. బెంగళూరు, చెన్నై నగరాల్లో ప్రయాణిస్తున్నప్పటికీ.. తన కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం గత ఏడాది ఏకంగా 8,428 ప్లేట్ల ఇడ్లీలను స్విగ్గీలో ఆర్డర్ చేశారు. ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ మార్చి 30న ప్రపంచ 'ఇడ్లీ దినోత్సవం' సందర్భంగా తన విశ్లేషణను విడుదల చేసింది.

-సాక్షి, అమరావతి

33 మిలియన్ల ప్లేట్ల ఇడ్లీ ఆర్డర్లు

గత ఏడాది మార్చి 30 నుంచి ఈ ఏడాది మార్చి 29వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 33 మిలియన్ ప్లేట్ల ఇడ్లీలను డెలివరీ చేసినట్టు స్విగ్గీ పేర్కొంది. రవ్వ ఇడ్లీ ఇతర నగరాల కంటే బెంగళూరులో బాగా ప్రాచుర్యం పొందింది. నెయ్యి, కారం ఇడ్లీ తమిళనాడు, ఏపీ, తెలంగాణలోని నగరాల్లో అధికంగా ఇష్టపడుతున్నారు. ఇక్కడ చిట్టి ఇడ్లీల సంస్కృతి విశేషంగా ఆకర్షిస్తోంది. దేశంలో మసాలా దోశ తర్వాత స్విగ్గీలో అత్యధికంగా ఆర్డర్ చేసిన వంటకంగా ఇడ్లీ రెండవ స్థానంలో నిలవడం విశేషం.

ఆ రెండు గంటలూ ఇడ్లీ టైమ్

ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య సమయాన్ని ఇడ్లీలను ఆర్డర్ చేయడానికి అత్యంత ప్రాచుర్యం పొందిన టైమ్‌గా స్విగ్గీ గుర్తించింది. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోయంబత్తూర్, ముంబై నగరాల్లో డిన్నర్ సమయాల్లోనూ ఇడ్లీలను ఆర్డర్ చేస్తున్నట్టు పేర్కొంది. దేశంలో ఇడ్లీలను ఎక్కువగా ఆర్డర్ చేసే ప్రధాన మూడు నగరాల్లో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై ఉన్నాయి. ఆ తర్వాత ఢిల్లీ, కలకత్తా, కొచ్చి, ముంబై, కోయంబత్తూర్, పూణే, విశాఖ నగరాలు అనుసరిస్తున్నాయి.

ఆ స్వామికి కేజీన్నర బరువున్న ఇడ్లీ నైవేద్యం

తమిళనాడులోని కంచి దేవరాజస్వామి ఆలయంలో ఒకటిన్నర కిలోల బరువైన ఇడ్లీని ప్రతి రోజూ తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. ఇందుకోసం బియ్యం, మిరియాలు, కొత్తిమీర, అల్లం, ఇంగువ, జీలకర్ర, తగినంత పెరుగు కలిపి మెత్తగా రుబ్బి ఓ పెద్ద ఇడ్లీగా వేసి ఆవిరి మీద ఉడికిస్తారు.



ఆ ఊరు.. ఇడ్లీలకు పెట్టింది పేరు

కేరళ పాలక్కాడ్ జిల్లాలోని రామస్సెరి అనే గ్రామం ఇడ్లీలకు పెట్టింది పేరు. స్పాంజిలా మృదువుగా ఉండే ఈ ఇడ్లీల రహస్యాన్ని ఒకటో శతాబ్దం నుంచీ ఓ కుటుంబం వాళ్లు రహస్యంగా ఉంచుతున్నారు. ఇప్పటికీ కట్టెల పొయ్యి మీద బట్ట కట్టిన మట్టి పాత్రలోనే అక్కడ ఇడ్లీ వండుతారు.

ఇడ్లీలో లభించే పోషకాలివీ

ఇడ్లీ ఆరోగ్యకరమైన అల్పాహారం. మధ్యరకం సైజు ఇడ్లీ నుంచి సుమారు 50 క్యాలరీలు లభిస్తాయి. ఇందులో 0.2 గ్రాముల కొవ్వులు, 1.43 గ్రాముల మాంసకృతులు, 11.48 గ్రాముల పిండి పదార్థాలు, 1.1 గ్రాముల పీచు పదార్థాలు, 279 మిల్లీ గ్రాముల సోడియం, 9 మిల్లీ గ్రాముల పొటాషియం, 1 మిల్లీ గ్రాముల ఇనుము లభిస్తాయి. ఇందులో రోజువారీ పనులకు అవసరమయ్యే పోషకాలన్నీ దాదాపుగా లభిస్తాయి.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- భీమడోలు రైల్వే గేట్ వద్ద వ్యాన్‌ను ఢీకొట్టిన దురంతో ఎక్స్‌ప్రెస్
- అప్పటికే వ్యాన్ నుంచి పారిపోయిన గుర్తు తెలియని వ్యక్తులు
- దెబ్బతిన్న రైలింజన్.. 7 గంటల పాటు ప్రయాణికుల పడిగాపులు
- వ్యాన్‌లోని వారు దొంగలుగా అనుమానం



భీమడోలు రైల్వే గేటు వద్ద రైలు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయ్యిన బొలెరో వ్యాన్

భీమడోలు: ఏలూరు జిల్లా భీమడోలు రైల్వే గేటు వద్ద దురంతో ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో మూసి ఉన్న రైల్వే గేటును అతి వేగంగా దూసుకొచ్చిన ఓ బొలెరో వ్యాన్ ఢీకొట్టింది. అనంతరం పట్టాల పైనే నిలిచిపోయింది. అదే సమయంలో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్ (22204) రైలు ఆ వ్యాన్‌ను ఢీకొట్టింది. అప్పటికే వ్యాన్‌లోని గుర్తుతెలియని వ్యక్తులు.. దానిలో నుంచి దూకి పారిపోయారు. ఈ ఘటనలో వ్యాన్ పూర్తిగా ధ్వంసమవ్వగా.. రైలింజన్ దెబ్బతింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడం.. రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. రైల్వే ఉన్నతాధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైల్వే అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ చౌహాన్ ఆధ్వర్యంలో సిబ్బంది బోగీల నుంచి రైలింజన్‌ను వేరు చేశారు. నుజ్జునుజ్జయిన వ్యాన్‌ను పట్టాలపై నుంచి తొలగించారు. మరో రైలింజన్‌ను తెప్పించి.. ఉదయం 8.48 గంటలకు దురంతో ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించారు. సుమారు ఏడు గంటల పాటు రైలు నిలిచిపోవడంతో.. అందులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజమండ్రి వెళ్లే ప్రయాణికులు బస్సుల్లో వెళ్లిపోయారు. మిగిలినవారంతా రైలులోనే పడిగాపులు కాశారు. ఈ ఘటన వల్ల దాదాపు 20 రైళ్లు ఆలస్యంగా నడిచాయి.

పశువుల దొంగలుగా అనుమానం!

ప్రమాదానికి కారణమైన వ్యాన్‌లోని గుర్తు తెలియని వ్యక్తులను దొంగలుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల నల్లజర్ల ప్రాంతంలో తరచూ పశువులు అపహరణకు గురవుతుండడంతో స్థానికులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి నల్లజర్ల ప్రాంతంలో ఈ వ్యాన్ అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానికులు.. అందులోని వారిని ప్రశ్నించారు. కానీ వారు సరైన జవాబివ్వకపోవడంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు.. హైవే పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. గుండుగొలను పెట్రోలింగ్ సిబ్బంది వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా.. వారి నుంచి తప్పించుకునేందుకు అతి వేగంగా వాహనాన్ని నడుపుతూ భీమడోలు రైల్వే గేటును ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన వ్యాన్ నంబర్ (ఏపీ39యూజీ 5908)ను పోలీసులు గుర్తించగా.. ఆ నంబర్ ఓ పాఠశాల బస్సుదని తేలింది. నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని సీఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.



దెబ్బతిన్న దురంతో ఎక్స్‌ప్రెస్ ఇంజన్



డైనోసార్లకే.. సారు!

బోయింగ్ విమానమంత పొడవు.. కొంచెం అటూఇటూగా 4 అంతస్తుల ఎత్తు.. 57 టన్నుల బరువు.. ఇది టైటనోసార్.. ఈ భూప్రపంచం ఇప్పటివరకూ చూసిన అతి పెద్ద డైనోసార్.. దీని ముందు అంతటి టీ రెక్స్ కూడా జుజుబీనే.. ఎప్పుడో పది కోట్ల ఏళ్ల కింద భూమ్మీద తిరుగాడిన ఈ టైటనోసార్ అస్థి పంజరాన్ని లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియంలో ప్రదర్శనకు పెట్టారు.

నాలుగు డైనోసార్ల ఎముకలతో...

2010లో అర్జెంటీనాలోని ఓ రైతు తన పొలంలో పెద్ద ఎముకను గుర్తించాడు. శాస్త్రవేత్తలు తవ్వకాలు జరపడంతో.. క్రెటాషియస్ కాలానికి చెందిన 6 టైటనోసార్లకు చెందిన 280 ఎముకలు బయటపడ్డాయి. వాటిలో బాగున్న వాటిని కలిపి ఒక పూర్తిస్థాయి టైటనోసార్ డైనోసార్ అస్థిపంజరాన్ని సిద్ధం చేశారు. దీనికి 'పటగోటైటన్ మయోరమ్'గా పేరుపెట్టారు.

- ఈ డైనోసార్ అస్థి పంజరంలోని తొడ ఎముక ఒక్కటే 8 అడుగుల పొడవు, 500 కిలోలకుపైగా బరువు ఉండటం గమనార్హం. మొత్తం టైటనోసార్ ఎముకలను లండన్‌కు తరలించేందుకు రెండు విమానాలు కావాల్సి వచ్చాయి. దీన్ని నేచురల్ హిస్టరీ మ్యూజియంలో మార్చి 31 నుంచి వచ్చే ఏడాది జనవరి వరకు ప్రదర్శించనున్నారు.

రోజుకు 130 కిలోల ఆకులు, కొమ్మలు..

- శాస్త్రవేత్తలు చెప్పిన వివరాల మేరకు.. ఈ టైటనోసార్ పొడవు 121 అడుగులు, ఎత్తు 40 అడుగులు, బరువు 57 టన్నులకుపైగా ఉంటుందని అంచనా. భూమ్మీద తిరుగాడిన అత్యంత బరువైన, పెద్దదైన జంతువు ఇదే.
- ఇది శాఖాహారి. రోజుకు 130 కిలోలకుపైగా చెట్ల ఆకులు, కొమ్మలను తినేస్తుంది.
- ఒకసారికి 40 వరకు గుడ్లను పెడుతుంది. అయితే మాంసాహార డైనోసార్లు, ఇతర జంతువులు, ప్రమాదాల కారణంగా ప్రతి వంద టైటనోసార్ పిల్లల్లో ఒక్కటే పూర్తిస్థాయి వరకు ఎదుగుతుందని అంచనా.
- అంతపెద్ద డైనోసార్ అయినా.. గుడ్డులోంచి బయటికి వచ్చేప్పుడు బరువు నాలుగైదు కిలోలు మాత్రమే. కానీ ఎదిగే వేగం చాలా ఎక్కువ. పుట్టాక రెండు నెలల్లోనే ఏకంగా 40–50 కిలోల వరకు పెరుగుతాయట. ఇదే మనుషులకు అయితే పది పదిహేనేళ్లు పడుతుంది మరి.
- ఆరున్నర కోట్ల ఏళ్ల కింద భూమిని గ్రహశకలం ఢీకొట్టడంతో డైనోసార్లు అంతరించి పోయాయి. ప్రస్తుతం ప్రదర్శనకు పెట్టిన అతిభారీ డైనోసార్.. అంతకు మరో మూడున్నర కోట్ల ముందు బతికినది కావడం విశేషం.



డాక్టర్ చదువుల్లో సమానం!



- అబ్బాయిలతో పోటాపోటీగా అమ్మాయిలు
- బీటెక్, లా కోర్సుల్లో యువతుల శాతం తక్కువే
- కేంద్ర గణాంకాల శాఖ నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఉన్నత విద్యలో మహిళలు దూసుకెళ్తున్నారు. కొన్ని కోర్సుల్లో యువకులను మించి యువతుల సంఖ్య అధికంగా ఉన్నట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక 2022 వెల్లడించింది. దేశంలో 1,59,69,571 మంది యువకులు, 1,50,77,414 మంది యువతులు ఉన్నత విద్య అభ్యసిస్తుండగా ఆర్ట్స్, సైన్స్, మెడికల్, సోషల్ సైన్స్ కోర్సుల్లో అమ్మాయిల సంఖ్య అధికంగా ఉంది. కామర్స్, ఐటీ, కంప్యూటర్స్, మేనేజ్‌మెంట్, న్యాయవాద విద్యలో అబ్బాయిల సంఖ్య ఎక్కువగా ఉంది.

- బీఏలో ప్రతి వంద మంది విద్యార్థులకు (పురుషులు) 109 మంది విద్యార్థినులున్నారు.
- బీఈడీలో ప్రతి వంద మంది విద్యార్థులకు 182 మంది విద్యార్థినులున్నారు.
- బీఎస్సీ (నర్సింగ్‌లో)లో అత్యధికంగా ప్రతి వంద మంది విద్యార్థులకు 308 మంది విద్యార్థినులున్నారు.
- ఎంబీబీఎస్‌లో పురుషులతో సమానంగా ప్రతి వంద మంది విద్యార్థులకు 100 మంది విద్యార్థినులున్నారు.
- ఎంఏలో ప్రతి వంద మంది విద్యార్థులకు 150 మంది విద్యార్థినులున్నారు.
- ఎమ్‌కాంలో ప్రతి వంద మంది విద్యార్థులకు 198 మంది విద్యార్థినులున్నారు.
- ఎమ్మెస్సీలో ప్రతి వంద మంది విద్యార్థులకు 156 మంది విద్యార్థినులున్నారు.
- బీటెక్‌లో ప్రతి వంద మంది విద్యార్థులకు అత్యల్పంగా 40 మంది విద్యార్థినులున్నారు.
- ఎల్ఎల్‌బీలో కూడా యువతులు తక్కువగా ఉన్నారు. ప్రతి వంద మంది విద్యార్థులకు 49 మంది విద్యార్థినులున్నారు.

దేశంలో ఉన్నత చదువులు ఇలా..

సబ్జెక్టు	అబ్బాయిలు	అమ్మాయిలు
ఆర్ట్స్	49,88,246	54,17,424
సైన్స్	23,12,602	25,05,224
కామర్స్	22,27,036	20,96,418
ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ	26,17,155	10,69,136
ఎడ్యుకేషన్	6,08,888	10,40,305
మెడికల్ సైన్స్	6,32,069	8,94,178
సోషల్ సైన్స్	5,48,423	5,57,689
ఐటీ, కంప్యూటర్స్	5,33,445	3,44,492
మేనేజ్‌మెంట్	5,16,273	2,98,594
లా	3,16,115	1,61,897
ఇతర	6,69,319	6,92,057
మొత్తం	1,59,69,571	1,50,77,414

నేవీ కారు యాత్ర ప్రారంభం

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): దేశ భద్రత, నారీశక్తి ప్రదర్శన, అగ్నిపథ్‌పై అవగాహన కల్పించేందుకు 'సామ్ నో వరుణ్ హై' పేరుతో తూర్పు నావికాదళం కారు యాత్రను చేపట్టింది. విశాఖపట్నం నుంచి తిరునల్వేలి వరకు ఐదురోజులపాటు సాగే ఈ కారు యాత్రను గురువారం తూర్పు నావికాదళ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సయన్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 36 మంది నేవీ అధికారులు, ఉద్యోగులు పాల్గొనే కారు యాత్ర కాకినాడ, భీమవరం, మచిలీపట్నం మీదుగా సాగుతూ ఏప్రిల్ 3న తిరునల్వేలిలో ముగుస్తుందన్నారు. ఈ బృందం బీచ్ క్లీనప్ డ్రైవ్‌లు, అగ్నిపథ్, పాఠశాలలు, కళాశాలల్లో నౌకాదళ రిక్రూట్‌మెంట్‌పై ఔట్‌రీచ్ కార్యక్రమాలను నిర్వహిస్తుందని వివరించారు.



కారు యాత్రను ప్రారంభిస్తున్న సంజయ్ వాత్సయన్

చంద్రశేఖర్‌రెడ్డికి వ్యతిరేకంగా ర్యాలీ

- టీడీపీకి అమ్ముడుపోయి ప్రజల్ని మోసం చేశాడంటూ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆగ్రహం
- అనంతరం ఉదయగిరి బస్టాండ్ వద్ద చంద్రశేఖర్‌రెడ్డి హల్‌చల్
- ఆశించిన స్పందన రాకపోవడంతో అసహనం ప్రదర్శిస్తూ వెనుతిరిగిన ఎమ్మెల్యే



బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నేతలు



బస్టాండ్ సెంటర్‌లో తన అనుచరులతో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

ఉదయగిరి: ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి వ్యతిరేకంగా గురువారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ మాజీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీకి అమ్ముడుపోయి నియోజకవర్గ ప్రజల్ని మోసం చేశారని మండిపడ్డారు. నియోజకవర్గంలో తిరిగే హక్కును ఆయన కోల్పోయారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే.. వివిధ పనుల కోసం వారి నుంచే చంద్రశేఖర్‌రెడ్డి భారీగా వసూలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా సీఎం జగన్‌పై అభిమానంతో ఎమ్మెల్యే అరాచకాలను భరించామని చెప్పారు. 2024 ఎన్నికల్లో ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీని గెలిపించి.. టీడీపీకి అమ్ముడుపోయిన చంద్రశేఖర్‌రెడ్డికి బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో వింజమూరు జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, దాసరపల్లి ఎంపీటీసీ సయ్యద్ సుభాని, జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే సుభాని, ఎంపీటీసీ తిరుపతి, నాయకులు మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, మూలె వెంకటసుబ్బారెడ్డి, అక్కుల్‌రెడ్డి, షేక్ షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యం చెల్లించుకుంటారంటూ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరిక!

గురువారం సాయంత్రం బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కొంతసేపు హల్‌చల్ చేశారు. బస్టాండ్ సెంటర్‌లో టీ తాగి కుర్చీ వేసుకుని కూర్చున్నారు. అయితే మద్దతుగా ఎవరూ రాకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. తనపై ఆరోపణలు చేసినవారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతరం అక్కడి నుంచి వెనుతిరిగి వెళ్లిపోయారు.

బాబు హయాంలోనే దళితులపై దాడులు, దౌర్జన్యాలు

- బాబుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి
- ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికే వరప్రసాదరావు డిమాండ్

సాక్షి, అమరావతి: చంద్రబాబు హయాంలోనే దళితులపై దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు ఎక్కువగా జరిగాయని, అందుకు బాధ్యుడైన బాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికే వరప్రసాదరావు డిమాండ్ చేశారు. దళితులపై దమనకాండ అంటూ ఈనాడు రాసిన రాతలను ఖండిస్తూ వరప్రసాదరావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో దళితులపై జరిగిన నేరాల్లో ఆంధ్రప్రదేశ్ తొలి రెండు స్థానాల్లో ఉన్నప్పటికీ రామోజీరావుకు కన్పించలేదని, అప్పుడు దళితులపై జరిగిన దమనకాండపై ఈనాడులో ఎందుకు కథనాలు రాయలేదని ప్రశ్నించారు. రాజకీయంగా చంద్రబాబుకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే ఈనాడు రోత రాతలు రాస్తోందని మండిపడ్డారు. రామోజీ ఫిలిం సిటీ నిర్మాణంలో ఎస్సీ, ఎస్టీ భూములు ఆక్రమించిన రామోజీరావు ఇప్పుడు దళితులపై కపట ప్రేమ కనబర్చడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో దళితులపై దాడులు, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ పాలనలో దళితులకు జరుగుతున్న మేలుపై త్వరలో రాష్ట్ర వ్యాప్త ప్రచారానికి రూట్‌మ్యాప్ ప్రకటిస్తామని తెలిపారు.

తెలంగాణ

స్తంభానికి కట్టి.. కసిగా పొడిచి..

ఏటూరునాగారం: పెళ్లి చేసుకోమని వెంటపడుతుంటే సహించింది. లైంగిక దాడి చేశాడని పోలీసు కేసు పెట్టింది. జైలుకెళ్లి వచ్చాక కూడా వేధిస్తుండటంతో విసిగిపోయింది. స్తంభానికి కట్టేసి కత్తితో పొడిచి చంపి పోలీసులకు లొంగిపోయిందొక యువతి. ములుగు జిల్లా ఏటూరునాగారంలో గురువారం వెలుగు చూసిన ఈ సంఘటనపై పోలీసులు అందించిన వివరాలివి. రాంటెంకి శ్రీనివాస్ (32)కు గతంలో వివాహమైంది. భార్య అతని నుంచి విడాకులు తీసుకోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. స్థానికంగా ఉండే సంగీత అనే యువతికి తల్లిదండ్రుల్లేకపోవడంతో అమ్మమ్మ వద్ద ఉంటోంది. సంగీత, శ్రీనివాస్‌లు గతంలో గుడుంబా వ్యాపారం చేసేవారు. ఏడాదికాలంగా శ్రీనివాస్‌తో సంగీత మాట్లాడడం లేదు. బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో సంగీత ఇంటికి వచ్చిన శ్రీనివాస్ తలుపులు కొట్టాడు. దీంతో విసిగిపోయిన ఆమె బయటికి వచ్చి శ్రీనివాస్‌ను దోమతెర, ప్లాస్టిక్ వైర్‌తో షెడ్డుకు ఉన్న సిమెంట్ స్తంభానికి కట్టేసి కత్తితో కసిదీరా నాలుగైదు సార్లు పొడిచి చంపింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943